
బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# భగవద్గీతాసారం - శ్రీకృష్ణ సందేశం


## తటవర్తి వీరరాఘవరావు



అనుబంధము : బ్రహ్మర్షి పత్రీగారి శ్రీ వసిష్ఠామృతం

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# భగవద్గీతా సారం - శ్రీకృష్ణ సందేశం




రచన మరియు ప్రచురణ :

**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తి వారి వీధి, భీమవరం-534 201. (ప॥గో॥జిల్లా.)

సెల్ : 9440309812, 9490171853

# భగవద్గీతా సారం - శ్రీకృష్ణ సందేశం

రచన : **తటవర్తి వీరరాఘవరావు**


మొదటి ముద్రణ : **మే, 2011**
ప్రతులు : **3,000**

రెండవ ముద్రణ : **అక్టోబర్, 2011**
ప్రతులు : **3,000**

మూడవ ముద్రణ: **ఆగస్టు, 2012**
ప్రతులు : **2,000**

నాల్గవ ముద్రణ : **నవంబరు, 2012**
ప్రతులు : **3,000**

ఐదవ ముద్రణ : **ఆగస్టు, 2013**
ప్రతులు : **1,000**

ఆరవ ముద్రణ : **నవంబరు, 2018**
ప్రతులు : **1,000**

ఏడవ ముద్రణ : **ఫిబ్రవరి, 2021**
ప్రతులు : **1,000**

వెల : **రూ. 130/-లు**





బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన **ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం** నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

***ప్రవేశం*** : *మూడురోజులకు భోజనం, వసతి ఉచితం*

***వేదిక*** : *శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,*** *తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.*
*సెల్ : 94403 09812, 94901 71853*

# INDEX


1. భగవద్గీతలో భోధించింది ఆరాధనా? ఆత్మజ్ఞానమా? 5
2. జ్ఞానం అంటే? 18
3. భగవానుడు సగుణుడా?నిర్గుణుడా? 20
4. భగవద్గీతలో విగ్రహామే 'నేను' అని ఎక్కడా చెప్పలేదు! 25
5. భగవంతుడు ఎలా సమర్పించమన్నాడు? 29
6. "భగవానుని గురించి, భగవానుడు బోధించిన దాని గురించి ఆలోచించండి!" 32
7. భగవద్గీతను బట్టి ఆరాధనలు రెండు రకాలు! 36
8. భగవానుడు చెప్పింది "అందరూ ఒక్కటే!" 41
9. భగవానుడు "ఉద్ధరేదాత్మనాత్మానం" అనడానికి కారణం 47
10. "భగవానుడు యోగివికా! అన్నాడు కానీ, భోగివికా! అనలేదు" 49
11. భగవద్గీతను బట్టి యోగి ఎవరు? భోగి ఎవరు? 56
12. భగవంతునికి ఇష్టమైనవారు ఎవరు? 57
13. భగవద్గీతను బట్టి గోవిందా! గోవిందా!! అనాలా? గోవిందునితో వుండాలా? 62
14. భగవంతుని చేరాలంటే? 67
15. భగవద్గీతలో కష్టాలు సమస్యలు గురించి! 69
16. భగవద్గీతలో పునర్జన్మల గురించి! 78
17. భగవద్గీతలో కర్మలు గురించి! 86
18. భగవద్గీతార్థాన్ని "అనుకోవడం కాదు-అనుభవించాలి!" 103
19. భగవద్గీతలో యుగాంతం గురించి! 105
20. భగవద్గీతలో జీవహింస గురించి! 110
21. భగవద్గీతను బట్టి మానవుని ఆహారం శాకాహారమా? మాంసాహారమా? 120
22. భగవద్గీత అర్థం కావాలంటే 125
23. "భగవద్గీతను బట్టి జ్ఞానులు! అజ్ఞానులు!" 128
24. బ్రహ్మర్షి పత్రీజీ సత్యవాక్కులు - 1 134


## అనుబంధము



బ్రహ్మర్షి పత్రీగారి శ్రీ వసిష్ఠామృతం 135

# ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస
# ప్రపంచ మాస్టర్లలారా! ఏకం కండి!



## పిరమిడ్ ధ్యానుల 18 ఆదర్శ సూత్రాలు

1. సరైన ధ్యానం... అంటే ఆనాపానసతి ధ్యానం... క్రమం తప్పకుండా చేయాలి; ఆనాపానసతి ధ్యానాన్ని అందరిచేతా చేయించాలి.
2. ఆత్మవిజ్ఞాన పుస్తకాలను విస్తారంగా చదవాలి... ఉదాహరణకు : స్వామీ రామా, యోగానంద పరమహంస, ఓషో, లోబ్‌సాంగ్ రాంపా, కాస్టానెడా, జేన్ రాబర్ట్స్, రిఛార్డ్ బాక్, అనీబిసెంట్, లిండా గుడ్‌మాన్, దీపక్ చోప్రా, బ్రయాన్ వైస్, సిల్వియా బ్రౌన్, బార్బరా మార్సిన్యాక్.... మొదలైన మాస్టర్ల యొక్క అద్భుత గ్రంధాలు.
3. ధ్యానంలో కలిగే అనుభవాలను తోటి ధ్యానులతో విధిగా పంచుకోవాలి.
4. వీలయినంత వరకు మౌనాన్ని పాటించాలి.
5. పౌర్ణమి రాత్రులలో ధ్యానం తప్పనిసరి... వీలయినంత సామూహికంగా!
6. అవకాశం ఉన్న చోటల్లా పిరమిడ్ శక్తిని ఇతోధికంగా వినియోగించుకోవాలి!
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి!
8. మాంసాహారం ముట్టకండి! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమితాహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు అధికంగా చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్ననాటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ విధిగా గరపాలి.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణా కార్యక్రమాల్లో డబ్బు లావాదేవీలు పెట్టుకోకూడదు.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ ఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. స్వంత ఆత్మశక్తితోనే... సర్వ వ్యక్తిగత సమస్యలను, ఎప్పటికప్పుడు పరిష్కరించు కుంటూ వుండాలి.
16. సాధారణ గృహస్థ జీవితాన్ని ఆనందంగా గడపాలి.
17. అన్ని గ్రామాలలోనూ, అన్ని పట్టణాలలోనూ పిరమిడ్ ధ్యాన కేంద్రాలను విధిగా నెలకొల్పాలి.
18. ధ్యానానుభవాలనూ, ఆధ్యాత్మిక ప్రగతి విశేషాలనూ లిఖితపరచి విధిగా ప్రచురించాలి.



# భగవద్గీతలో బోధించింది ఆరాధనా? ఆత్మజ్ఞానమా?

చాలామంది భగవద్గీతను పారాయణ చేస్తూ, వింటూ, అధ్యయనం చేస్తూ, బోధిస్తూ భగవానుని ఆరాధిస్తున్నారు. ఎవరికి తోచిన రీతిలో, ఎవరికి నచ్చిన విధంగా వారు ఆరాధిస్తున్నారు. పూజించేవారు కొందరైతే, ప్రార్ధించేవారు కొందరు, భజన చేసేవారు కొందరు, నోములు, వ్రతాలు చేసేవారు కొందరు, నామ స్మరణలు చేసేవారు కొందరు, స్తోత్రాలు చేసేవారు కొందరు, జపాలు చేసేవారు కొందరు; ఇలా ఎవరికి ఏది నచ్చితే ఆ రకంగా ఆరాధిస్తున్నారు. కాని అందరూ ఆరాధించేవారే!

మరి భగవద్గీత సారమంతా ఆరాధించమనేనా? శ్రీ కృష్ణ భగవానుడు బోధించిందంతా రకరకాల ఆరాధనలు గురించేనా? అంటే! కాదని స్పష్టంగా చెప్పవచ్చు. భగవద్గీత ద్వారా భగవానుడు అర్జునునకు దు:ఖం నుంచి బయటపడడానికి "ఆత్మ జ్ఞానాన్ని" బోధించాడు.

అర్జునుడు గోప్ప బాహు బలం కలవాడు. క్షత్రియవీరుడు, రాజ వంశానికి చెందినవాడు, రాజు, విలువిద్యలో మేటి. ఎన్నో శస్త్రాస్త్ర విద్యలు నేర్చుకున్నవాడు, ఎన్నో మహిమాన్వితమైన అస్త్రాలు సంపాదించుకున్నవాడు. ఎంతోమందిని జయించినవాడు. శ్రీ కృష్ణ భగవానునికి అతి సన్నిహితుడేకాదు ప్రియుడు, బంధువు కూడా! అంతటి మహావీరుడైన అర్జునుడు యుద్ధం ప్రారంభం కాకముందే కౌరవ సేనను చూసి భయంతో అక్కడే చతికిలపడి, దు:ఖితుడై ఏమీ చేయలేనివాడిలా వున్నపుడు! శ్రీ కృష్ణ భగవానుడు ఆత్మ జ్ఞానాన్ని బోధించాడు. అలా ఆత్మజ్ఞానం బోధించి అర్జునుని దు:ఖం తొలగించి కార్యోన్ముఖుణ్ణి చేసాడు. అతని ధర్మాన్ని నిర్వర్తించేలా చేసాడు. ఇదే "భగవద్గీతాసారం".

అర్జునునకు అన్నీ వున్నా ఆత్మజ్ఞానం లేకపోవడం వల్ల, దు:ఖానికి

లోనయ్యాడు, చింతాక్రాంతుడయ్యాడు, చిన్న పిల్లవాడివలే క్రింద కూర్చుని విలపించాడు. అంతటివాడు అలా ప్రవర్తించాడంటే కారణం ఆత్మజ్ఞానం లేకపోవడమే. ఆత్మకు సంభందించిన జ్ఞానం లేకపోవడమే.

ఆత్మజ్ఞానం పొందిన వారిని 'యోగి' అంటారు. విశేషమైన ఆత్మజ్ఞానం కలవారిని 'మహా యోగి' అంటారు. అలాంటి యోగులందరిలో గొప్పవాడిని 'యోగీశ్వరుడు' అంటారు. అలాంటి యోగీశ్వరుడే శ్రీ కృష్ణ భగవానుడు. అందుకే ఆయన అద్భుతమైన ఆత్మజ్ఞానాన్ని అర్జునునకు బోధించగలిగాడు.

ఆత్మజ్ఞానం లేకపోతే నరుడు అంటారు. ఆత్మజ్ఞానం పొందితే నారాయణుడు అంటారు. ఎన్ని వున్నా ఆత్మజ్ఞానం లేకపోతే ఎవరైనా దు:ఖానికి లోను కావలసిందే! ఏమీ లేకపోయినా ఆత్మజ్ఞానం కలిగినవాడు ఎప్పుడూ ఆనందంలో వుంటాడు. మానవునికి ముఖ్యంగా కావలసింది ఆత్మజ్ఞానం. అంతేకాని ఆడంబరాలు కాదు. ఆడంబరాలు దు:ఖాన్ని తొలగించలేవు సరికదా... దు:ఖాన్ని పెంచుతాయి. కాని ఆత్మజ్ఞానం దు:ఖాన్ని తొలగించడమే కాదు... శాశ్వత ఆనందాన్ని కలగచేస్తుంది.

అందుకే శ్రీ కృష్ణ భగవానుడు లోకం కోసం అర్జునుని పేరుతో గీతను భోధించడం జరిగింది. అర్జునునకు భోధించబడింది అంటే లోకానికి భోధించినట్టే కదా? అంటే మనందరికీ బోధించినట్టే కదా?

ప్రస్తుతం లోకాన్ని గమనిస్తే అందరికి అన్నీ వున్నాయి. ఎవరికీ తిండికి లోటు లేదు, కట్టుకోవడానికి లోటు లేదు, వుండడానికి లోటు లేదు. ఇంకా కొంతమంది ఏ స్థితిలో వున్నారంటే వేలకోట్ల రూపాయలతో విలాసవంతమైన ఇళ్ళు నిర్మించుకోగలుగుతున్నారు. కాని ఇన్ని వున్నా, ఎవరికీ శాంతి లేదు. ఎవరికీ సరైన ఆరోగ్యం లేదు. ఎవరికీ భాంధవ్యాలు సరిగాలేవు. కుటుంబంలోనే సరైన భాంధవ్యాలు లేకపోతే ఇక సమాజంలో ఇతరులతో సరైన సంబంధాలు ఎలా వుంటాయి? అందుకే ఎవరికీ ఎవరి మీదా ప్రేమానురాగాలు లేవు. ఒకరిని చూస్తే ఒకరికి ద్వేషం. ఎవరిని చూసినా అసూయ, ఓర్వలేనితనం. ప్రతి చిన్న విషయానికి కక్షసాధింపు చర్యలు, పగ, ప్రతీకారం. అలా లోకంలో హింస ప్రబలి పోయింది. స్వార్ధం పెచ్చు పెరిగిపోయింది. ఒకరిని చూసి ఒకరు సహించలేక పోతున్నారు. దేశాలమధ్య, రాష్ట్రాలమధ్యేకాదు! ఒకే రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య విభేధాలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి.

సోదరులలా వుండే వారేకాదు! సోదరులు కూడా కలహించుకుంటున్నారు. ఎక్కడ చూసినా నిరాశా నిస్పృహలే! "ఎందుకీ జీవితం?" అనే స్థాయిలో మానవులు బతుకుతున్నారు. అంతటా దు:ఖమే! ఇదీ ప్రస్తుత ప్రపంచ స్థితి!

దీనికంతటికీ ముఖ్యకారణం మానవులలో ఆత్మజ్ఞానం పూర్తిగా లోపించడమే! మానవులు దు:ఖం నుంచి బయటపడాలంటే; భగవానుడు బోధించిన ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి. కానీ దాని బదులు, ఆరాధనలు చేస్తున్నారు. గమనిస్తే ఇలా ఎన్నో తరాల నుంచి చేస్తూనే వున్నారు. కాని గమనిస్తే ఎవరికీ దుఃఖం తొలగలేదని అర్థం అవుతుంది. ఆలోచించండి ఆరాధనలే దు:ఖాన్ని నివారించగలిగితే! తొలగించగలిగితే! కొంత మందైనా జీవితంలో దు:ఖం లేకుండా వుండగలిగే వారు కదా? మరి అలా ఎవరున్నారు? గమనిస్తే లేరనే చెప్పవచ్చు. అంటే ఆరాధనలు దుఃఖ నివారణా మార్గం కాదని స్పష్టంగా అర్థం అవుతుంది.

శ్రీ కృష్ణ భగవానుడు బోధించినది ఆరాధనే అయితే! ఖచ్చితంగా లోకమంతా ఆనందంగా జీవించి వుండేవారు. మరి అంతా ఆనందంగా వున్నారా? లేరుగా? అంటే ఆయన అసత్యం భోధించడుగా! అసత్యమార్గం చూపించడుగా? అలా బోధిస్తే ఆయన భగవానుడు ఎలా అవుతాడు? అందుచేత ఆయన భోధించింది 'ఆరాధనలు' కాదు. 'ఆత్మజ్ఞానం' మాత్రమేనని తెలుసుకోవాలి. అందుచేత భగవానుడు బోధించిన ఆత్మజ్ఞానం గురించి! ఆత్మజ్ఞానం వల్ల దు:ఖం ఎలా నివారణవుతుంది..? అన్న విషయాలు కొద్దిగా తెలుసుకుందాం.

ముఖ్యంగా మానవుడు ఆత్మ గురించి ఎందుకు తెలుసుకోవాలి? ఆత్మజ్ఞానం ఎందుకు పొందాలి? ఆత్మజ్ఞానం పొందితే దుఃఖం ఎందుకు రాదు? దుఃఖం ఎలాపోతుంది? అన్నది తెలుసుకుందాం.

మానవుడు అంటే దేహం ఒక్కటే కాదు. దేహము, మనస్సు, ఆత్మ... ఈ మూడు కలిపితేనే మానవుడు. ఈ మూడింటిలో 'ఆత్మే' గోప్పది, ప్రముఖమైనది, కీలకమైనది, శక్తివంతమైనది కూడా.! కారణం ఆత్మ లేకపోతే దేహము వుండదు, మనస్సు వుండదు. అంతేకాదు 'దేహం' అశాశ్వతం. కాని 'ఆత్మ' శాశ్వతం. అందుచేత అంతటి గొప్పదైన 'ఆత్మ' గురించి తెలుసు కోవడం, అధ్యయనం చెయ్యడం చాలా చాలా అవసరం. అంటే ఆత్మకు

సంబంధించిన జ్ఞానం చాలా అవసరం. మానవునిలో ఆత్మది ప్రముఖపాత్ర కాబట్టి, మానవ జీవితం అంతా ఆత్మను బట్టే వుంది. ఆత్మలేకపోతే అసలు జీవితమే లేదు. మానవజీవితం పరిసమాప్తమైపోతుంది.

కొంచెం గమనించండి! ఆత్మ లేకపోతే అంటే ఆత్మ శరీరం నుంచి తప్పుకుంటే శరీరం శవమైపోతుంది. కళ్ళు చూడలేవు, నోరు మాట్లాడలేదు, చెవులు వినలేవు, ముక్కు వాసన చూడలేదు, చేతులు, కాళ్ళు పనిచేయ్యవు. అంటే ఈ పనులన్నీ మానవుడు చెయగలుగుతున్నాడంటే! దానికి ఆత్మే కారణం.

అంతేకాదు ఇంద్రియాల ద్వారా మానవుడు ఎన్నో సుఖాలు అనుభవిస్తున్నాడు. టి.వి. లు చూస్తున్నాడు. ఎన్నో సుందర దృశ్యాలు చూస్తున్నాడు, మధురమైన ధ్వనులు, పాటలు విని ఆనందిస్తున్నాడు. మంచి మంచి సువాసనలు గ్రహిస్తున్నాడు. రక,రకాల రుచులను ఆస్వాదిస్తున్నాడు. ఇవన్నీ ఆత్మ వుండడం వల్లే కదా? అంతేకాదు ఆత్మ లేకపోతే ఎవరికీ జీవిత భాగస్వామి వుండదు కదా? ఆ ఆనందం పొందలేరు కదా? అందుకే భార్య లేకపోయినా, భర్తలేకపోయినా, శేష జీవితమంతా దు:ఖిస్తూనే వుంటారు. అంటే  మానవుని సుఖానికీ ఆత్మే కారణం. దు:ఖానికీ ఆత్మ లేకపోవడమే కారణం.

అంతేకాదు మానవ శరీరంలో జరిగే శ్వాసక్రియ, జీర్ణక్రీయ, రక్తప్రసరణ క్రియ, విసర్జనక్రియలు లాంటి సుమారు రెండు వందల క్రియలు ఆత్మశక్తి వల్లే జరుగుతున్నాయి. మానవుడు ఆరోగ్యంగా జీవించ గలుగుతున్నాడు. ఆత్మే లేకపోతే ఈ క్రియలన్నీ ఆగిపోతాయి. ఆత్మ లేకపోతే మానవుడు ఆహారం తినలేడు. కోసి కడుపులో వుంచినా జీర్ణమవ్వదు. అంటే ఆత్మ ఎంత గొప్పదో! ఆత్మ పాత్ర ఎంత ప్రముఖమైందో! అర్థం చేసుకోవచ్చు. ఆత్మ యొక్క గొప్పతనం  గీతలో ఇంకా చెప్పబడింది.

**శ్లో॥ నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావక:**
**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుత: (భ.గీ 2-23)**

తా:- ఈ ఆత్మను ఆయుధాలు ఛేధించలేవు, అగ్ని దహించలేదు, నీరు తడపలేదు, గాలి ఎండింప లేదు.

అంటే ఆత్మను ఇవేమీ చెయలేవు కాని ఇవన్నీ దేహాన్ని చెయ్యగలవు. అంటే దేహం కంటే ఆత్మ ఎంత గొప్పదో తెలుసుకోవచ్చు అంతేకాదు...

**శ్లో॥ న జాయతే మ్రియతే వా కదాచి న్నాయం భూత్వాభవితా వా న భూయం:**
**అజో నిత్యశ్శాశ్వతోయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే (భ.గీ.2-20)**

తా:- ఈ ఆత్మ ఎప్పుడూ పుట్టుట లేదు చచ్చుట లేదు. ఇది వరకు లేకుండా మరల కొత్తగా కలుగుటలేదు. ఆత్మ శాశ్వతమైనది. పురాతనమైనది. శరీరము చంపబడినా ఆత్మ చంపబడదు.

అంటే ఆత్మకు చావు పుట్టుకలు లేనివని. పుట్టేది, చనిపోయేది శరీరమేనని అర్థమవుతుంది కదా? గమనిస్తే సృష్టిలో పుట్టినవన్నీ చనిపోతున్నాయి. సృష్టించబడినవన్నీ అదృశ్యమైపోతున్నాయి. అంటే ఈ సృష్టిలో కనిపించే వాటన్నిటికంటే 'ఆత్మ' గొప్పదే కదా? మానవులు ఈ సృష్టిలో కనిపించేవే గొప్పవనుకుంటున్నారు, వాటి కోసమే ఆశపడుతున్నారు, తాపత్రయపడుతున్నారు, వాటిని పొందటానికి జీవితాంతం కష్టపడుతున్నారు. కాని 'ఆత్మ' గొప్పతనాన్ని గ్రహించటం లేదు.

ఎంతసేపూ నశించిపోయే శరీరం గురించి ఆలోచిస్తున్నారు, రీసెర్చిలు చేస్తున్నారు, అధ్యయనాలు చేస్తున్నారు. ఇంకా కనిపించే ప్రకృతి గురించి, జంతువుల గురించి, ఇతర జీవరాశుల గురించి అద్యయనం చేస్తున్నారు. కాని ఆత్మ గురించి ఎవరూ అద్యయనం చెయ్యటం లేదు. రీసెర్చిలు చెయ్యటం లేదు. అందుకే 'ఆత్మ' గురించి ఎవరికీ తెలియటం లేదు. 'ఆత్మ' గొప్పతనం ఎవరికీ అర్దం కావటం లేదు. అసలు ఇంతకీ ఎవరీ 'ఆత్మ'? 'ఆత్మజ్ఞానం' ఎందుకు కావాలి? 'ఆత్మ' గురించి ఎందుకు తెలుసుకోవాలి? అన్న విషయాలు తెలుసుకుందాం. 'ఆత్మ' ఎవరో భగవద్గీతలోనే చెప్పబడింది.

**శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః**
**అహమాదిశ్చ మద్యం చ భూతానామన్త ఏవ చ (భ.గీ 10-20)**

తా: ఓ అర్జునా! సర్వప్రాణులలో స్థితమైవున్న 'ఆత్మ'ను నేనే అయివున్నాను. మరియు ప్రాణుల యొక్క ఆదిమద్యాంతములు నేనే అయివున్నాను.

ఈ శ్లోకాన్ని బట్టి **సమస్త మానవాళి ఇష్టపడి ఆరాధించే, పూజించే, ప్రార్థించే, కనపడని భగవంతుడే 'ఆత్మ'** అని తెలుస్తుంది. అందుకే 'ఆత్మకు' చావు పుట్టుకలు లేవు. అనంతమైన శక్తి వుంది. అంతటా వ్యాపించి వుంది. అందరిలో వుంది. అన్నిటికి ఆధారమై వుంది, గోప్పదై వుంది, కారణం 'ఆత్మే' భగవంతుడు కనుక. అటువంటి భగవంతుని గూర్చి అద్యయనం

చెయ్యాలికదా? తెలుసుకోవాలి కదా? కాని మానవులు 'భగవంతుని' అంటే 'ఆత్మ' గురించి తెలుసుకోవడం లేదు. అలా తెలుసుకోకపోవడమే మానవుల దుఃఖానికి కారణం. అందుకే 'ఆత్మ' గురించి తెలుసుకోవాలి. ఆత్మకు సంబంధించిన జ్ఞానం పొందాలి. అంటే 'ఆత్మజ్ఞానం' సంపాదించుకోవాలి.

**ముఖ్యంగా 'ఆత్మ' అంటే 'భగవంతుని' గురించి తెలియకపోవడం వల్లే లోకంలో విగ్రహారాధనలు, ఫోటో ప్రార్ధనలు చేస్తున్నారు. 'ఆత్మ' గురించి తెలిస్తే ఫలితాన్నిచ్చే 'ఆత్మ' ఆరాధనే చేసివుండేవారు అంటే 'ధ్యానమే' చేసి వుండేవారు.**

అంతేకాదు 'ఆత్మ' గురించి తెలుసుకుంటే 'భగవంతుడు' అన్ని జీవులలో, ప్రాణులలో అంటే అన్ని జంతువులలో, అందరి మానవులలో వున్నాడన్న విషయం అర్ధమవుతుంది. అంటే అన్నీ భగవంతుని రూపాలేనని అర్ధమవుతుంది. అపుడు మానవులు వేటినీ హింసించరు, భాధించరు, వేధించరు, చంపరు, మాంస భక్షణ చెయ్యరు. మానవుల దు:ఖానికి మూలకారణమైన ఈ రకమైన పాపాలు చెయ్యరు.

'హింస' అంటే ఇతర జంతువులను, ఇతర మానవులను, శారీరకంగా, మానసికంగా భాధించడం. ఇదే పాపం. ఈ పాపమే కష్టాలకు, దు:ఖానికి కారణం. అంటే దు:ఖం ఎందుకు వస్తుంది? హింసాయుతమైన పనులు అంటే కర్మలు చెయ్యడం వల్లనే కదా? ఆ పనులు ఎందుకు చేస్తున్నారు?. అందరూ ఆత్మ స్వరూపులే... అన్నీ భగవంతుని రూపాలే... అందరూ ఒక్కటే అన్న జ్ఞానం లేకపోవడం వల్లనే కదా? ఆ జ్ఞానమే వుంటే, ఈ రకంగా ప్రవర్తించరు కదా? అపుడు దుఃఖం రాదు కదా? అందుచేత దు:ఖానికి కారణం ఆత్మజ్ఞానం లేకపోవడం వల్లనేనని స్పష్టంగా తెలుసుకోవచ్చు.

అంతేకాదు ఆత్మజ్ఞానం వున్నవారు, ఆత్మగురించి తెలుసుకున్నవారు, అర్ధం చేసుకున్నవారు, సృష్టిలో అన్నీ భగవత్ స్వరూపాలే అని భావించి అన్నిటితో స్నేహంగా వుంటారు. ఒకరికొకరు సాయం చేసుకుంటారు, మంచిచేస్తారు, అన్నిటిని ప్రేమిస్తారు, అన్నిటికి ఆనందం కలిగిస్తారు. అలా ప్రవర్తించడమే 'పుణ్యం', దీనివల్ల కష్టాలు రావు సరికదా ఎప్పుడూ ఆనందంగా జీవిస్తారు. ప్రార్ధనలు అవసరం లేదు. ఆరాధనలు అవసరం లేదు ఆనందంగా వుండేవారికి అందుకే శ్రీ కృష్ణ భగవానుడు 'ఆత్మజ్ఞానం' భోధించారు.

ఇప్పటి వరకు ఆత్మే భగవంతుడు అని తెలుసుకున్నాం. కాని 'ఆత్మ' గురించి తెలుసుకోవలసిన రహస్యం ఇంకోకటి వుంది. ఎమిటంటే మానవులు కనిపించే దేహమే తామని భావిస్తున్నారు. కాని కనిపించని 'ఆత్మే' తాము అని తెలుసుకోలేకపోతున్నారు. కానీ మానవులు తెలుసుకోవలసిన అసలు రహస్యం ఇదే. మానవులు 'ఆత్మ'కు సంబంధించి తెలుసుకోవలసిన అసలైన జ్ఞానం ఇదే. అంటే **నేను 'దేహాన్ని' కాదు 'ఆత్మ'ను** అన్న సత్యాన్ని తెలుసుకోవాలి.

కానీ లోకంలో మానవులకు వున్న అవగాహన ఏమిటంటే! **"దేహం నేను, లోపల వున్నది నా ఆత్మ** అని; కాని అసలు సత్యం ఏమిటంటే! **"ఆత్మే నేను, దేహం నాది".**

ఎందుచేతనంటే ఇప్పటిదాకా మానవులు ఏ ఆత్మను నిర్లక్ష్యం చేసారో, ఏ ఆత్మకు ప్రాముఖ్యం ఇవ్వలేదో! భగవంతుడని తెలుసుకోలేదో! **"ఆ ఆత్మ తానే" అంటే "తానే భగవంతుడు".**

మరి ఆత్మ నేను అన్నది ఎలా తెలుస్తుంది? ఇది అర్ధం కావాలంటే ముందు మనం ఒక ప్రశ్న వేసుకోవాలి. అసలు మనకు ఇంకా జన్మలు వున్నాయా? లేవా? ముందు ఇది తేల్చుకోవాలి. ఇది ఎలా తెలుస్తుంది? కొంచెం ఆలోచిస్తే తెలుస్తుంది. ఎందుకంటే మానవుడు అంటే రెండు కలిపి మానవుడు. ఒకటి నశించిపోయే 'దేహం', రెండు నశింపులేని 'ఆత్మ'.

మనకే కనుక ఇంకా జన్మలు వుంటే! చనిపోయిన తరువాత వుండేది 'ఆత్మ' కాబట్టి, 'ఆత్మ' మనమవుతాం. మనకే కనుక జన్మలు లేకపోతే! చనిపోయిన తరువాత కాలిపోయి ఉండనిది 'దేహం' కాబట్టి 'దేహం' మనమవుతాం. అందుకే ముందు ఈ ప్రశ్న వేసుకోవాలి. మనకు ఇంకా జన్మలు వున్నాయా? లేవా?

కానీ ఈ విషయం గురించి మనం ఎక్కువగా ఆలోచించవలసిన పని లేదు. కారణం ఈ విషయం గీతలో భగవానుడు స్పష్టంగా చెప్పారు. అంటే! మనకు ఇంకా జన్మలు వున్నాయని, మనం ఇంకా వుంటామని ఈ క్రింది శ్లోకం ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ**
**తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి. (భ.గీ 2-27)**

తా:- జన్మించిన వానికి మృత్యువు తప్పదు మృతి చెందిన వానికి జన్మించడం

తప్పదు. తప్పనిసరియగు ఈ విషయం గురించి నీవు శోకించుట తగదు.

ఈ శ్లోకం ద్వారా భగవానుడు జన్మించినవాడు మరణిస్తాడని, అలాగే మరణించిన వాడు మళ్ళీ జన్మిస్తాడని, అంటే ఎవరికీ మరణం లేదని. మరణం లేనిదాని గురించి, మరణించనివాడి గురించి ఏడవడమెందుకు? అని అర్జునుని ద్వారా భగవానుడు మానవకోటికి సందేశం ఇచ్చారు.

మరి చనిపోతున్నారు కదా? చనిపోయేది ఎవరు? అంటే చనిపోయేది మన దేహం మాత్రమే. మనం కాదు. కారణం మనం 'ఆత్మలం' కనుక, మనకు చావులేదు. అందుకే **"మరణించడమంటే 'ఆత్మ' అంటే మనం పాత శరీరాన్ని వదలడం, అలాగే "జన్మించడమంటే 'ఆత్మ' అంటే మనం కొత్త శరీరాన్ని తీసుకోవడం"** అని తెలుసుకోవాలి. ఈ విషయాన్నే భగవానుడు ఈ క్రింది శ్లోకంలో వివరించారు.

**శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ. (భ.గీ 2-22)**

తా:- చిరిగిపోయిన పాతబట్టలు విడిచి మానవుడు క్రొత్తబట్టలు ఎలా ధరిస్తున్నాడో! అలాగే ఆత్మ (మనం) ముసలిదైన పాత శరీరాన్ని వదలి కొత్త శరీరాన్ని ధరిస్తున్నాం.

ఆత్మకు సంబంధించిన జ్ఞానం లేకపోవడం వల్ల మానవుడు తాను ఆత్మయై వుండి; తనకు చావు లేకపోయినా! చనిపోతానేమోనని, తనవారు చనిపోయారని ఎంతో దు:ఖిస్తున్నాడు. చూడండి లోకంలో ప్రతి మానవుడూ చావుకు ఎంత భయపడతాడో! చావంటే ఎంత భయమో! మరి నిజంగా తనకు చావు వుందా? చనిపోతాడా? అంటే రెండూలేవు. కాని మరి దు:ఖం ఎందుకు? అంటే 'ఆత్మ' తాను అని తెలియకే కదా? ఆత్మకు సంబంధించిన జ్ఞానం లేకే కదా? అందుకే ఈ విషయం తెలిసిన అంటే 'ఆత్మ జ్ఞానం' కలిగిన యోగులు చావుకు భయపడరు.

అందుకే **"యోగులు చెప్పి చస్తారు - భోగులు చెపితే చస్తారు".**

'ఆత్మజ్ఞానం' పెరిగే కొద్దీ ఇంకొక రహస్యం బోధపడుతుంది. ఎందుకంటే మొదట 'ఆత్మే భగవంతుడు' అని తెలుసుకున్నాం. తరువాత "ఆ "ఆత్మ నేనే" అని తెలుసుకున్నాం. అంటే దీని అర్థం "నేనే భగవంతుడు". అని స్పష్టంగా తెలుస్తుంది కదా? మరి సృష్టిలో ఇదొక గొప్ప రహస్యమే

కాదు, 'సత్యం' కూడా! అందుకే వేదాలు "అహంబ్రహ్మాస్మి" అన్న సత్యాన్ని చెప్పాయి. అంటే "నేను భగవంతుడ్ని". ఈ విషయం 'ఆత్మజ్ఞానం' లేని వారికి ఏం తెలుస్తుంది? కచ్చితంగా తెలియదు.

అందుకే "నేనే భగవంతుడ్ని" అన్న విషయం తెలియనివారు నేను మానవుణ్ణి అనుకుంటూ భగవంతుడు ఎక్కడో వున్నాడనుకుంటూ ఎక్కడెక్కడకో తిరుగుతున్నారు, ఎన్నో పుణ్యక్షేత్రాలు తిరుగుతున్నారు, ఎన్నో గుళ్ళు దర్శిస్తున్నారు, పూజలు చేస్తున్నారు. విగ్రహాలకు మొక్కుతున్నారు నానా పాట్లు పడుతున్నారు. కోరికలు తీరలేదని, కష్టాలు పోలేదని భగవంతుని మీద నిందలేస్తున్నారు. దేవుళ్ళను మారుస్తున్నారు, మతాలు మారుస్తున్నారు, ఆరాధనలు మారుస్తున్నారు. ఇదంతా ఆత్మజ్ఞానం లేకపోవడంవల్లే కదా? ఆత్మజ్ఞానం వుంటే ఇలా ప్రవర్తించరు కదా?

ఈ విషయాన్నే శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు కూడా చెప్పడం జరిగింది.

**"వెదకి వెదకి వెదకి వేసారి వేసారి**
**అచట నిచట లేడ టంచు నెంచి**
**తరచి చూచి తాను తనలోన గనుగొనె**
**కాళికాంబ! హంస! కాళికాంబ!"**

తా:- భగవంతునికోసం! ఎక్కడెక్కడోవెతకి, ఎన్నో పుణ్యక్షేత్రాలు, కాశీ, రామేశ్వరం, తిరుపతి ఇలా ఎన్నో జన్మలు, ఎన్నో నదులకు, ఎన్నో సముద్రాలకు తిరిగి తిరిగి చివరకు విసుగుచెంది అక్కడాలేదు ఇక్కడా లేదు అని తెలుసుకుని, మరి ఎక్కడ వున్నాడు? ఎక్కడ వున్నాడు? అని ఆలోచించి, ఆలోచించి చివరకు తనలోనే వున్నాడని మానవుడు తెలుసుకుంటున్నాడు.

ఇదే విషయాన్ని యోగి వేమనగారు కూడా చెప్పారు.

**"బ్రహ్మమనంగవేరె పరదేశమున లేడు!**
**బ్రహ్మమనగ దానె బట్టబయలు!**
**తన్ను దానెరిగిన తానెపో బ్రహ్మంబు!**
**విశ్వధాభిరామ వినుర వేమ!"**

తా:- భగవంతుడు వేరే ఎక్కడో లేడు. రహస్యమేమిటంటే! తానే ఆ భగవంతుడు. నిన్ను నువ్వు తెలుసుకుంటే! 'నువ్వే భగవంతుడని' తెలుస్తుంది అని వేమనగారు

చెప్పారు.

ఎప్పుడయితే 'ఆత్మజ్ఞానం' సంపాదించుకుని, 'ఆత్మ' నేను అని తెలుసుకుంటారో, 'నేనే భగవంతుణ్ణి' అని తెలుసుకుంటారో! భగవంతుడు వేరే లేడని అర్థం చేసుకుంటారో! అపుడు **"ప్రార్ధనలు మాని సాధనలు మొదలు పెడతారు అన్నీ సాధిస్తారు". "ఆరాధనలు మాని ఆచరణ మొదలు పెడతారు. జీవితంలో మంచి ఫలితాలు సాధిస్తారు". భగవానుని "ఉద్ధరించమనరు. ఆయన భోధించినట్లు ఉద్దరించుకునే ప్రయత్నం చేస్తారు". "హీన భావం పోయి ధీర భావం వస్తుంది!" జీవితంలో "దుఃఖంపోయి ఆనందం ప్రవేశిస్తుంది".**

అలా ఇంకా ఇంకా ఆత్మజ్ఞానాన్ని పెంచుకుంటుంటే మరొక సృష్టి రహస్యం భోధపడుతుంది. "అహం బ్రహ్మోస్మి" అని మాత్రమే కాకుండా "తత్వమసి" అనే మరొక వేదవాక్కు కూడా అర్ధమవుతుంది. **"నేను ఏదయితే అయి వున్నానో నువ్వూ అదే!" అన్నది కూడా తెలుస్తుంది.** "మమాత్మా సర్వభూతాత్మా" అన్నది తెలుస్తుంది! అంటే **నా 'ఆత్మ' ఏదయితే వుందో అందరిలో వున్నది అదే 'ఆత్మ' అన్నది తెలుస్తుంది.** అంటే **"నేనూ అందరూ ఒక్కటే"** అన్న సత్యం తెలుస్తుంది. అందరూ అంటే సర్వ మానవులేకాక సర్వ జీవులూ ఒక్కటే అన్న సత్యం తెలుస్తుంది. అంటే **"నేనే అంతా! అంతా నేనే!"** అన్నది అర్ధం అవుతుంది. ఈ సృష్టిలో వున్న అందరూ ఒక్కటే అన్న సత్యం అర్ధమవుతుంది. అంతా భగవత్ స్వరూపమే అన్నది తెలుస్తుంది.

**ఆభరణాలు వేరైనా, బంగారం ఒక్కటేనట్లుగానే! కుండలు వేరైనా, మట్టి ఒక్కటైనట్లుగానే! వస్త్రాలు వేరైనా, నూలు ఒక్కటైనట్లుగానే! రూపాలు వేరైనా, మానవులు, జంతువులూ అన్నీ ఒక్కటే!** అన్నది అర్ధం అవుతుంది. అంతా నేనే అన్నది అర్ధం అవుతుంది. అప్పుడు తన ప్రవర్తన, నడవడిక, చేతలు అన్నీ మారిపోతాయి. అప్పటిదాకా అన్నీ వేరు వేరు అన్న భావంతో జీవించినవాడు, ప్రవర్తించినవాడు, అందరూ నేనూ ఒక్కటే అని జీవిస్తాడు.

అప్పుడు రాగ, ద్వేషాలు వుండవు. కారణం అన్నీ తానైనపుడు ఎవరిని ద్వేషిస్తాడు? ఎవరిని ద్వేషించినా తనను తాను ద్వేషించుకున్నట్టే! అందుచేత ఎవరినీ ద్వేషించడు. ఎవరి మీదా ప్రత్యేకమైన అనురాగము వుండదు. కారణం అంతా ఒకటే కనుక! వేరు వేరు అయితే అనురాగంలో తేడా వుంటుంది.

నా వాడని, పరాయి వాడని. కాని అంతా ఒకటే అయినపుడు ఆ తేడా వుండదు కదా! అపుడు ఎవరినీ హింసించడు. కారణం ఎవరిని హింసించినా తనను తాను హింసించుకున్నట్టే! ఎవరిని మోసగించినా, దోచుకున్నా, అవమానించినా, హేళన చేసినా తన్ను తాను చేసుకున్నట్టే! ఇది అర్థం చేసుకున్నవాడు ఆ పనులు చేస్తాడా? చెయ్యడు కదా? అలాగే ఎవరి కంటే ఎక్కువ కావాలని ప్రయత్నించడు. ఆధిపత్యం చెయ్యాలని ప్రయత్నించడు.

మానవులే కాదు జంతువులే కాదు. సమస్త జీవులు కూడా తానే వేటిని తెలుసుకుంటాడు. అపుడు వేటిని కూడా హింసించడు, భక్షించడు. కానీ ఇవన్నీ చేస్తున్నాడంటే ఆత్మ జ్ఞానం లేక పోబట్టే కదా! ఆత్మ గురించి తెలియక పోబట్టే కదా? ఆ జ్ఞానం లేకే అన్నీ వేరు వేరు అనుకుంటూ, తాను వేరు అనుకుంటూ, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు, పాపాలు చేస్తున్నాడు, కష్టాలపాలవుతున్నాడు. దు:ఖం అనుభవిస్తున్నాడు. మరి ఆత్మజ్ఞానం వుంటే ఈ దు:ఖం వుండదు కదా? దు:ఖమే లేకపోతే దు:ఖం పోయే ప్రయత్నం అంటే ఆరాధనలు చేయనవసరం లేదు కదా!

ఈ జ్ఞానం ఇంకా పరిపూర్ణ స్థితికి చేరుకున్నపుడు ఇంకోక రహస్యం తెలుస్తుంది. అసలైన సత్యం భోధపడుతుంది. అసలు ఈ సృష్టిలో వేరోకటి ఏదీలేదు, ఉన్నది 'భగవంతుడు' ఒక్కడే! ఆ 'పరబ్రహ్మ' ఒక్కడే! అన్నీ వేరు వేరుగా వున్నట్టు కనిపిస్తున్నా! వున్నది బ్రహ్మమొక్కటే! అన్నది తెలుస్తుంది.

అందుకే **"ఏకంసత్ విప్రాబహుదావదంతి"** అని అన్నారు. అంటే 'సత్యం' ఒక్కటే! అంటే భగవంతుడు ఒక్కడే! కాని ఎన్నో వున్నట్టుగా కనిపిస్తున్నాయి.

ఇదే విషయాన్ని గీతలో కూడా చెప్పడం జరిగింది.

**శ్లో॥ అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున**
**విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితోజగత్. (భ.గీ 10-42)**

తా:- అర్జునా! ఇప్పటి దాకా వివరించిన విస్తారమైన ఈ జ్ఞానముచే నీకేమి ప్రయోజనము? ఈ జగత్తు నంతా నేనే వ్యాపించి వున్నానని తెలిసికొనుము.

పై శ్లోకాల ద్వారా భగవానుడు అంతా తానే తప్ప ఇంకేమీ లేదని చెప్పడం జరిగింది.

అలా ఎప్పుడయితే ఈ సృష్టి అసలు రహస్యాన్ని తెలుసుకుంటాడో

వాడికి, భూమి మీద ఇక తెలుసుకోవలసింది ఉండదు. అటువంటివాడు ఇక భూమి మీదకు రావలసిన అవసరం ఉండదు. రాడు కూడా! దీనినే 'నిర్వాణం' అంటారు, 'మోక్షం' అని కూడా అంటారు.

ఈ రహస్యం తెలుసుకోనంతవరకు ఎన్ని తెలుసుకున్నా, ఎన్ని పొందినా, మరల మరల భూమి మీదకు రావలసిందే! జన్మ తీసుకోవలసిందే! పరిపూర్ణజ్ఞానం సంపాదించుకోవలసిందే!

అందుకే లోకంలో 4 రకాల భక్తివుందని చెపుతూ వుంటారు. వాటిలో మొదటిది 'అధమాభక్తి' అంటే కోరికలతో ఆరాధించడం.

రెండవది 'ఉత్తమభక్తి' అంటే కోరికలు లేకుండా ఆరాధించడం.

మూడవది 'అనన్యభక్తి' అంటే అన్నిటిలో వున్నది భగవానుడే అని తెలుసుకుని ధ్యానించడం.

నాలుగవది 'పరిపూర్ణభక్తి' అంటే వేరు, వేరు అన్నది ఏదీ లేదు, అన్నీ భగవంతుడే అన్న జ్ఞానాన్ని పొందడం.

ఈ సృష్టి రహస్యం తెలుసు కనుకనే శ్రీ కృష్ణభగవానుడు అర్జునునకు భగవద్గీత ద్వారా 'ఆత్మ జ్ఞానాన్ని' బోధించాడు. అంతేకాని ఆరాధన భోధించలేదు. ఆరాధనే కనుక భగవానుడు బోధించి వుంటే! ఎలా ఆరాధించాలో కూడా గీతలోనే తెలియజేసివుందుడు కదా? మరి గీతలో పూజా విధానం ఎక్కడైనా ఉందా? సంకల్పంతో ప్రారంభించి, అష్టోత్రం ఎలా చెయ్యాలి? సహస్రారం ఎలా చెయ్యాలి? అభిషేకం ఎలా చెయ్యాలి? అగరబత్తి ఎప్పుడు వెలిగించాలి, హారతి ఎలా ఇవ్వాలి? మంత్రపుష్పం ఎలా చెప్పాలి? అన్నవి గీతలో ఎక్కడ వున్నాయి? లేవు కదా? నివేదనలు, ఆరగింపులు, మేలుకొలుపులు, పవళింపు సేవలు లాంటి విధానాలు గీతలో లేవు కదా? మరి ఆరాధనే దుఃఖ నివారణా మార్గమయితే, ఇవన్నీ భగవానుడు గీతలోనే తెలియచేసి ఉందుడు కదా? లేదు అంటే గీతలో భగవానుడు భోధించింది 'ఆత్మజ్ఞానమే' కాని 'ఆరాధన' కాదని స్పష్టంగా అర్ధమవుతుంది.

కాని ఈ విషయం అర్దం చేసుకోలేక భగవానుడు బోధించిన 'ఆత్మజ్ఞానం' అర్దంకాక అందరూ ఆరాధనలు చేస్తున్నారు, చేయిస్తున్నారు, ప్రోత్సహిస్తున్నారు. మరి భగవానుడు చెప్పింది ఒకటయితే మానవులు చేసేది ఇంకొకటి. మరి మానవుల కష్టాలు ఎలా పోతాయి? రాకుండా ఎలా

వుంటాయి? సమస్యలు లేకుండా ఎలా వుంటాయి? దుఃఖం లేకుండా వుంటుందా? అంటే వుండదు కదా? అందుకే లోకంలో ఆరాధనల దారి ఆరాధనలది; దుఃఖం దారి దుఃఖానిది. ఇదే ప్రస్తుత మానవజీవితం. సమాజం తీరు. అర్ధం చేసుకోండి భగవానుడు భోధించింది "ఆత్మజ్ఞానమే కాని, ఆరాధన కాదు". అర్జునుని దుఃఖం నివారించడానికే, లోకం కోసమే ఈ భోధ అంతా.

మరి శ్రీ కృష్ణులంతటి వారి భోధ అర్దం కావాలంటే దేహస్థితిలో వున్నవారికి అర్దంకాదు. మనో స్దితిలో వున్నవారికీ అర్దం కాదు. అలాగే బుద్ధిస్దితిలో వున్న వారికీ అర్దం కాదు. కాని ఎవరైతే 'ఆత్మ స్థితికి' చేరుకుంటారో, వారికే స్పష్టంగా అర్దమవుతుంది.

మరి 'ఆత్మ స్థితికి' చేరుకోవాలంటే ఏం చెయ్యాలి? రెండే రెండు. ఒకటి ప్రకృతి విరుద్దమైన మాంసాహారం తీసుకోకూడదు. పంచ భూతాలతో తయారైన ప్రకృతి సహజ సిద్ధమైన, **"సాత్వికమైన శాకాహారం"** తీసుకోవాలి. రెండు **"శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం"** చెయ్యాలి.

ధ్యానం చెయ్యడమంటే ఆత్మ మీద దృష్టి వుంచడం, అంటే సాక్షాత్తూ భగవంతుని మీద దృష్టి వుంచడం! అలా ఈ రెండూ ఎవరైతే పాటిస్తారో వారు మెల్లిగా ఆత్మస్థితికి చేరుకుంటారు. కృష్ణభగవానుడు చెప్పింది అర్దం చేసుకుంటారు.

ఈ రెండూ పాటించకపోతే ఎప్పటికీ భగవద్గీత అర్థం కాదు. శ్రీ కృష్ణుడు చెప్పింది బోధపడదు. 'ఆరాధనే' గొప్పదనుకుంటారు. 'ఆత్మజ్ఞానం' గురించి పట్టించుకోరు. దుఃఖంలోనే జీవిస్తారు. అందుచేత దుఃఖం పోవాలంటే "మాంసాహారం మానాలి! ధ్యానం చెయ్యాలి! ఆత్మజ్ఞానం పొందాలి"! భగవానుడు బోధించింది 'ఆత్మజ్ఞానమే' అని తెలుసుకోవాలి.

**"అందమైన పుష్పమాల మరునాటికి వాడిపోతుంది కానీ దారం మాత్రం వాడిపోదు అలాగే వుంటుంది. అలాగే ప్రపంచంలో ప్రతీది వాడిపోయి అంతరించిపోయేదే. ఏదీ శాశ్వతం కాదు. కానీ భగవంతుడొక్కడే శాశ్వతం. అందుచేత భగవంతుని పొందాలి. భగవంతుని జ్ఞానం (ఆత్మజ్ఞానం) సంపాదించుకోవాలి.**



# జ్ఞానం అంటే ?

జ్ఞానం రెండు రకాలు (1) అసత్య జ్ఞానం, (2) సత్య జ్ఞానం.

అసత్య జ్ఞానం అంటే దేహానికి సంబంధించిన జ్ఞానం. దేహ జ్ఞానం.

సత్య జ్ఞానం అంటే ఆత్మకు సంబంధించిన జ్ఞానం. ఆత్మ జ్ఞానం.

లోకంలో అసత్య జ్ఞానమే ఎక్కువ వుంది. కారణం అందరూ దేహజ్ఞానమే కలిగివున్నారు. ఆ జ్ఞానంతోనే ప్రవర్తిస్తున్నారు. జీవిస్తున్నారు. ఎక్కువ మంది అదే బోధిస్తున్నారు. సత్యజ్ఞానం అంటే 'ఆత్మ జ్ఞానం' తెలిసిన వారు తక్కువే! బోధించేవారు కూడా తక్కువే! కానీ శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతలో బోధించిందంతా 'ఆత్మజ్ఞానమే'.

అందరూ గీతను పారాయణ చేస్తున్నారు. బోధిస్తున్నారు. వింటున్నారు. కానీ భగవానుడు బోధించింది. ఎవరికీ అర్థం కాలేదు. కారణం అందరూ దేహ జ్ఞానంతోనే జీవిస్తున్నారు. దేహమే తామని భావిస్తున్నారు. దేహ సుఖం, దేహ అలంకారం, దేహ అందం, దేహ సౌష్టవం, దేహ ఆరోగ్యం. దేహ ఆనందం కోసం మాత్రమే చూస్తున్నారు. ప్రాముఖ్యం ఇస్తున్నారు. వాటినే కోరుతున్నారు.

అందరికీ దేహ జ్ఞానం మాత్రమే వుండటం వలన దేహాలు చూస్తూ అందరూ వేరు వేరు అనుకుంటున్నారు. అన్ని జంతువులు, ప్రాణులు వేరు వేరు అనుకుంటున్నారు. అలాగే ప్రవర్తిస్తున్నారు. దేహాలను చూసి వేరే వేరే కులాలనుకుంటున్నారు. వేరే వేరే మతాలనుకుంటున్నారు. ప్రాంతాలనుకుంటు న్నారు. వేరే దేశాలనుకుంటున్నారు. అలాగే ప్రవర్తిస్తున్నారు. వేరే అనుకోవడం వల్ల అందరి మీద ద్వేషం చూపిస్తున్నారు. స్వార్థం ప్రదర్శిస్తున్నారు. కలహించు కుంటున్నారు. యుద్ధాలు చేస్తున్నారు. చివరకు దుఃఖం పాలవుతున్నారు.

కానీ ఆత్మజ్ఞానం వుంటే ఆత్మే భగవంతుడని తెలుసుకుంటే అందరిలో వున్నది ఒకే ఆత్మ అంటే ఒకే భగవంతుడు అని తెలుసుకుంటే మానవుల ప్రవర్తన ఇలా వుండదు. అంతా ఒకటే అన్నట్టుగా వుంటుంది.

అందుకే దేహజ్ఞానం వున్నవారంతా మానవులు ఏర్పాటు చేసుకున్న ఆచారాలు పాటిస్తున్నారు. ఆచారాలే ముఖ్యమనుకుంటున్నారు. కానీ ఆత్మజ్ఞానం వున్నవారు, ఆచారాల కంటే భగవంతుడు ఏర్పాటు చేసిన ధర్మాలకే ప్రాముఖ్యం ఇస్తారు. ధర్మయుక్తంగా జీవిస్తారు.

ఈ లోకంలో చూస్తే ఆచారాలు పాటించే వారంతా కష్టాలలో వుండడమే కాదు, భగవంతుడ్ని రక్షించమని ప్రార్థిస్తున్నారు. పూజిస్తున్నారు. ఆరాధనలు చేస్తున్నారు.

కానీ ధర్మాలు పాటించేవారు ఆటోమేటిక్‌గా రక్షింపబడి ఆనందంగా జీవిస్తారు.

అందుకే "ధర్మోరక్షతి రక్షితః" అన్నారు.

అంతేకానీ 'ఆచారో రక్షతి, రక్షితః' అనలేదు.

అందుచేత సత్యజ్ఞానమైన ఆత్మజ్ఞానం సంపాదించుకోండి. శ్రీ కృష్ణ భగవానుడు బోధించిన మార్గంలో పయనించండి. మరి ఆత్మకు సంబంధించిన జ్ఞానం తెలియాలంటే ఆత్మను ఆశ్రయించవలసిందే. ఆత్మను పట్టుకోవలసిందే. మరి అంతరంగంలో వున్న ఆత్మను ఆశ్రయించాలంటే! అంతర్ముఖులు కావలసిందే. అంటే ధ్యానం చెయ్యవలసిందే. అందుచేత ధ్యానం చెయ్యండి. 'ఆత్మజ్ఞానం' అంటే 'సత్యజ్ఞానాన్ని' సంపాదించుకోండి.

తెలుసుకోండి **"మానవుల ఆచారాల కంటే భగవంతుని ధర్మమే గొప్పది".**

**"మాయ యందు ఆసక్తి పెరిగితే దైవమందు ఆసక్తి తగ్గుతుంది.**
**మాయ యందు విరక్తి పెరిగితే దైవమందు ఆసక్తి పెరుగుతుంది"**



# భగవానుడు సగుణుడా? -నిర్గుణుడా?

భగవానుడు సగుణుడా? నిర్గుణుడా? అనే సందేహం చాలా మందికి వుంది. కొంత మంది సగుణుడని, కొంతమంది నిర్గుణుడని, ఇంకా కొంతమంది ఆయన సగుణరూపుడు మరియు నిర్గుణుడు అని కూడా చెపుతూ వుంటారు.

లోకంలో చాలా మంది ఆయన సగుణరూపుడని భావిస్తూ సగుణోపాసన అంటే, రూపాన్ని ఆరాధిస్తున్నారు. ఆయన నిర్గుణుడు అని భావించేవారు కూడా నిర్గుణోపాసన కష్టతరమైనదని భావిస్తూ సగుణోపాసనే చేస్తున్నారు, చెపుతున్నారు, ప్రోత్సహిస్తున్నారు. అలా లోకంలో గమనిస్తే సగుణోపాసనే కనిపిస్తుంది.

మరి ఇంతకీ భగవానుడు సగుణుడా? నిర్గుణుడా? అని చూస్తే భగవద్గీతలో భగవానుడు తాను నిర్గుణుడననే చెప్పుకున్నాడు. నిర్గుణోపాసనే చెయ్యమని కూడా చెప్పడం జరిగింది. నిర్గుణోపాసన చేసిన వారే తన్ను చేరగలరని, ముక్తిని పొందగలరని చెప్పడం కూడా జరిగింది. ఈ క్రింది శ్లోకంలో తాను ఎవరో చెప్పడం జరిగింది.

**శ్లో॥ అహమాత్మ గుడాకేశా సర్వభూతాశయ స్థితః**
**అహమాదిశ్చ మద్యంచ భూతానామన్త ఏవచ (భ.గీ.10-20)**

తా:- ఓ అర్జునా! సర్వప్రాణులలో స్థితమైవున్న ఆత్మను నేనే అయి వున్నాను. మరియు ప్రాణుల యొక్క ఆది మద్యాంతములున్ను నేనే అయి వున్నాను.

అంటే కనిపించే రూపాన్ని నేను కాదు. కనిపించని 'ఆత్మే' నేను అని

చెప్పడం జరిగింది. ఆత్మ సగుణం కాదు కదా! అంటే భగవానుడు సగుణుడు కాదు కదా?

అంతే కాదు తాను సగుణ రూపుడని భావించేవారిని అవివేకులు, మూఢులు అని సంబోధించడం కూడా జరిగింది. భగవద్గీతలోని ఈ క్రింది శ్లోకాలను చూద్దాం :-

**శ్లో॥ అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యన్తే మామబుద్ధయః**
**పరం భావమజానన్తో మమావ్యయమనుత్తమమ్ (భ.గీ.7-24)**

తా:- నాశరహితమైననట్టి, సర్వోత్తమైనట్టి, ప్రకృతికి పరమై విలసిల్లు నట్టియు నా స్వరూపమును తెలియని 'అవివేకులు'. అవ్యక్తరూపుడునగు నన్ను, పాంచ భౌతిక దేహమును పొందిన వానిగా తలంచుచున్నారు.

అంతేకాదు ఆయన ఇంకా :-

**శ్లో॥ అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్**
**పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్ (భ.గీ.9-11)**

తా:- నా యొక్క పరమతత్వమును ఎరుగని మూఢులు, సమస్త ప్రాణులకు నియామకుడను అగు నన్ను మనుష్య దేహమును ధరించిన వానినిగా భావించి, నన్ను అవమానించుచున్నారు.

అలా భగవానుడు తాను నిరాకారుడిననే చెప్పుకున్నాడు కానీ సాకారుడనని చెప్పుకోలేదు. తనను సాకారుడిగా భావించేవారు తనను అవమానించేవారని కూడా చెప్పడం జరిగింది.

మరి ఆయన సాకారుడు కాకపోతే! కనిపించే ఆ ఆకారం ఎవరు? ఆయన కాదా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. మరి కనిపించే ఆ ఆకారం ఎవరు? అది కూడా ఆయనే ఈ క్రింది శ్లోకం ద్వారా చెప్పారు.

**శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహి(భ.గీ.2-22)**

తా:- చిరిగిపోయిన పాత బట్టలు వదలి, మనుజుడు క్రొత్త బట్టలు ఎలా ధరిస్తున్నాడో! అలాగే దేహియగు 'ఆత్మ' కూడా శిథిలమైన పాత శరీరం

వదలి ఇతరములైన క్రొత్త శరీరము ధరించుచున్నాడు.

దీనిని బట్టి కనిపించే రూపం “ఆయన దేహమే కాని, ఆయన కాదు” అని అర్థమవుతుంది. అది భగవానుడు (ఆత్మ) ధరించిన వస్త్రం లాంటిదని ఆయనే చెప్పడం జరిగింది. ఈ వాక్యాన్ని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. “ఆయనదే కానీ ఆయన కాదు” అన్న దాంట్లో చాలా అర్థం వుంది. అంటే మనం ఆయన్ను వదిలేసి, ఆయన కాని రూపాన్ని ఆరాధిస్తున్నాం. ఆయనను మర్చిపోయాం. మరి ఆయన ఎందుకు అలా దేహం ధరించవలసివచ్చింది?

ఆ రూపం లోక కళ్యాణార్థం, ధర్మ సంస్థాపనార్థం ఆయన తీసుకున్న దేహం. అంటే మనం వేసుకున్న వస్త్రం లాంటిదని ఆయనే చెప్పడం జరిగింది. ఇదే విషయం ఈ క్రింది శ్లోకం ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే! (భ.గీ.4-8)**

తా:- సాధు సజ్జనులను సంరక్షించడానికి దుష్టులను వినాశనము చేయటానికి, ధర్మాన్ని స్థాపించటానికి నేను ప్రతి యుగమును జన్మించుచున్నాను.

అంటే ఆత్మయైన భగవంతుడు లోక కళ్యాణార్థమై దేహాన్ని ధరిస్తున్నాడు. అంతేకాదు అలా నేను ఎన్నో జన్మలు ఎత్తాను. అంటే ఎన్నో దేహాలు ధరించాను అని ఆయన చెప్పడం కూడా జరిగింది. అంటే అది ఆయన తీసుకున్న అనేక జన్మల్లో ఒక దేహం, అంటే ఆయన తీసుకున్న అనేక దేహాల్లో ఒకటి. అంటే ఆయన తొడుక్కున్న అనేక వస్త్రాల్లో ఒకటని మనం తెలుసుకోవచ్చు. అలా నేను ఎన్నో జన్మలు ఎత్తాను అని చెప్పిన ఈ క్రింది శ్లోకం చూద్దాం.

**శ్లో॥ బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప (భ.గీ.4-5)**

తా:- ఓ అర్జునా! నీకు, నాకు ఇంత వరకు అనేక జన్మలు గడిచాయి. కానీ వాటన్నిటినీ నేనెరుగుదును, కానీ నీవెరుగవు.

అంటే ఇక్కడ స్పష్టంగా భగవానుడు తాను అనేక జన్మలు తీసుకున్నట్టు చెప్పడం జరిగింది. అందులో ఒక జన్మ ప్రస్తుతం మనమంతా శ్రీ కృష్ణుడు

అని అనుకునేది. కానీ అది ఈ జన్మలో ఆయన తీసుకున్న దేహం.

దీనిని బట్టి మనం ప్రతీరోజూ ఒక్కొక్క వస్త్రం మారుస్తున్నట్టుగా ఆయన కూడా ప్రతి జన్మలో ఒక్కొక్క దేహం మారుస్తున్నట్టుగా మనకు అర్థమవుతుంది. అలా ప్రతి జన్మలో ఆయన దేహాలు మారుతున్నాయి కానీ, ఆయన మారటం లేదు. కారణం ఆయన మారడు. ఆయనకు మార్పు లేదు. కారణం ఆయన శాశ్వతుడు, నిత్యుడు, చావు పుట్టుకలు లేని వాడు. అందుచేత ప్రస్తుతం వున్నది ఆయన తొడుక్కున్న వస్త్రం లాంటిదే కాని, ఆయన కాదు అని మనం తెలుసుకోవాలి.

అంటే మనం మారే వస్త్రాలను ఆశ్రయిస్తున్నాం కానీ, మార్పు చెందని శాశ్వతమైన భగవానుని (ఆత్మను) ఆశ్రయించడం లేదు. అంటే రూపం కాదు రూపంలోని 'ఆత్మ'ను ఆశ్రయించాలి. 'ఆత్మ'ను ఆశ్రయిస్తేనే భగవానుని ఆశ్రయించినట్టు!

మరి ఆయన ఎవరు? అని మరల ప్రశ్నించుకుంటే! ఆయన 'ఆత్మ స్వరూపుడు'. సర్వ ప్రాణులలో అంతర్యామిగా వున్నవాడు. నిరాకారుడు. నాశనము లేనివాడు. ఇంద్రియములకు గోచరము కాని వాడు. ఆయన గురించి తెలుసుకో సక్యము కాని వాడు. నిత్యమైన వాడు. అంతటను వ్యాపించి వున్న వాడు అని ఆయనే చెప్పడం జరిగింది.

ఆయన ఇంకా :-

**శ్లో॥ యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే**
**సర్వత్రగమచిన్త్యం చ కూటస్థమచలం ధ్రువమ్ (భ.గీ. 12-3)**

**శ్లో॥ సంనియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః**
**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః (భ.గీ. 12-4)**

తా:- ఎవరు ఇంద్రియములన్నిటిని స్వాధీన పరచుకొని ఎల్లెడల సమభావము కలవారై, సమస్త ప్రాణులకు హితమొనర్చుట యందాసక్తి కలవారై, ఇట్టిదని నిర్దేసింప శక్యము కానిది, ఇంద్రియములకు గోచరము కానిది, ఇట్టిదని ఊహింపనలవికానిది, నిర్వికారమైనది, చలించనిది, నిత్యమైనది అంతటను వ్యాపించియున్నదియునగు 'అక్షర పర బ్రహ్మము'ను (ఆత్మను) ధ్యానించు చున్నారో, వారు నన్ను పొందుచున్నారు.

అంటే భగవానుని పొందాలంటే! అంటే చేరాలంటే! ఇంద్రియాలకు గోచరము కాని వాడిని ధ్యానించాలి. అంటే ఇంద్రియాలతో సాధ్యం కాదు అన్నది స్పష్టంగా అర్థం అవుతుంది. అంటే ఇంద్రియాలను ఉపయోగించ కూడదు. అంటే ఇంద్రియాలకు అతీతమైన స్థితికి చేరుకోవాలి. ఆ మార్గమే 'శ్వాస మీద ధ్యాస ధ్యానం'. అంటే అలాంటి నిర్గుణ, నిరాకార భగవానుని ధ్యానం ద్వారానే సాధించగలం తప్ప మరొక మార్గం లేదు.

అయితే భగవానుడు సగుణుడా? నిర్గుణుడా? అని తర్కించుకోవలసిన పని లేదు. సందేహించవలసిన పని లేదు. తాను నిర్గుణుడినని భగవానుడే స్పష్టంగా, స్వయంగా చెప్పడం జరిగింది. అలాగే 'నిర్గుణోపాసన' చెయ్యమనే పై శ్లోకాలలో చెప్పబడింది. అందుచేత "నిర్గుణోపాసనే భగవానుని సత్యమైన ఆరాధన, ఫలితాన్నిచ్చే ముక్తి ఆరాధన". 'సగుణారాధనలన్నీ' ఫలితం ఇవ్వని తృప్తిని కలిగించే ఆరాధనలని అర్థం చేసుకోవచ్చు.

కానీ చాలా మంది 'నిర్గుణోపాసన' సామాన్యులకు కష్టసాధ్యమని అది అందరూ చెయ్యలేరని చెపుతూ 'సగుణోపాసన' చెయ్యవచ్చు. చెయ్యమని చెపుతూ వుంటారు. ప్రోత్సహిస్తూ వుంటారు. కానీ ఫలితం లేని ఆరాధనలు ఎన్ని చేసినా వ్యర్థమని తెలుసుకోవాలి. కష్టమైనా సరే ఫలితాన్ని ఇచ్చే, భగవంతుడు బోధించిన 'నిర్గుణోపాసనే' చెయ్యాలి. 'ముక్తి'ని పొందాలి.

మరి 'నిర్గుణోపాసన' అంటే ఏమిటి? ఎలా చెయ్యాలి? ఇది మాత్రం ఎవరూ చెప్పరు. ఎంతసేపూ 'నిర్గుణోపాసన' కష్టమైనదని చెప్తారు. కాని అది ఎలా చెయ్యాలో ఎవరూ చెప్పరు. కానీ బ్రహ్మర్షి సుభాష్ పత్రి గారు భగవానుని ఆరాధించే నిర్గుణోపాసన, సామాన్యుడు కూడా ఆచరించే విధంగా మనకు అందించడం జరిగింది. ఆ మార్గమే "శ్వాస మీద ధ్యాస ధ్యానం" అందుచేత ఈ ధ్యానం ఎవరయితే చేస్తారో వారు ఇహంలో ప్రాపంచిక సమస్యల నుండి ముక్తిని పొందడమే కాదు, పరంలో భగవానుని పొంది శాశ్వతముక్తిని కూడా పొందుతారు.

తెలుసుకోండి. భగవంతుడు నిర్గుణుడు. అంతేకాని సగుణుడు కాదు. సగుణారాధన సరైన మార్గం కాదు. నిర్గుణారాధనే సరైనది. అంటే "ధ్యానమే సత్యమైన భగవదారాధన". అంతర్యామియైన 'భగవానుని' అంటే 'ఆత్మ'ను ఆరాధించాలంటే అంతర్ముఖులు కావలసిందే! అంటే ధ్యానం చెయ్యవలసిందే! మరొక మార్గం లేదు. అందుచేత అందరం ధ్యానం చేద్దాం. ముక్తిని పొందుదాం.



# భగవద్గీతలో విగ్రహమే 'నేను' అని ఎక్కడా చెప్పలేదు!

లోకంలో విగ్రహమే భగవంతుడు అన్న ప్రగాఢమైన నమ్మకం వుంది. అందుచేత విగ్రహాన్ని మాత్రమే పవిత్రంగా చూస్తున్నారు. విగ్రహం దగ్గర మాత్రవమే పవిత్రంగా వుంటున్నారు. ఇంక దేనినీ పవిత్రంగా చూడరు. విగ్రహం తప్ప లోకంలో ఏదీ భగవంతుడు కానట్టు ప్రవర్తిస్తారు.

విగ్రహాన్నే గౌరవిస్తారు ఇక దేనిని గౌరవించరు. విగ్రహానికే సేవ చేస్తారు మిగతా జీవులను, జంతువులను హింసిస్తారు, భక్షిస్తారు. విగ్రహాన్ని పూజించి ఆనందపచడానికి ప్రయత్నిస్తారు. మిగతా వారిని అవమానించి భాధిస్తారు. విగ్రహాన్నే గోప్పగా చూస్తారు. మిగతా వారిని, మిగతా వాటిని తక్కువగా చూస్తారు. విగ్రహానికి మాత్రమే కానుకలు సమర్పిస్తారు మిగతా వారిని మోసగిస్తారు, దోచుకుంటారు.

లోకంలో విగ్రహమే గొప్పదైనట్టు ఇక ఏదీ గొప్పది కానట్టు, గొప్పది లేనట్టు ప్రవరిస్తారు. ఆలోచించండి మరి విగ్రహం తప్ప లోకంలో ఏదీ గొప్పది కాదా? గొప్పది లేదా? అంటే అన్నీ గొప్పవే. అన్నీ భగవత్ స్వరూపాలే! కారణం **"భగవంతుడు కానిదీ, భగవంతుడు లేనిది అంటూ ఏదీ లోకంలో లేదు".** అంతా ఆయనే అన్నీ ఆయనే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అసలు ఉన్నది ఆయనే! మిగిలిన వన్నీ ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి.

విచిత్రం ఏమిటంటే భగవద్గీతలో భగవానుడు ఎన్నిటినో తాను అని చెప్పాడు. కాని విగ్రహమే తానని ఎక్కడా చెప్పలేదు. కాని లోకంలోని మానవులు విగ్రహం తప్ప ఇక ఏదీ భగవంతుడుకానట్టు, విగ్రహమే భగవంతుడయినట్టు ప్రవర్తిస్తున్నారు. ఈ క్రింది శ్లోకాలు ఒక్కసారి చూద్దాం:-

**శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః**
**అహమాదిశ్చ మధ్యంచ భూతానామన్త ఏవ చ. (భ.గీ 10-20)**

తా: ఓ అర్జునా! సర్వప్రాణులలో స్థితమైవున్న ఆత్మను నేనే అయివున్నాను. మరియు ప్రాణులయొక్క ఆదిమధ్యాంతములు నేనే అయివున్నాను.

**శ్లో॥ ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్**
**మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ. (భ.గీ 10-21)**

తా: నేను ఆదిత్యులలో విష్ణువనువాడను, ప్రకాశింపజేయువానిలో కిరణములుగల సూర్యుడను, మరుత్తులను దేవతలలో మరీచియనువాడను, నక్షత్రములలో చంద్రుడను అయియున్నాను.

**శ్లో॥ వేదానాం సామవేదోస్మి దేవానామస్మి వాసవః**
**ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా. (భ.గీ 10-22)**

తా: నేను వేదములలో సామవేదమును, దేవతలలో ఇంద్రుడను, ఇంద్రియములలో మనస్సును, ప్రాణులలో చైతన్యమును అయివున్నాను.

**శ్లో॥ రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్**
**వసూనాం పావకశ్చాస్మి మేరుశ్శిఖరిణామహమ్. (భ.గీ 10-23)**

తా:- నేను రుద్రులలో శంకరుడనువాడను, యక్షులలోను, రాక్షసులలోను కుబేరుడను, వస్తువులలో అగ్నియు, పర్వతములలో మేరువును అయియున్నాను.

**శ్లో॥ పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్**
**సేనానీనామహం స్కన్దస్సనసామస్మి సాగరః . (భ.గీ 10-24)**

తా: ఓ అర్జునా! పురోహితులలో శ్రేష్ఠుడగు బృహస్పతినిగా నన్నెఱుగుము. మఱియు నేను సేనానాయకులలో కుమారస్వామియు, సరస్సులలో సముద్రమును అయియున్నాను.

**శ్లో॥ మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్**
**యజ్ఞానాం జపయజ్ఞోస్మి స్థావరాణాం హిమాలయః (భ.గీ 10-25)**

తా: నేను మహర్షులలో భృగుమహర్షిని, వాక్కులలో ఏకాక్షరమగు ప్రణవమును (ఓంకారమును), యజ్ఞములలో జపయజ్ఞమును, స్థిరపదార్థములలో హిమాలయపర్వతమును అయియున్నాను.

**శ్లో॥ అశ్వత్థ: సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారద:**
**గన్ధర్వాణాం చిత్రరథ: సిద్ధానాం కపిలో ముని:. (భ.గీ 10-26)**

తా: నేను చెట్లన్నిటియందును రావిచెట్టును, దేవర్షులలో నారదుడను, గంధర్వులలో చిత్రరథుడను, సిద్ధులలో కపిలమునీంద్రుడను అయియున్నాను.

**శ్లో॥ ఉచ్చైశ్శ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్**
**ఐరావతం గజేన్ద్రాణాం నరాణాం చ నరాధిపమ్. (భ.గీ 10-27)**

తా: గుఱ్ఱములలో అమృతముతోబాటు పుట్టిన ఉచ్చైశ్శ్రవసమను గుఱ్ఱమును గొప్ప యేనుగులలో ఐరావతమును, మనుష్యులలో రాజును నేనని తెలిసికొనుము.

**శ్లో॥ ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్**
**ప్రజనశ్చాస్మి కందర్ప: సర్పాణామస్మి వాసుకి: . (భ.గీ 10-28)**

తా: నేను ఆయుధములలో వజ్రాయుధమును, పాడియావులలో కామధేనువును, ప్రజల యుత్పత్తికి కారణభూతుడైన మన్మథుడను, సర్పములలో వాసుకియు అయియున్నాను.

**శ్లో॥ అనన్తశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్**
**పితౄణామర్యమా చాస్మి యమస్సంయమతామహమ్. (భ.గీ 10-29)**

తా: నేను నాగులలో అనంతుడను, జలదేవతలలో వరుణుడను, పితృదేవతలలో అర్యమయు, నియమించువారిలో యముడను అయియున్నాను.

**శ్లో॥ ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాల: కలయతామహమ్**
**మృగాణాం చ మృగేన్ద్రోహం వైనతేయశ్చ పక్షిణామ్. (భ.గీ 10-30)**

తా: నేను అసురులలో ప్రహ్లాదుడను, లెక్క పెట్టువారిలో కాలమును, మృగములలో మృగరాజగు సింహమును, పక్షులలో గరుత్మంతుడను అయియున్నాను.

**శ్లో॥ పవన: పవతామస్మి రామశ్శస్త్రభృతామహమ్**
**ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ. (భ.గీ 10-31)**

తా: నేను పవిత్రమొనర్చువారిలో (లేక వేగవంతులలో) వాయువును, ఆయుధమును ధరించినవారిలో శ్రీరామచంద్రుడను, చేపలలో మొసలిని, నదులలో గంగానదిని అయియున్నాను.

**శ్లో॥ యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున**
**న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్. (భ.గీ 10-39)**

తా:- ఓ అర్జునా! సమస్త ప్రాణికోట్లకు ఏది మూలకారణమైయున్నదో అదియు నేనే అయియున్నాను. వెయ్యేల స్థావరజంగమాత్మకమైన వస్తువేదియు నాకంటె వేఱుగలేదు.

**శ్లో॥ అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున**
**విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితోజగత్. (భ.గీ 10-42)**

తా: అర్జునా! ఇప్పటి దాకా వివరించిన విస్తారమైన ఈ జ్ఞానముచే నీకేమి ప్రయోజనము ఈ జగత్తు నంతా నేనే వ్యాపించి వున్నానని తెలిసికోనుము.

పై శ్లోకాలను బట్టి సమస్తమూ తానే, అన్నీ తానే అని భగవానుడు చెప్పడం జరిగింది. ఆయన చెప్పింది తానుకానిదంటూ ఏదీ లేదని చెప్పడం జరిగింది. ఇన్ని చెప్పినా భగవానుడు చెప్పిన వన్నీ ఆయన కానట్టు! ఆయన చెప్పని విగ్రహం మాత్రమే భగవంతుడన్నట్టు! మానవులు ప్రవర్తిస్తున్నారు.

గమనిస్తే పై శ్లోకాలలో విగ్రహ ప్రస్తావన ఎక్కడా లేదు. అంటే! ఆయన విగ్రహం తప్ప అన్నీ నేనని చెప్పడం జరిగింది. ఇది మానవులు అర్థం చేసుకోవాలి. అన్నీ ఆయన అయినపుడు అన్నిటిని పవిత్రంగా చూడాలి, గౌరవించాలి, ప్రేమించాలి. అన్నిటికి సేవచేయ్యాలి, రక్షించాలి, అన్నిటితో స్నేహభావం ప్రదర్శించాలి, అన్నిటిలో భగవానుని చూడాలి, వేటినీ అవమానించకూడదు, ద్వేషించకూడదు, వేటినీ హింసించకూడదు, ఏ జంతువును, ప్రాణిని శత్రువుగా చూడకూడదు.

అంతేకాని భగవద్గీత పారాయణ చేస్తూ, భగవద్గీతను వింటూ అర్దం చేసుకోకుండా ఒక్క విగ్రహమే భగవంతుడన్నట్టు, ఇక ఏవీ భగవంతుడు కానట్టు ప్రవర్తిస్తే! అలా చేసేవారి పనులన్నీ భగవంతునికే చెందుతాయి. అది వారికే నష్టం కలిగిస్తాయని తెలుసుకోవాలి. ఇదంతా అర్దం కావాలంటే ముందు భగవంతుని 'ఆత్మ తత్వం' అర్థం చేసుకోవాలి! "ఆత్మజ్ఞానం" సంపాదించు కోవాలి! 'ఆత్మ'ను పట్టుకోవాలి! 'ఆత్మ' మీద దృష్టి వుంచాలి! దాని మార్గమే 'ధ్యానం'! 'ధ్యానం' చేసిన వారికి అన్నీ అర్దం అవుతాయి. విగ్రహాన్నే కాదు అన్నిటిని గౌరవిస్తారు. అన్నిటినీ ప్రేమిస్తారు.



# భగవంతుడు ఎలా సమర్పించమన్నాడు?

భగవద్గీతలో భగవానుడు ఆరాధన కాదు. ఆత్మజ్ఞానమే బోధించాడు అని చెప్పినప్పుడు కొంతమంది భగవానుడు భక్తితో పత్రం, పుష్పం. ఫలం, తోయం సమర్పించమన్నాడు కదా! అంటే పూజించమనే కదా అర్థం! అందుకే వాటితోనే పూజిస్తున్నాం. భగవానుడు చెప్పినట్టే చేస్తున్నామని ఈ క్రింది శ్లోకం ఉదహరిస్తారు.

**శ్లో॥ పత్రం, పుష్పం, ఫలం, తోయం యోమేభక్త్యా ప్రయశ్చతి**
**తదహం భక్త్యుప్రహృతమశ్నామిప్రయతాత్మనః (భ॥గీ॥ 9-26)**

తా:- ఎవడు నాకు భక్తితో ఆకును గాని, పుష్పమును గాని, పండును గాని, జలమును గానీ సమర్పించుచున్నాడో వాటిని నేను ప్రీతితో స్వీకరించు చున్నాను.

కానీ ఇక్కడ భగవానుడు పూజించమనలేదు. సమర్పించమన్నాడు. సమర్పించడం అంటే ఇవ్వమన్నాడు. ఎలా ఇవ్వమన్నాడు? భక్తితో అంటే భక్తి భావంతో ఇవ్వమన్నాడు. ఇక్కడ మనం బాగా ఆలోచించాలి. తెలుసుకోవాలి.

సమర్పించడమంటే! ఇవ్వడం. అంతేకానీ పూజించడం కాదు. ఎవరికి సమర్పించాలి? భగవానునికి. అందుచేత ముందు భగవానుడంటే ఎవరో తెలుసుకోవాలి.

భగవానుడంటే విగ్రహం కాదు. ఫోటోకాదు. ఆయన అంతటా వ్యాపించి వున్నవాడు. అన్నిటిలో వున్నవాడు. అన్నిటికి ఆధారమైన వాడు. అంటే అన్నీ ఆయనే. అంతా ఆయనే. ఒక రకంగా చెప్పాలంటే ఈ లోకమే ఆయన అందుచేత ఈ లోకానికి ఏమి సమర్పించినా! భగవానునికి

సమర్పించినట్టే. అందుచేత సమర్పించవలసినది లోకానికి. అంతేకానీ విగ్రహానికి కాదు. ఒకరకంగా చెప్పాలంటే లోకానికి ఇస్తేనే భగవంతునికి ఇచ్చినట్టు.

పత్రం, పుష్పం, ఫలం, తోయం (నీరు) అని అన్నారు. అంటే ఏదైనా అని అర్థం. నువ్వు ఇవ్వగలిగింది అంటే ధన, కనక, వస్తు వాహనాలే ఇవ్వనవసరం లేదు. రత్న, మణి మాణిక్యాలే ఇవ్వనవసరం లేదు. ఈ లోకానికి, లోకంలోని వారికి నువ్వు నీ దగ్గర వున్నది, నీకు ఇవ్వబడినది ఏదైనా సరే సమర్పించు అని భగవానుడు చెప్పాడు. అదే పత్రం, పుష్పం, ఫలం, తోయం అనడానికి అర్థం.

అలాగే ఇచ్చే దానికన్నా ఇచ్చే భావం ముఖ్యం. మరి ఎలా ఇవ్వాలి? భక్తి భావంతో ఇవ్వాలి. భక్తి అంటే ఏమిటి? సమర్పణ అంటే సమర్పణ భావంతో ఇవ్వాలి. ఎవరిని సమర్పించుకోవాలి. నిన్ను నీవు సమర్పించుకోవాలి.

అంటే నేను ఇస్తున్నాను అన్న భావం ఉండకూడదు. ఇంకా నాది ఇస్తున్నాను అన్న భావం ఉండకూడదు. కారణం నేనే లేనపుడు నాది అనేది ఎక్కడ వుంటుంది? అందుచేత నేను ఇస్తున్నాను, నాది ఇస్తున్నాను అన్న భావం లేకుండా ఇవ్వాలి. ఇదే అసలైన భక్తి, నిజమైన భక్తి. కారణం అంతా ఆయనే, అన్నీ ఆయనే అయినపుడు నువ్వెక్కడ? నీదెక్కడ? అందుచేత అలాంటి భావంతో సమర్పించాలి. అలాంటిది ఏదైనా నేను ఇష్టంతో స్వీకరిస్తాను అని భగవానుడు చెప్పడం జరిగింది.

ఇది అర్థం చేసుకోకుండా చాలా మంది నేను సమర్పిస్తున్నాను. నాది ఇస్తున్నాను అంటారు. నేను కొబ్బరికాయలు ఇచ్చాను, నైవేద్యాలు పెట్టాను, కానుకలు సమర్పించాను అంటారు. అంతే కాదు ఇచ్చిన దానికి ప్రతిఫలం ఆశిస్తూ వుంటారు. ఇవన్నీ ఆయన చెప్పిన దానికి పూర్తిగా విరుద్ధం. ఆయనను అర్థం చేసుకున్నవారు ప్రతి ఫలం కోరరు. నేను ఇస్తున్నాను అని అనుకోరు. నాది అనేది వుందని కూడా భావించరు.

అందుచేత ఈ శ్లోకాన్ని అర్థం చేసుకోండి. భగవానుడు చెప్పింది పూజించమని కాదు. సమర్పించమని. అంటే ఇవ్వమని. ఎవరికి ఇవ్వాలి?

భగవానునికి అంటే లోకానికి ఇవ్వాలి. ఎలా ఇవ్వాలి? భక్తి భావంతో భక్తి అంటే నేను, నాది అన్నది లేకుండా సమర్పణ భావంతో ఇవ్వాలి. అలా చేస్తే నేను ప్రీతితో స్వీకరిస్తాను అని భగవానుడు చెప్పడం జరిగింది.

ఇదే విషయాన్ని మనం "శ్రీ కృష్ణతులాభారం" ద్వారా తెలుసుకోవచ్చు.

సత్యభామ నేను భగవానుని ధనంతో, బంగారంతో తూచగలను అని ఎన్ని టన్నుల బంగారం వేసినా ఒక్క అంగుళం కూడా త్రాసు కదలలేదు. భగవానుడు నిశ్చలంగా అలాగే వున్నాడు.

కానీ రుక్మిణీ దేవి భగవానుని నేనెక్కడ తూచగలను. అసలు నేను ఎక్కడ? నాది అనేది ఏమి వుంది? అనే భావంతో తులసీదళం అంటే "రెండు ఆకులు" అంటే పత్రం సమర్పించినా భగవానుడు తూగాడు. ఇక్కడ గమనిస్తే రుక్మిణీదేవి సమర్పించింది "ఆకులు" మాత్రమే. టన్నుల బంగారానికి తూగని భగవానుడు రెండు ఆకులకు తూగాడు. అంటే లొంగాడు. అంటే స్వీకరించాడు. కారణం నేను లేను, నాది లేదు అన్న భక్తి భావంతో రుక్మిణీదేవి సమర్పించింది. దానికే భగవానుడు స్పందించాడు.

అందుచేత ఈ శ్లోకాన్ని అర్థం చేసుకుని, ఆశించకుండా మీకు వున్న దానిలో ఏదైనా! అది విలువైనది కావచ్చు. విలువలేనిది కావచ్చు. కానీ నేను, నాది అన్న భావం లేకుండా ఇవ్వాలి. అదే భగవానుడు చెప్పిన సందేశం.

భగవానుడు విగ్రహాన్ని పూజించమని చెప్పలేదు. లోకానికి ఇవ్వమని చెప్పాడు. అంతేకాదు కోరికలతో ఇవ్వమనలేదు. ఆశించకుండా ఇవ్వమన్నాడు. కర్తృత్వ భావం లేకుండా ఇవ్వమన్నాడు. నేను ఇస్తున్నాను, నాది ఇస్తున్నానన్న భావం లేకుండా ఇవ్వమన్నాడు. కారణం "ఉన్నదే ఆయన, ఉన్నది కూడా ఆయనదే కాబట్టి".

అలాంటి భావంతో ఇవ్వగల శక్తి ఎవరికైనా 'ధ్యానం' చేస్తేనే వస్తుంది. అందుచేత ధ్యానం చెయ్యండి. భగవానుడు చెప్పినట్టుగా సమర్పించండి. జీవితాన్ని రుక్మిణీ దేవిలా ధన్యం చేసుకోండి. 'సత్యభామ'లా అహంకారంతో వ్యవహరించకండి.



# "భగవానుని గురించి, భగవానుడు బోధించిన దాని గురించి ఆలోచించండి!"

లోకంలో ఎక్కువ శాతం మంది సంసారం గురించి, సంపాదన గురించి, సంపాదించిన దానితో అనుభవించడం గురించి ఆలోచిస్తున్నారు. ఇంకా తన గొప్పతనం గురించి, తన గొప్పతనాన్ని పెంచుకోవడం గురించి అంటే ఆర్థికంగా అంటే ధన, కనక, వస్తు, వాహనాలు, ఉద్యోగ, వ్యాపారాలు గురించి ఆలోచిస్తున్నారు. ఇంకా సామాజికంగా అంటే అందరిలో పేరు, ప్రఖ్యాతులు రావాలని, గౌరవ మర్యాదలు ఉండాలని ఆలోచిస్తున్నారు. రాజకీయంగా అంటే పదవులు వుండాలని, అందరిలో హోదా పెంచుకోవాలని చూస్తున్నారు. ఇవే గొప్పవనుకుంటున్నారు. అలాంటి వాటిని చూసి మురిసిపోతున్నారు. అలాంటివి ఎన్ని వున్నా ఇంకా, ఇంకా ఇమ్మని భగవంతుని కోరుతున్నారు. రకరకాలుగా ఆరాధిస్తున్నారు. అంతే కానీ, ఆ భగవంతుని గురించి ఆలోచించడం లేదు.

కాని ఎన్ని పొందినా, ఎన్ని సాధించినా అన్నిటికంటే భగవంతుని గురించి ఆలోచించడం, తెలుసుకోవడం చాలా చాలా ముఖ్యం. కారణం అవన్నీ అశాశ్వతం, భగవంతుడే శాశ్వతం. అందుచేత భగవంతుని గురించి తెలుసుకోవాలంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. వాటికి సమాధానాలు తెలుసుకోవాలి. వాటి గురించి అధ్యయనం చెయ్యాలి. బాగా ఆలోచించాలి. పూర్తిగా అర్థం చేసుకోవాలి. ఆచరించాలి. అలాంటి వారి జీవితమే ధన్యం. వారి జన్మే సార్థకం.

ముఖ్యంగా భగవానుడు అంటే ఇష్టపడేవారు, భగవానుని ఆరాధించడానికి ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఈ క్రింది ప్రశ్నలు వేసుకోవాలి.

వాటి గురించి ఆలోచించాలి.

1) భగవానుడు ఉన్నాడు అంటారు. కానీ భగవానుడు ఎందుకు వున్నాడో? ఆలోచించాలి.

2) భగవానుడంటే నాకు ఇష్టం, చాలా ఇష్టం అంటారు. కానీ భగవానునికి తాము ఇష్టులైనారా? లేదా? అన్నది ఆలోచించాలి. ఏమి చేస్తే? ఎలా ఉంటే? భగవానునికి ఇష్టులవుతారో ఆలోచించాలి.

3) ఎంతసేపూ భగవానుని ఆరాధించే విషయంలో, అలాగే మిగతా విషయాలలో తమకు నచ్చినట్లు, తమకు ఇష్టమైనట్టు చేస్తున్నారు, కానీ తాము చేసే పనులు భగవానుడు మెచ్చుతున్నాడా? అన్నది ఆలోచించాలి!

4) ఎంతసేపూ పూజ చేస్తే, ఆనంద పడతాడని భావిస్తున్నారు. పూజ చెయ్యటానికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. కానీ భగవానుడు దేనికి ఆనందపడతాడు? అన్నది ఆలోచించాలి!

5) ఇంతకీ భగవానుడు ఎలా వుంటాడు? ఎక్కడ వుంటాడు? ఏం చేస్తూ వుంటాడు? అన్నది ముఖ్యంగా ఆలోచించాలి!

6) ఎంతసేపూ భగవానుని కోరుతున్నారు కానీ, భగవానుని గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. ఆయన గురించి ఆలోచించడం లేదు.

7) ఎంతసేపూ భగవానుని కోరడానికి గంటలు, గంటల సమయం కేటాయిస్తున్నారు. వెచ్చిస్తున్నారు. కానీ భగవానుని గురించి తెలుసుకోవడానికి, ఆలోచించడానికి రోజులో కనీసం ఒక గంట కూడా కేటాయించలేకపోతున్నామన్న దాని గురించి ఆలోచిస్తున్నారు.

8) ఎంతసేపూ భగవంతుని ఆరాధిస్తున్నారు కానీ, భగవానుడు చెప్పింది ఆచరించడం లేదు. ఆచరించాలన్నది ఆలోచించాలి.

9) ఎంతసేపూ భగవానుడు గొప్పవాడంటారు. కానీ అంతటి గొప్పవాడు చెప్పినవి గొప్పవే కదా? వాటిని ఎందుకు ఆచరించరు? ఆచరించడానికి ఆలోచించాలి.

10) ఎంతసేపూ భగవానుని ప్రార్థిస్తారు కాని ఆయన చెప్పింది పాటించ డానికి ఆలోచించాలి.

11) భగవానుడు కోరికలు తీర్చేవాడని, కష్టాలు తొలగించేవాడని పాపాలు క్షమించేవాడని ఆరాధిస్తారు. కానీ భగవానుడు కోరికలు తీర్చేవాడా? కష్టాలు తొలగించేవాడా? పాపాలు క్షమిస్తాడా? అన్నది ఆలోచించాలి.

12) భగవానుడు అల్పమైన కానుకలు ఆశిస్తాడని భావిస్తారు. కానీ అసలు సృష్టి అంతా ఆయనదైనపుడు, సృష్టిలోనివన్ని ఆయనవైనపుడు ఆయనకు ఎవరు ఏమి ఇవ్వగలమని ఆలోచించాలి.

13) ఆయనను పొగడ్తలతో, స్తోత్రాలతో వశం చేసుకోవచ్చని భావిస్తారు, కానీ అసలు ఆయన దేనికి వశుడవుతాడు? అన్నది ఆలోచించాలి.

14) భగవానుని మందిరాలలో, గుళ్ళలో ఉంచామని భావిస్తారు. అక్కడే పవిత్రంగా వుంటారు. కానీ ఆయన సర్వాంతర్యామి అన్న విషయం ఆలోచించాలి. అన్ని చోట్ల పవిత్రంగా ఉండాలన్న దాని గురించి ఆలోచించాలి.

15) భగవానుని ఆరాధిస్తే అనుగ్రహిస్తాడని, ఆరాధించకపోతే ఆగ్రహిస్తాడని భావిస్తారు. కానీ ఆయన అలా ప్రవర్తిస్తాడా? అన్నది ఆలోచించాలి.

16) అసలు ఆరాధన అంటే ఏమిటి? ఎలాంటి ఆరాధన చెయ్యాలి? అన్నది ఆలోచించాలి.

17) భగవానుని కోరితే ముక్తి రాదు! చేరితేనే ముక్తి వస్తుందన్న విషయం ఆలోచించాలి.

18) భగవానుని గురించి తెలుసునన్నట్లుగా మాట్లాడతారు. అసలు ఆయన గురించి ఎంత తెలుసో ఆలోచించాలి.

ఇలా మనం చెప్పుకుంటూపోతే భగవానుని గురించి ఆలోచించ వలసినవి, తెలుసుకోవలసినవి ఎన్నో వున్నాయి. కారణం ఆయన అంత గొప్పవాడు కనుక. ఒక రకంగా చెప్పాలంటే భగవానుని గురించి పూర్తిగా తెలుసుకోవడం అసాధ్యం. కానీ కొంచెమైనా తెలుసుకోవాలి. ఆయన గురించి కొంతైనా అవగాహన చేసుకోవాలి. అంతే కానీ ఏమీ తెలుసుకోకుండా, ఏమీ

ఆలోచించకుండా చేసే పనులు, ఆరాధనలు వ్యర్థమవుతాయి. దుఃఖాన్ని తొలగించడం కాదు దుఃఖాన్ని పెంచుతాయి. అందుచేత భగవానుని గురించి ఆలోచించాలి.

అలాగే భగవానుడు భగవద్గీత ద్వారా అద్భుతమైన సందేశాన్ని మానవలోకానికి బోధించాడు. మానవులు దుఃఖం నుంచి బయటపడటానికి, ఆనందంగా జీవించడానికి, అసలు మానవ జీవితం దేనికి? మానవులు ఏమి చెయ్యాలి? జీవిత లక్ష్యమేమిటి? ఏమి చేస్తే శాశ్వత ఆనందాన్ని పొందగలరో లాంటివెన్నో విషయాలు భగవానుడు బోధించాడు. మానవులు తప్పనిసరిగా వీటన్నిటి గురించి ఆలోచించాలి. అసలు ఆయన బోధించిన భగవద్గీత ప్రతి ఇంట్లో వుండాలి. అధ్యయనం చెయ్యాలి. అర్థం చేసుకోవాలి. ఆచరించాలి. ముఖ్యంగా ఆయన చెప్పిన దాని గురించి ఆలోచించాలి.

కారణం భగవానుడు బోధించిన దాని కంటే గొప్ప విషయాలు ఎవరు బోధించగలరు? ఆయన బోధించినవన్నీ అక్షరసత్యాలే కదా? అందుచేత భగవానుడు బోధించిన దాని గురించి తప్పకుండా ఆలోచించాలి. ఆయన చెప్పిన దాని గురించి ఆలోచించడం లేదంటే ఆయనను నిర్లక్ష్యం చేస్తున్నట్టే. ఇది మనకే నష్టం. అందుచేత ఆలోచించాలి.

అలా ఆలోచించే శక్తి మనకు రావాలంటే! ఎవరైనా 'సాత్వికమైన శాకాహారం' తీసుకోవాలి. 'ధ్యానం' చెయ్యాలి! అందుచేత అందరూ శాకాహారులు కండి. ధ్యానం చెయ్యండి. భగవానుని గురించి, ఆయన చెప్పిన బోధ గురించి ఆలోచించండి.

**"బజారులో ఏ వస్తువు పొందాలన్నా కొంత మూల్యం చెల్లించాలి. మరి భగవంతుని పొందాలంటే ఎంత మూల్యం చెల్లించాలి?"**



# భగవద్గీతను బట్టి ఆరాధనలు రెండు రకాలు!

భగవద్గీతను బట్టి ఆరాధనలు రెండు రకాలు. (1)దైవారాధన,(2) భగవదారాధన.

దేవతలను, దేవుళ్ళను ఆరాధిస్తే దైవారాధన అవుతుంది. భగవంతుడ్ని ఆరాధిస్తే భగవదారాధన అవుతుంది.

దేవతలను ఆరాధిస్తే అంటే ఆశ్రయిస్తే భోగాలు వస్తాయి. కానీ భగవంతుడిని ఆరాధిస్తే అంటే ఆశ్రయిస్తే దుఃఖం నుంచి ముక్తి లభిస్తుంది.

ఇదే విషయం భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ కాఙ్క్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా (భ.గీ.4-12)**

తా:- కర్మముల యొక్క ఫలప్రాప్తిని కోరే మానవులు ఈ ప్రపంచంలో దేవతలను ఆరాధిస్తున్నారు. ఎందుకనగా కర్మ ఫల సిద్ధి ఈ మనుష్య లోకమున శీఘ్రముగా కలుగుతున్నది.

అంటే దేవతలను ఆరాధించేవారు దానికి తగ్గ ఫలితాలు పొందుతారు, అంటే కొన్ని తాత్కాలిక భోగాలు మాత్రమే పొందుతారు. అంతే తప్ప దుఃఖం నుంచి బయటపడలేరు, అంటే ముక్తిని పొందలేరని తెలుసుకోవచ్చు. కానీ ప్రస్తుతం ప్రతి ఒక్కరూ తమ కష్టాలు, బాధలు, సమస్యల నుంచి బయటపడటానికే అంటే ముక్తిని పొందటానికే ఆరాధనలు చేస్తున్నారు. కష్టాలు పోవాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. కానీ వారి కోరిక దైవారాధన వల్ల నెరవేరదని పై శ్లోకం ద్వారా తెలుస్తుంది.

దైవారాధన అంటే యజ్ఞ, యాగాలు, మంత్ర జపాలు. ఇవి వేదాల పూర్వ భాగంలో చెప్పబడ్డాయి. వీటి వల్ల మానవులకు కొన్ని తాత్కాలిక భోగాలు

మాత్రం సమకూరతాయి. కానీ వారి దుఃఖం అంటే రోగాలు మాత్రం పోవు. అంటే కష్టాలు పోవు.

ఒక ఉదాహరణ చూద్దాం. వరుణ దేవుణ్ణి ఆవాహన చేసి వరుణ యాగం చేసారనుకుందాం. అపుడు ఏం జరుగుతుంది? వర్షాలు పడతాయి. వర్షాలు పడితే ఏమవుతుంది? పంటలు బాగా పండుతాయి. పంటలు బాగా పండితే ఏమవుతుంది? ధనం బాగా వస్తుంది. ధనం వస్తే ఏం చేస్తారు? ధనంతో భోగాలు సమకూర్చుకుంటారు. భోగం అనుభవిస్తారు. అంటే పెంకుటిల్లు తీసేసి మేడ కట్టుకుంటారు. లేకపోతే బైక్ అమ్మి కారు కొంటారు. ఇంట్లో ఎ.సి. లేకపోతే ఎ.సి. పెట్టుకుంటారు. కలర్ టి.వి. కొంటారు. బంగారం వస్తువులు చేయించుకుంటారు. మంచి బట్టలు కొనుక్కుంటారు. డైనింగ్ టేబుల్, ఫ్రిజ్, గ్రైండర్, మిక్సీ, వాషింగ్ మిషన్ లాంటి వస్తువులు కొంటారు. వీటన్నిటి వల్ల కొంతసుఖం అంటే భోగం పొందగలరు. అంతే కానీ వారి దుఃఖం అంటే రోగం మాత్రం పోదు.

చాలామంది సుఖాలు లేకపోతే ఎలాఅంటారు. జీవితం సుఖపడటానికే కదా? అంటారు. కానీ ఎన్ని సుఖాల వున్నా రోగం వుంటే ఆ సుఖం అనుభవించలేరు కదా? అందుచేత ముందు దుఃఖం పోవాలి. అపుడే సుఖాలు అనుభవించగలరు. దుఃఖంతో వున్నా సుఖాల వల్ల ప్రయోజనం లేదు. కానీ దుఃఖం లేని సుఖాలు కొద్దిగా వున్నా అనుభవించగలరు. కారణం దుఃఖం వుంటే ఎన్ని సుఖాలు వున్నా అనుభవించలేరు. అవి వున్నా ఒకటే! లేకపోయినా ఒకటే! అందుచేత అందరికీ కావలసింది భోగాలు కాదు అన్ని సమస్యల నుంచి, కష్టాల నుంచి, రోగాల నుంచి ముక్తి. ఆ ముక్తి అన్నది దైవారాధన వల్ల రాదు. అన్నదే పై శ్లోకం ద్వారా మనం తెలుసుకోవచ్చు.

మరి ముక్తి ఎలా వస్తుంది? భగవదారాధన వల్ల మాత్రమే వస్తుంది. ఇదే విషయం ఈ క్రింది శ్లోకాలలో చెప్పబడింది.

**శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః** (భ.గీ.18-66)

తా:- సమస్త ధర్మాలను విడిచి పెట్టి, నన్నొక్కని (ఆత్మను) మాత్రం

శరణు పొందుము. నేను సమస్త పాపముల నుండి నిన్ను విముక్తిడిని చేసెదను.

**శ్లో॥ మాం హి పార్థ వ్యపాశ్రిత్య యే పి స్యుః పాపయోనయః**
**స్త్రీయో వైశ్యాస్తథా శూద్రాస్తే పి యాన్తి పరాంగతిమ్** (భ.గీ.9-32)

తా:- ఓ అర్జునా! ఎవరు పాప జన్మము గల వారై వుందురో, వారును, స్త్రీలు, వైశ్యులు, శూద్రులు నన్ను (ఆత్మను) ఆశ్రయించి సర్వోత్తమ పదవిని (మోక్షమును) నిశ్చయముగా పొందుచున్నారు.

మానవునికి రోగాలు, కష్టాలు, సమస్యలు, పాపకర్మాలు చేయడం వల్ల మాత్రమే వస్తున్నాయి. రోగాలు, కష్టాలు పోవాలంటే పాపాలు పోవాలి. పాపాలు పోవాలంటే కోరికలతో దేవతలను ఆరాధించడం కాదు. భగవంతుని ఆరాధించాలి అంటే ఆశ్రయించాలి. అపుడే పాపాలు పోయి కష్టాలు తొలగిపోతాయి. ఆ విషయమే పై శ్లోకాలలో చెప్పడం జరిగింది.

ఎలాంటి వారైనా అంటే ఎలాంటి పాపాలు చేసిన వారైనా భగవంతుని అంటే ఆత్మను ఆశ్రయిస్తే పాపాలన్నీ తొలగించుకుని మోక్షాన్ని కూడా పొందగలరని భగవానుడు చెప్పడం జరిగింది. మరి ఎలా ఆశ్రయించాలి. అంటే సమస్త ధర్మాలను అంటే అన్ని ఇంద్రియ ధర్మాలను వదలి భగవానుని ఆశ్రయించాలి. ఇంద్రియ ధర్మాలు అంటే ఇంద్రియ సుఖాల కోసం కోరే కోరికలు. అంటే మనస్సులోని ఆలోచనలు వదలాలి. అంటే ఆలోచనా రహిత స్థితిలో భగవానుని అంటే ఆత్మను ఆశ్రయిస్తే అంటే ఆత్మ మీద దృష్టి వుంచితే వారిని సమస్త పాపాలు నుండి విముక్తిడిని చేస్తాను అని చెప్పడం జరిగింది. దీనినే ధ్యానం అని అంటారు. అంటే ధ్యానం చేసిన అలాంటి వారికి కష్టాలు వుండవు. అందుచేత దుఃఖం అంటే కష్టాలు పోవాలంటే 'భగవదారాధన' అంటే 'ఆత్మారాధన' అంటే ధ్యానం చేయాలి.

భగవదారాధన అంటే 'ధ్యానం' వల్ల ఎవరికైనా ముక్తి లభిస్తుంది. అందుకే శ్రీ కృష్ణుల వారు వేదాల పూర్వ భాగంలో చెప్పబడిన దైవారాధనను కూడా వదలాలని భగవదారాధన చెయ్యాలని ఈ క్రింది శ్లోకంలో చెప్పారు.

**శ్లో॥ త్రైగుణ్యావిషయా వేదా నిస్త్రై గుణ్యో భవార్జున**
**నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ (భ.గీ.2-45)**

తా:- ఓ అర్జునా వేదములు త్రిగుణాత్మకములను (సంసార) విషయములను తెలుపుచున్నవి. నీవు త్రిగుణములను వదిలినవాడవుగాను, ద్వంద్వములు లేని వాడవుగాను నిరంతరము శుద్ధ సత్వమును ఆశ్రయించిన వాడవుగా, యోగ క్షేమముల దృష్టి లేని వాడగుము. ఆత్మ జ్ఞానివికమ్ము.

శ్రీ కృష్ణుల వారు వేదాలలో చెప్పబడిన యజ్ఞయాగాది కర్మల వల్ల వచ్చే ఇహలోక భోగాలను, లాభాలను కూడా వదలిపెట్టి, వాటన్నిటికి అతీతమైన నిర్గుణ స్థితికి చేరుకొమ్మని చెప్పారు. ద్వంద్వాలను (శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాలు) వదలి పెట్టమన్నారు. నిత్యం సత్యంలో జీవించమన్నారు. అలాగే మంచి, చెడులు కూడా వదలిపెట్టమన్నారు. అంటే మనస్సుకు సంబంధించిన వాటిని వదిలిపెట్టి ఆత్మ స్థితికి, నిర్గుణ స్థితికి చేరుకోమన్నారు.

కారణం ఆత్మే భగవంతుడు కాబట్టి, ఆత్మను చేరుకోమన్నారు. అంటే భగవదారాధన చెయ్యమన్నారు అదే ముక్తికి మార్గమన్నారు. కానీ లోకంలో మానవులు ఈ రెండింటిని అంటే దైవారాధనను, భగవదారాధనను, కూడా వదలిపెట్టి మరో రకమైన ఆరాధన అంటే విగ్రహారాధన చేస్తున్నారు. అందుచేత ఎలాంటి ఫలితాలు పొందలేక కనీసం సుఖాలు కూడా పొందలేకపోతున్నారు. సుఖంగా జీవించలేకపోతున్నాడు. రోజు రోజుకీ సమస్యలు పెరుగుతున్నాయి. దుఃఖం పెరుగుతుంది. అశాంతిగా జీవిస్తున్నారు. కారణం భగవానుడు చెప్పని ఆరాధన చేయడమే.

దైవారాధన మానవులకు భోగాలనిస్తాయి కానీ శోకం తొలగించలేదని మనం రామాయణం ద్వారా కూడా తెలుసుకోవచ్చు. దశరధ మహారాజు పుత్ర భోగం లేదని, పుత్రకామేష్టి యాగం చేసారు. నలుగురు పుత్రులను పొందగలిగారు. అంటే యాగం వల్ల భోగం కలిగింది. కానీ ఆయన శోకం మాత్రం పోలేదు. కారణం ఆయన పుత్రశోకంతో మరణించాడు. ఆలోచించండి అంతటి యాగం చేసిన ఆయనకు శోకం ఎందుకు పోలేదు? దీనిని బట్టి దేవతలకు సంబంధించిన యాగాలు అంటే ఆరాధనలు భోగాన్ని మాత్రమే ఇవ్వగలవు కానీ దుఃఖాన్ని తొలగించలేవు అని స్పష్టంగా తెలుసుకోవచ్చు.

గీతలో చెప్పినదాన్ని బట్టి దైవారాధన అంటే యజ్ఞయాగాలు చేస్తే భోగాలు సమకూరుతాయి. అలాగే భగవదారాధన అంటే ధ్యానం చేస్తే ముక్తి వస్తుందని అర్థం చేసుకుని శ్రీ కృష్ణుల వారు చెప్పినట్టు వేదాల ఉత్తర భాగంలో చెప్పినట్టుగా భగవదారాధన అంటే ధ్యానం చేసి ముక్తిని పొందండి.

ఇదే విషయం యోగవాసిష్టంలో వశిష్ఠ మహర్షి కూడా చెప్పడం జరిగింది.


**శ్లో॥ దేవాన్దేవయజో యాన్తి యక్షా యక్షాన్వ్రజన్తిహి**
**బ్రహ్మ బ్రహ్మయజో యాన్తి యదతుచ్ఛం తదాశ్రయేత్.**

తా:- దేవతలను ధ్యానించేవారు, దేవతలనే పొందుతారు. యక్షులను ధ్యానించేవారు యక్షులనే పొందుతారు. అలాగే బ్రహ్మాన్ని ధ్యానించేవారు బ్రహ్మాన్ని పొందుతారు. కనుక ఏది మహత్తరమైనదో దానినే పొందటానికి ప్రయత్నించాలి.

వశిష్టుల వారి సందేశం సృష్టిలో అందరి కంటే అన్నిటి కంటే గొప్పవాడు 'పరబ్రహ్మ'. ఆయనే 'ఆత్మ' ఆయనను ధ్యానిస్తేనే సర్వ దుఃఖాలు తొలగిపోతాయి. అందుచేత భోగాలనిచ్చే దేవతలను ఆరాధించడం కాదు. బ్రహ్మాన్నే ఆరాధించాలి. ముక్తిని పొందాలి. ఆ మార్గమే 'ధ్యానం'. ధ్యానం చేసిన వారికే దుఃఖం నుంచి ముక్తి. దైవారాధన చేసిన వారికి వారు చేసే విధానాన్ని బట్టి తాత్కాలిక ప్రాపంచిక భోగాలు మాత్రమే కలుగుతాయి.

కానీ విగ్రహారాధన చేసే వారికి ఏ ఫలితమూ వుండదు. ఇదే మనం గీత ద్వారా తెలుసుకోవలసిన సందేశం. అందుచేత గీతలో రెండు రకాల ఆరాధనలు మాత్రమే చెప్పబడ్డాయని తెలుసుకోండి. ఒకటి 'దైవారాధన' అంటే యజ్ఞయాగాలు, రెండు భగవదారాధన అంటే 'ధ్యానం'. అందుచేత గొప్పదైన 'ధ్యానాన్ని' చెయ్యండి.

**"ఒకే కుర్చీలో ఇద్దరు కూర్చోలేరు. ఒకరు లేస్తే కానీ ఇంకొకరికి అవకాశం వుండదు. అలాగే భగవంతుని మీద దృష్టి పెట్టాలంటే ప్రపంచం మీద, ప్రాపంచిక సుఖాల మీద దృష్టి పోవాలి.**



# భగవానుడు చెప్పింది "అందరూ ఒక్కటే!"

సాధారణంగా లోకంలో దేవుళ్ళు వేరు తాము వేరు అని భావిస్తారు. తాము మానవులమని భావిస్తారు. అంతే కాదు దేవుళ్ళు కూడా ఎంతోమంది వున్నారు. వారంతా కూడా వేరు వేరు అని భావిస్తారు. అలాగే తమకు నచ్చిన వాడే, తమకు ఇష్టమైన వాడే దేవుడైనట్టు. ఆయనే గొప్పవాడైనట్టు. మిగిలిన వాళ్ళంతా దేవుళ్ళు కానట్టు. గొప్పవాళ్ళు కానట్టు భావిస్తారు. అలాగే ప్రవర్తిస్తారు.

కానీ సృష్టి రహస్యమేమిటంటే దేవుళ్ళందరూ ఒక్కటే! వారే కాదు మనమూ దేవుళ్ళు కూడా ఒక్కటే అంతెందుకు ఈ సృష్టిలోని 84 లక్షల జీవులు, జీవరాసులు అన్నీ ఒక్కటే! ఇంతెందుకు ఈ సృష్టిలో ఏమేమి వున్నాయో అన్నీ ఒక్కటే! అన్నీ ఆ దేవుడే! ఆ భగవంతుడే! అన్నీ ఆ బ్రహ్మమే! ఆ పరబ్రహ్మమే!

ఇదే విషయాన్ని భగవద్గీతలో భగవానుడు తెలియచేయడం జరిగింది. ఆయన 10వ అధ్యాయంలో వివిధ శ్లోకాల ద్వారా అన్నీ నేనే అని చెపుతూ ఆఖరున ఈ విధంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ అథవా బహునైతేన కిం జ్ఞానేన తవార్జున**
**విష్టభాహ్యామిదం కృత్స్న మేకాంశేన స్థితోజగత్ (భ.గీ.10-42)**

తా:- అర్జునా! విస్తారమైన ఈ జ్ఞానముచే నీకేమి ప్రయోజనము ఈ జగత్తునంతా నేనే వ్యాపించి ఉన్నానని తెలుసుకొనుము.

అలా అన్నీ తానేనని చెప్పడం జరిగింది.

ఆయన ఇంకా

**శ్లో॥ మయా తతమిదం సర్వం జగద వ్యక్తమూర్తినా**
**మతాని సర్వభూతాని నచాహం తేష్వావిస్థితః (భ.గీ.9-4)**

తా:- నేను నా ఆ వ్యక్త రూపంతో ఈ జగత్తు అంతా వ్యాపించి వున్నాను. సమస్త ప్రాణి కోట్లు నాయందు వున్నవి.

అలా చెపుతూ తాను చెప్పింది నిరూపించడానికి అర్జునునకు తన అసలు రూపం అంటే విశ్వరూపం చూపించడం జరిగింది.

**శ్లో॥ పశ్య మే పార్థ రూపాణి శతశోథ సహస్రశః**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ (భ.గీ.11-5)**

తా:- ఓ అర్జునా! అనేక విధములుగ నున్నవియు, అలౌకికమైనవియు, వివిధ వర్ణములు, ఆకారములు గలవియు, అసంఖ్యాకములుగ వర్తించునవియు నగు నా యొక్క రూపములను గాంచుము.

అని తన యొక్క విశ్వరూపాన్ని చూపించి అన్నీ నాలోనే వున్నాయి. అన్నీ నేనే అని చెప్పడం జరిగింది. అంటే అందరూ తానే అని చెప్పడం జరిగింది. కానీ అలా చూపించిన ఆ రూపాన్ని అర్జునుడు తనకు వున్న మామూలు నేత్రాలతో చూడలేకపోయాడు. ఈ విషయాన్ని భగవానునికి చెప్పగానే భగవానుడు అర్జునునకు దివ్యమైన జ్ఞాన నేత్రాన్ని ప్రసాదించడం జరిగింది. ఈ విషయాన్నే ఈ క్రింది శ్లోకంలో చెప్పడం జరిగింది.

**శ్లో॥ న తు మాం శక్యసే ద్రష్టుననేనై వ స్వచక్షుషా**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ (భ.గీ.11-8)**

తా:- ఈ నీ మాంసమయ నేత్రములతో నీవు నా విశ్వరూపమును చూడలేవు. కావున దివ్యమైన జ్ఞాననేత్రమును నీకు ప్రసాదించుచున్నాను. దానితో ఈశ్వరసంబంధమైన నా యోగ మహిమను చూడుము.

దీనిని బట్టి మామూలు కళ్ళతో చూసే వారికి అందరూ భగవంతునిలోని భాగాలే! అన్నీ ఆయన రూపాలే! "అందరూ ఒక్కటే!" అన్న విషయం ఎప్పటికీ తెలియదు. బోధపడదు. అర్థం కాదు. అన్నీ వేరు, అందరూ వేరు వేరు అనుకుంటూ వుంటారు. అలాగే ప్రవర్తిస్తారు. ఎవరైతే యోగాభ్యాసం అంటే 'ధ్యానం' చేసి దివ్యమైన జ్ఞాననేత్రాన్ని సంపాదించుకుంటారో వారు మాత్రమే ఈ రహస్యాన్ని అర్థం చేసుకోగలరు, తెలుసుకోగలరు.

అందుకే జ్ఞాననేత్రాన్ని పొందిన అర్జునుడు భగవానుని చూచి ఈ విధంగా చెప్పాడు.

**శ్లో॥ సశ్యామి దేవాంస్తవ దే దేహే సర్వాంస్తథా భూతవిశేషసజ్ఘాన్**
**బ్రహ్మాణమీశం కమలాసనస్థ మృషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్(భ.గీ.11-15)**

తా:- దేవా! మీ శరీర మందు (మీలో) సమస్త దేవతలు, అట్లే చరా, అచర ప్రాణి కోట్ల సమూహములు, కమలాసనుడైన సృష్టికర్త యగు బ్రహ్మదేవుని, సమస్త ఋషులను, దివ్యములగు సర్పములను చూచుచున్నాను.

అలా అందరూ ఆ భగవంతునిలోని వారే, ఆయనలో భాగాలే అందరూ ఒక్కటే అని తన దివ్యనేత్రంతో చూసిన అర్జునుడు చెప్పాడు అలాగే అనేక మంది యోగులు తమ ధ్యాన సాధనతో దివ్య నేత్రాన్ని సంపాదించుకుని ఈ విషయాన్ని చెప్పడం జరిగింది.

అలా **'అన్నమాచార్యులు'** బ్రహ్మమొక్కటే, పరబ్రహ్మమొక్కటే అని చెప్పారు.

**'షిరిడీ సాయిబాబా' కూడా "సబ్ కా మాలిక్ ఏక్ హై" అని చెపుతూ ఈశావాశ్య ఉపనిషత్‌లోని ఒక వాక్యానికి అర్థం వివరించారు.**

**"ఈశా వాశ్యమిదం సత్యం యత్కించిత జగత్యాం జగత్"**

తా:- అఖిల బ్రహ్మాండంలోని జడ, చైతన్య స్వరూపాలన్నీ ఈశ్వరునిచే వ్యాపించి వున్నాయి అని చెప్పారు.

**'వేదాలలో' కూడా "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని చెప్పబడింది. అంటే అంతా "బ్రహ్మ స్వరూపం అయి వున్నది".**

**'జీసస్ క్రైస్ట్'** కూడా "నా తండ్రి, నేను ఒక్కటే! నేను మీరు ఒక్కటే!" అని చెప్పారు అంటే అందరూ ఒక్కటే అని చెప్పడం జరిగింది.

ఇదే విషయాన్ని **"త్యాగరాజు"**ల వారు కూడా "మరుగేలరా" అని పాడుతూ "అన్ని నీవనుచు అంతరంగమున, తిన్నగా వెదకి తెలుసు కొంటినయ్యా..." అంటే అన్నీ నీవే! అంతా నీవే! అందరూ ఒక్కటే! అని నా అంతరంగములో, ధ్యానం ద్వారా వెదకి తెలుసుకున్నానయ్యా అని చెప్పడం జరిగింది.

అలా అంతా ఒక్కటే. అందరూ ఒక్కటే అని అర్థం చేసుకోవాలి. అంటే మనమే ఆ భగవంతుని స్వరూపాలం. అంటే మనమే దేవుళ్ళం అని తెలుసుకోవాలి. దేవుళ్ళు వేరే లేరు. అందుకే **"అహం బ్రహ్మాస్మి"** అన్నారు.

అందుచేత ఎవరినైతే ఆరాధిస్తున్నామో ఆ దేవుళ్ళము మనమే అయి వున్నాము. అందుచేత "మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి". ఈ విషయం ధ్యానం చేసిన వారికే అర్థం అవుతుంది. ధ్యానం చెయ్యకపోతే ఎప్పటికీ అర్థం కాదు. ఇది మనకు ఇంకా బాగా అర్థం కావాలంటే ఒక ఉదాహరణ చూద్దాం.

మహా సముద్రం మనందరుకు తెలుసు. ఆ సముద్రం ఎవరి ప్రాంతంలో వుంటే వారు ఒక పేరు పెట్టుకున్నారు. అలా ఒకే సముద్రానికి వేరు వేరు పేర్లు పెట్టుకుని, వేరు వేరు పేర్లతో ఎలా పిలుస్తారో! అలాగే ఒకే **'పరబ్రహ్మ'**ను వేరు వేరు ప్రాంతాల వారు, వేరు వేరు మతాలు స్థాపించుకుని వేరు వేరు పేర్లతో పిలుస్తున్నారు.

అలా కొంతమంది "అల్లా" అంటారు. కొంతమంది 'నా తండ్రి' అంటారు. కొంతమంది 'భగవంతుడు' అని, 'పరబ్రహ్మ' అని, 'పరమాత్మ' అని, 'పరమేశ్వరుడు' అని 'సృష్టికర్త' అని, 'ఆదిశక్తి' అని రకరకాల పేర్లతో పిలుస్తున్నారు. భూమి మీద వున్నది ఒకే 'సముద్రం' ఎలాగో! అలాగే ఈ సృష్టిలో వున్నది ఒకే 'భగవంతుడు'.

గమనిస్తే మహా సముద్రంలోని నీరు ఆవిరై, మేఘాలుగా మారి భూమి మీద వివిధ ప్రాంతాలలో వర్షించి, నదులుగా రూపొంది, భూమి మీద ప్రవహించి, అనేక ప్రాంతాలను సస్యశ్యామలం చేసి, పంటలు పండించి, లాభాలు కలుగచేసి, చివరకు అన్నీ అదే సముద్రాన్ని చేరుతున్నాయి.

అలాగే ఆ పరబ్రహ్మలో నుంచే యీ దేవుళ్ళంతా అంశలుగా ఉద్భవించి, వివిధ ప్రాంతాలలో జీవించి, అక్కడి వారందరికీ జ్ఞానబోధ చేసి, వారందరికీ ఎన్నో లాభాలు చేకూర్చి, సత్యమార్గాన్ని చూపి చివరకు ఆ పరబ్రహ్మను అంటే ఆయన రాజ్యానికి చేరుతారు.

అలా నదులు చూడటానికి వివిధ ప్రదేశాలలో వుంటున్నాయి. వివిధ ఆకృతులలో వుంటున్నాయి. వివిధ పేర్లతో పిలువబడుతున్నాయి. కానీ ఆ నదులన్నిటిలోని నీరు ఒకే సముద్రంలోనివే. ఒకే సముద్రంలోని నీరే, నదులుగా ఏర్పడి, చివరకు మరలా ఒకే సముద్రాన్ని చేరుతున్నాయి. కానీ వివిధ ప్రాంతాలకు, ప్రాంతాలలోని వారికి మేలు చేకూర్చడం కోసం, లాభం కలిగించడం కోసం వివిధ ప్రాంతాలలో ప్రవహిస్తున్నాయి.

అలాగే దేవుళ్ళు చూడటానికి వివిధ ప్రాంతాలలో, వివిధ రూపాలలో వుండడం వల్ల జనులు వివిధ నామాలతో పిలుస్తున్నారు. కానీ అందరూ ఒకే 'భగవంతుని' నుంచి ఉద్భవించిన వారే! ఒకే పరబ్రహ్మ నుంచి ఉదయించిన వారే, వారంతా చివరకు మరలా ఒకే సత్యలోకానికి చేరతారు. కానీ వివిధ ప్రాంతాలలోని జనులకు, జీవులకు మేలు చేకూర్చడం కోసం, జ్ఞానవంతుల్ని చేయడం కోసం వివిధ ప్రాంతాలలో వివిధ రూపాలు తీసుకున్నారు.

సృష్టి రహస్యం ఏమిటంటే భూమి మీద ఒక్కటే సముద్రం ఎలాగో! సృష్టిలో భగవంతుడు కూడా ఒక్కడే. నదులు సముద్రం నుండి ఉద్భవించినట్టే! దేవుళ్ళు కూడా భగవంతుని నుండి ఉద్భవించిన అంశలు. అందుచేత దేవుళ్ళంతా వేరు వేరు అనుకునేవాడు 'అజ్ఞాని'. 'అంతా ఒక్కటే' అని తెలుసుకున్నవాడే 'జ్ఞాని'.

అజ్ఞాని ఎప్పుడూ దుఃఖంలో వుంటాడు. జ్ఞాని ఎప్పుడూ ఆనందంలో వుంటాడు. ఎవరైతే ఆ దేశం వేరు, ఆ ప్రాంతం వేరు, ఆ మతం వేరు, ఆ కులం వేరు, ఆ కుటుంబం వేరు, వాడు ధనవంతుడు, వీడు పేదవాడు, వాడు తెలివైనవాడు, వీడు తెలివితక్కువ వాడు లాంటి భావం వ్యక్తం చేస్తూ వుంటారో! వారంతా అజ్ఞానంలో వున్నట్టే! సృష్టి రహస్యం అర్థం కానట్టే!

ఎవరైతే ప్రత్యేకతలు అంటే కులపరమైన, మతపరమైన, ప్రాంతపరమైన ప్రత్యేకతలు, ప్రదర్శిస్తూ వుంటారో! తన ప్రదర్శన ద్వారా వేరు వేరు అనే భావాన్ని వ్యక్తపరుస్తూ వుంటారో! వారంతా అజ్ఞానంలో వున్నట్టే! ఈ సృష్టి రహస్యం అర్థం కానట్టే! వీరంతా కచ్చితంగా దుఃఖంలో వుంటారు. వారు ఎన్ని ఆరాధనలు చేసినా! ఎన్ని ప్రార్థనలు చేసినా! ఎన్ని భజనలు, వేడుకోళ్ళు చేసినా! దీనాలాపనలు చేసినా వారికి దుఃఖం పోదు.

ఈ సృష్టిలో ఎన్నో జాతులున్నాయి. మానవజాతి, జంతుజాతి, పక్షిజాతి, క్రిమి కీటకజాతి, వృక్షజాతి లాంటివి. అన్ని జాతులు ఒక్కడే అయిన భగవంతుని నుంచే ఉద్భవించాయి. అందుకే 'అందరూ ఒక్కటే' అని తెలుసుకోవాలి.

భక్తిని 4 రకాలుగా విభజించారు. 1) అథమా భక్తి, 2) ఉత్తమ భక్తి, 3)అనన్య భక్తి, 4) పూర్ణ భక్తి.


1) కోరికలతో ఆరాధించే వారిది అధమా భక్తి అంటారు.

2) కోరికలు లేకుండా ఆరాధించే వారిది ఉత్తమ భక్తి అంటారు.

3) అన్నిట్లో, అందరిలో వుండేది ఒక్కడే అనే వారిది అనన్య భక్తి అంటారు.

4) అలాగే అన్నీ ఒక్కటే, 'అందరూ ఒక్కటే' అన్న స్థితిని, అవగాహనను పూర్ణ భక్తి అంటారు. వీరే ముక్తిని పొందగలరు.

అందుచేత 'అందరూ ఒక్కటే', 'దేవుళ్ళందరూ ఒక్కటే' అన్న సృష్టి రహస్యం అర్థం చేసుకోండి. భగవద్గీత ద్వారా భగవానుడు బోధించింది అర్థం చేసుకోండి. అంతా మీరేనని తెలుసుకోండి. విభేధాలు మానండి. అసూయ, ద్వేషాలు వదలండి. జంతువులను, అమాయక జీవులను చంపకండి. వాటి మాంసాన్ని భక్షించకండి. "మిమ్మల్ని మీరు ప్రేమించుకున్నట్టు అందరినీ, అన్నిటినీ ప్రేమించండి". లోకానికి సేవ చెయ్యండి. అలాంటి స్థితి రావాలంటే ధ్యానం చెయ్యవలసిందే. అందుచేత ధ్యానం చెయ్యండి.



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాసమీద ధ్యాస




ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.




# భగవానుడు "ఉద్ధరేదాత్మనాత్మానం" అనడానికి కారణం

భగవద్గీతలో భగవానుడు బోధించిన అతి ముఖ్యమైన సందేశం "ఉద్ధరేదాత్మనాత్మానం" అంటే ఎవరిని వారే ఉద్ధరించుకోవాలని.

గమనిస్తే లోకమంతా ఆయన్ను ఉద్ధరించమని పూజిస్తున్నారు, ప్రార్థిస్తున్నారు, ఆరాధిస్తున్నారు. కానీ ఆయన మాత్రం ఎవరిని వారే ఉద్ధరించుకోవాలంటున్నారు. ఈ విషయంలో కూడా భగవానుడు చెప్పిందానికి లోకం విరుద్ధంగా ప్రవర్తిస్తుంది. అంటే భగవానుడు చెప్పింది అర్థం కాలేదనేగా? అర్థం కానివారే విరుద్ధంగా ప్రవర్తిస్తారు.

మరి భగవానుడు అలా చెప్పడానికి కారణం ఏమిటి? కారణం మనం మానవులం కాదు మనమే ఆ దేవుళ్ళం. ఇదీ అసలు రహస్యం. కానీ మనం, భగవానుడు వేరు మనం వేరు అనుకుంటున్నాం. అంటే ఆయన దేవుడు, మనం మానవులమని భావిస్తున్నాం.

ఎందుచేతనంటే మనం మానవులమయినపుడు! దేవుడు వేరే వున్నప్పుడు! ఆయన వచ్చి మనల్ని ఆదుకుంటాడు, రక్షిస్తాడు. ఉద్ధరిస్తాడు. కానీ ఆ దేవుడే మనమైనపుడు! దేవుడు వేరే లేనపుడు! ఎవరు వస్తారు? మనల్ని ఎవరు ఆదుకుంటారు? ఎవరు రక్షిస్తారు? ఎవరు ఉద్ధరిస్తారు? చెప్పండి. రక్షించే దేవుడే మనమైనపుడు మనల్ని మనమే రక్షించుకోవాలి. మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి. ఇదే గీతలో భగవానుడు బోధించింది.

ఇంతకీ మనం దేవుళ్ళమెలా అవుతాం? ఇదే అందరి సందేహం. కానీ తెలుసుకోండి. మనం 'దేహాలం కాదు'. 'మనం ఆత్మలం'. 'ఆత్మ' దేవుడైనపుడు, మనమంతా 'దేవుళ్ళమే' కదా! అందుచేత **"మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి".** మనల్ని మనమే ఆరాధించుకోవాలి. అంటే మనమీద మనమే దృష్టి వుంచాలి. అంటే మన స్వరూపంతో మనమే కూడుకొని వుండాలి.

అదే అసలైన 'భక్తి'. అంటే మనల్ని మనం ఆరాధించుకోవడమే 'భక్తి'. ఇదే విషయం వేదాలలో కూడా చెప్పబడింది.

"స్వస్వరూపానుసంధానం భక్తిరీత్యభిధీయతే"

ఎవరి స్వరూపంతో వారు అనుసంధానమై వుండడమే 'భక్తి' అనబడుతుంది.

ఇదే విషయం వేమన యోగి కూడా చెప్పారు.

**"పూజ సేయ సేయ పూజారి తానాయె!**
**పూజ్య వస్తువెన్న భువిని తానె!**
**యాడ పూజ సేయు నెల్లదిక్కులు తానె!**
**తానె నేను, నేనె తాను, వేమ!"**

అంటే ఎక్కడ పూజ చేస్తాం? ఎవరికి పూజ చేస్తాం? అంతా మనమైనపుడు మనల్ని మనమే పూజించుకోవాలని వేమన యోగీంద్రులు చెప్పారు.

ఇది అర్థం చేసుకుని మనల్ని మనమే ఉద్ధరించుకొనే ప్రయత్నం చెయ్యాలి. మన శక్తిని మనమే పెంచుకోవాలి. మన రోగాలు మన ఆత్మ శక్తిని ఉపయోగించి మనమే నయం చేసుకోవాలి. మన సమస్యలు మన శక్తి ద్వారా మనమే పరిష్కరించుకోవాలి. మన కష్టాలు మన ఆత్మ శక్తి ద్వారా మనమే అధిగమించాలి. మన శాంతి మన ప్రయత్నం ద్వారా మనమే పొందాలి. మన జ్ఞానాన్ని మన ధ్యాన సాధన ద్వారా మనమే సంపాదించుకోవాలి. మన ముక్తిని మనమే పొందాలి. ఇవన్నీ తేలికగా ధ్యాన సాధన ద్వారా మనమే సంపాదించుకోవచ్చు. అలా సంపాదించుకున్న వారినే యోగులని పిలుస్తారు.

అలా ధ్యాన సాధన చేయడాన్నే 'యోగము' అని అంటారు. అందుచేత అందరం "శ్వాస మీద ధ్యాస" వుంచి ధ్యానం చేద్దాం. యోగులమవుదాం. "మనల్ని మనమే ఉద్ధరించుకుందాం". శ్రీ కృష్ణ భగవానుడు చెప్పింది అర్థం చేసుకుందాం. ఆచరిద్దాం. జన్మ ధన్యం చేసుకుందాం.

**"సముద్రం నుండి అలలు ఏర్పడినట్లు**
**భగవంతుని నుండి అన్నీ ఉద్భవిస్తున్నాయి".**



# "భగవానుడు యోగివికా! అన్నాడు కానీ, భోగివికా! అనలేదు"

లోకంలో ఎంతమందిని చూసినా అందరూ భోగాలు కోరుకునేవారే! భోగాలు అనుభవించాలనుకునేవారే! అంటే సుఖాలు కోరుకునేవారే! అంతా జీవితంలో సుఖ పడాలనుకునేవారే! ఒక ఇంద్రియంతో కాదు పంచ ఇంద్రియాలతో సుఖాలు అనుభవించాలనుకునేవారే. ఎన్ని సుఖాలు వున్నా ఇంకా, ఇంకా సుఖాలు కావాలనుకునే వారే కనిపిస్తారు.

అంతేకాదు ఆ సుఖాలు అనుభవించాలంటే ముఖ్యంగా డబ్బు కావాలి, కాబట్టి, అంతా సంపాదనకే ప్రాముఖ్యం ఇస్తున్నారు. రోజులో ఎక్కువ సమయం ధన సంపాదనకే కేటాయిస్తున్నారు. ఉద్యోగం చేసో! ఏదైనా వృత్తి చేసో! లేదా ఏదైనా వ్యాపారం చేసో! లేదా సినిమాల ద్వారానో! లేక రాజకీయాలలో ప్రవేశించో! ఏదో ఒక రకంగా డబ్బు సంపాదించాలని ప్రతీ ఒక్కరూ తాపత్రయ పడుతున్నారు. అలా ధనం బాగా సంపాదించి ప్రతీ ఒక్కరూ టాటాలు, బిర్లాలు, అంబానీలు అయిపోవాలని భావిస్తున్నారు. అలా సంపాదిస్తే బాగా సుఖ పడవచ్చని భావిస్తున్నారు. జీవిత ధ్యేయం అదే అనుకుంటున్నారు.

అందుచేత ఎవరికి వారు ఎంత సంపాదించాను? అని చూస్తున్నారు కానీ; ఎలా సంపాదించాను? అని చూడటం లేదు. న్యాయంగా సంపాదించానా? ధర్మయుక్తంగా సంపాదించానా? సృష్టికి, భగవంతుని ఆశయాలకు అనుగుణంగా సంపాదించానా? అని చూడటం లేదు. అలా ఎవరిని చూసినా వారి జీవిత ధ్యేయం ధన సంపాదనే అన్నట్టుగా వుంది. వారు ఎంత ధనవంతులైనా, ముసలివారైనా, ఓపిక లేకపోయినా సంపాదించడానికే ప్రయత్నిస్తున్నారు. సంపాదనకు ఖాళీ లేకుండా కష్టపడుతున్నారు. ఉదయం లేచినప్పటి నుండి, రాత్రి పడుకునే వరకు ఎంతసేపూ ఉరకలు, పరుగులు.

నగరాలలో చూస్తే ఇది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఎవరిని అడిగినా, ఎవరిని కదిపినా ఎంతసేపూ ఖాళీ లేదు. ఖాళీ లేదు. ఇదే సమాధానం. కారణం బాగా సంపాదించి ధనవంతులైపోదామని. ధనంతో గొప్పవాళ్ళమై పోదామని. ఇదే అందరి జీవిత ఆశయంలా వుంది.

తల్లితండ్రులను ఎవరిని చూసినా పిల్లలను ధన సంపాదన దృష్టితోటే చదివిస్తున్నారు. ధనం సంపాదించగలిగే చదువులనే ప్రోత్సహిస్తున్నారు. అలాంటి ఉద్యోగాలే చెయ్యమంటున్నారు. అలాంటివి పొందగలిగితేనే డబ్బు, సుఖం లభిస్తాయనుకుంటున్నారు. అదే జీవిత లక్ష్యమను కుంటున్నారు.

అంతేకాదు అలా సంపాదించిన ధనంతో, భోగాలు అనుభవించడానికి విలాసవంతమైనవెన్నో సమకూర్చుకుంటున్నారు. అంటే కార్లు, భవంతులు, ఫర్నీచర్ లాంటివి. అవి చూసి మురిసిపోతున్నారు. గొప్పగా గొప్పలు చెప్పుకుంటున్నారు. అదే అదృష్టమని భావిస్తున్నారు. అంతేకానీ అంతకన్నా ఆలోచించడం లేదు. అలాంటివి పొందలేనివారు మరొక మార్గం తెలియక భగవంతుడిని పూజిస్తూ, ప్రార్థిస్తూ, భజిస్తూ రకరకాల ఆరాధనలు చేస్తూ తమకు అలాంటి భోగాలు సమకూర్చమని, ధనం ప్రసాదించమని వేడుకుంటున్నారు. కోరుకుంటున్నారు. ఒకవేళ తమ కోరికలు నెరవేరకపోతే దేవుళ్ళను మారుస్తున్నారు. మతాలు మారుస్తున్నారు. అంతేకానీ అంతకన్నా ఆలోచించడం లేదు. అలా అందరూ భోగాలు కావాలని కోరుకుంటున్నారు. 'భోగులు' కావాలనే ఆకాంక్షిస్తున్నారు.

మరి శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా అలా అందరినీ భోగులు అవ్వమనే చెప్పాడా? ఇంకేమీ చెప్పలేదా? ఆలోచించండి! ఆయన కచ్చితంగా స్పష్టంగా 'యోగివికా' అని చెప్పాడు. అంతేకాని ఎక్కడా 'భోగివికా' అనలేదు. అంతేకాదు 'యోగత్వం' అన్నిటి కంటే ఎంత గొప్పదో! యోగి స్థితి ఎలా వుంటుందో! యోగి కావడానికి ప్రయత్నం చేసిన వారికి అది సిద్ధించకపోయినా ఎలాంటి లాభాలు పొందగలరో! అలాగే యోగి చివరకు ఎలాంటి స్థితి పొందుతాడో! చెప్పడం జరిగింది.

అలా భగవానుడు అర్జునుని ద్వారా లోకంలోని వారికి 'యోగులు' అవ్వమని బోధిస్తే, లోకమంతా దానికి విరుద్ధంగా 'భోగులు' కావడానికే

ప్రయత్నిస్తున్నారు. ప్రతీ ఒక్కరూ బిర్లాలు, టాటాలు, అంబానీలు అయిపోవాలనే ప్రయత్నిస్తున్నారు. అలా కాలేకపోతున్నారు. కానీ ఒక్కరూ భగవానుడు చెప్పినట్టు 'యోగి' అవడానికి ప్రయత్నించడం లేదు. అంటే ఆయన చెప్పింది ఒకటి! లోకంలో చేసేది మరొకటి! అంతా ఆయన గొప్పవాడు అంటారు కానీ, అంతటి గొప్పవాడు చెప్పింది ఆచరించరు.

కానీ అంతటి గొప్పవాడు చెప్పింది ఎంత గొప్పదై వుంటుంది? అది ఆచరించినవాడు ఎంతటి గొప్పవాడవుతాడు? ఎన్ని గొప్ప లాభాలు పొందగలుగుతాడో! ఈ క్రింది శ్లోకాల ద్వారా చూద్దాం. అసలు గీతలో ఆయన అర్జునుని ఏమి అవ్వమని చెప్పాడో చూద్దాం.

**శ్లో॥ తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోధికః**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున (భ.గీ.6-46)**

తా:- ఓ అర్జునా! యోగి అనువాడు తపస్సులు చేసే వారి కంటే, శాస్త్ర జ్ఞానము కలవారి కంటే, అగ్నిహోత్రాది కర్మలు చేసేవారి కంటే శ్రేష్టుడు. కావున నీవు యోగివి కమ్ము.

పై శ్లోకం ద్వారా తపస్సు చేసేవారు అంటే శరీరాన్ని తపింపచేసుకునే వారు అంటే ఎండలో నుంచోవడం, ఒంటికాలిపై నిలబడడం, రెండు చేతులు పైకి ఎత్తడం, హఠయోగం ద్వారా కఠినమైన భంగిమలు వేయడం, అన్నపానీయాలు మానడం (ఉపవాసం) లాంటివి చేసి శరీరాన్ని శుష్కింప చేసుకునే వారి కంటే యోగి గొప్పవాడు.

అలాగే శాస్త్ర జ్ఞానము కలవారు అంటే పుస్తకజ్ఞానం, పండిత జ్ఞానం అంటే పుస్తకాలు చూసి అనర్గళంగా ఉపన్యాసాలు చెప్పే పండితులకంటే! శాస్త్రాలను అధ్యయనం చేసే వారికంటే! యోగి గొప్పవాడు.

అలాగే కర్మలు చేసేవారు అంటే నిత్య నైమిత్తిక కర్మలు అంటే సంధ్యా వందనం, సూర్య నమస్కారాలు, గాయత్రి మంత్రం లాంటి నిత్య అనుష్ఠానాలు. అలాగే యజ్ఞ, యాగాది కర్మలు చేసే వారి కంటే 'యోగం' చేసే 'యోగి' గొప్పవాడు. అందుచేత అర్జునా యోగివి కా! అని భగవానుడు చెప్పడం జరిగింది. మరి ఎవరు యోగి? దేనిని యోగమంటారు?

యోగ శాస్త్రానికి మూలపురుషుడైన "పతంజలి మహర్షి" "యోగః చిత్తవృత్తి నిరోధః" అని యోగానికి నిర్వచనం ఇచ్చారు. అంటే చిత్త వృత్తులు

నిరోధించడమే యోగమనబడుతుంది. చిత్త వృత్తులు అంటే చిత్తము యొక్క వృత్తులు. చిత్తము అంటే మనస్సు. మనస్సు యొక్క వృత్తులు అంటే ఆలోచనలు. అంటే మనస్సులోని ఆలోచనలు నిరోధించడమే యోగము. అంటే ఆలోచనలు లేని స్థితిలో వుండడమే 'యోగ'మంటారు. ఆ స్థితిలో వున్నవాడే 'యోగి' అని పిలువబడతాడు.

అలా ఆలోచనలు లేని 'యోగ స్థితి'లో వుండటానికి, అలాంటి స్థితి సాధించడానికి బ్రహ్మర్షి పత్రీజీ తేలికైన, సులువైన మార్గం 'శ్వాస మీద ధ్యాస ధ్యానం' మనకు అందించారు. ఎవరైనా సరే శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చేస్తే వారు తొందరగా చిత్తవృత్తులు నిరోధించుకుని, మనస్సులేని స్థితిలో అంటే 'ఆత్మ స్థితి'లో వుంటారు. అలా ఆత్మతో కూడి వుండడమే 'యోగ' మనబడుతుంది. 'ఆత్మ' అంటే 'భగవంతుడే' కదా? అంటే భగవంతునితోకూడి వుండడమే 'యోగము' అవుతుంది. అలా వున్నవాడే 'యోగి' అనబడతాడు.

అందుచేత భగవంతుని నోటితో ప్రార్థించే వారి కంటే, ఆయన నామాన్ని మనస్సులో స్మరించే వారికంటే, కోరికలతో ఆయన గురించి అధ్యయనం చేసే వారి కంటే, ఆయన గురించి చెప్పే వారి కంటే, యజ్ఞయాగాది కర్మలు చేసే వారి కంటే, మనస్సు లేని స్థితిలో భగవంతునితో వుండే యోగి చాలా చాలా గొప్పవాడని భగవానుడు చెప్పడం జరిగింది.

**శ్లో॥ యోన్తః సుఖో న్తరారామ స్తథాన్తర్జ్యోతిరేవ యః**
**సయోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోధిగచ్ఛతి (భ.గీ.5-24)**

తా:- ఎవడు తనలోని ఆత్మతో సుఖిస్తూ, ఆత్మతో క్రీడిస్తూ, ఆత్మయందే ఉంటాడో! అట్టి యోగి బ్రహ్మస్వరూపుడై బ్రహ్మ సాక్షాత్కారమును పొందును.

అంటే 'ధ్యానం' ద్వారా ఎవరవుతే మనస్సు లేని స్థితిలో 'ఆత్మ'తో అంటే 'భగవంతుని'తో వుంటారో వారు చివరకు భగవంతుని పొందుతారు. అంటే మోక్షాన్ని పొందుతారని ఈ శ్లోకం ద్వారా భగవానుడు చెప్పడం జరిగింది. అంటే ధ్యానం చేసే వారే భగవానుని పొందగలరు. కానీ ఇంక ఏ సాధన చేసినా భగవానుని పొందలేరు. అందుచేతే అన్ని సాధనలు చేసే వారికంటే ధ్యాన యోగి అంటే ధ్యానం చేసే వారే గొప్పవారని భగవానుడు చెప్పడం జరిగింది.

'ధ్యానం' గొప్పది కాబట్టి, 'ధ్యానం' ద్వారా మోక్షాన్ని పొందవచ్చు కాబట్టి, అందరినీ 'ధ్యాన యోగి' కమ్మని భగవానుడు చెప్పాడు. అంతేకానీ బిర్లా అవ్వమని, అంబానీ అవ్వమని, పదవులు సంపాదించమని ఎక్కడా చెప్పలేదు. ఇది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి.

అంతేకాదు అలా యోగి అవ్వటానికి ప్రయత్నించినవాడు యోగి కాలేకపోయినా, ఎలాంటి లాభాలు పొందగలరో! అంతేకాదు ధ్యానం చేస్తే ఎలాంటి లాభాలు భవిష్యత్తులో కలుగుతాయో! కూడా భగవానుడు చెప్పడం జరిగింది. ఎందుచేతనంటే ధ్యానంలో ఆలోచనలు లేని స్థితి, అంటే మనస్సును నిగ్రహించగలిగిన స్థితి, శూన్యం చేసుకోగలిగిన స్థితి సాధించడం చాలా కష్టం. ఇదే విషయం అర్జునుడు భగవానుని అడుగగా! అంటే అలా నేను అనుకున్నది సాధించలేకపోతే అంటే 'ధ్యానం' ప్రారంభించి ఆత్మను పొందలేకపోతే నా పరిస్థితి ఏమిటి? ఏమీ చేయక పోవడం వల్ల ఇహంలోనూ, సాధన పూర్తి చేయలేకపోవడం వల్ల పరంలోనూ నష్టపోయి, చివరకు రెంటికీ చెడిన రేవడి అయిపోనా అని అర్జునునకు సందేహం కలిగింది. ఈ విషయాన్నే ఈ క్రింది శ్లోకం ద్వారా భగవానుని అడగడం జరిగింది.

**శ్లో॥ కచ్చిన్నోభయవిభ్రష్ట శ్చిన్నాభ్రమివ నశ్యతి**
**అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి. (భ.గీ.6-38)**

తా:- ఓ కృష్ణా! బ్రహ్మమార్గంలో (యోగమార్గంలో) స్థిరము లేని మూఢుడు ఇహపరముల రెండింటికీ చెడినవాడై చెదిరిన మేఘము వలె నశించిపోడా? ఏమి?

అంటే ఇహంలో ధన సంపాదన మాని ధ్యానం చేస్తూ కూర్చుంటే ఇహలోకంలో పొందే సుఖాలు పొందలేక! అలాగే యోగసాధన పూర్తి చేయకపోవడం వల్ల పరంలో పొందే లాభాలు అంటే మోక్షం పొందలేక! రెంటికీ చెడిన రేవడిని అవుతానా? అనే సందేహాన్ని అర్జునుడు వ్యక్తం చేసాడు. అంటే ధ్యానాన్ని పూర్తి చేయకుండా అంటే యోగాభ్యాసం చేస్తూ మధ్యలో శరీరం వదిలిన వారి పరిస్థితి ఏమిటి? అని శ్రీ కృష్ణ భగవానుని ప్రశ్నించడం జరిగింది. దానికి భగవానుడు

**శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోభిజాయతే (భ.గీ.6-41)**

తా:- అట్టి యోగభ్రష్టుడు (మరణానంతరము) పుణ్యాత్ముల లోకమును పొంది, అచట అనేక సంవత్సరములు నివసించి, తదుపరి సదాచారవంతులైన శ్రీమంతుని యొక్క గృహమందు పుట్టుచున్నాడు.

**శ్లో॥ అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ (భ.గీ.6-42)**

తా:- లేక జ్ఞానవంతులగు యోగుల యొక్క వంశమందు జన్మించు చున్నాడు. అలాంటి జన్మ లభించడం లోకంలో మహా దుర్లభము.

ఇక్కడ మనం కొంచెం ఆలోచించాలి. ధ్యానం చేసేవారికి సామాన్యంగా ఏ లాభాలు పైకి కనిపించవు. వారికి ధన సంపాదన ఎక్కువ వుండదు. అంతేకాదు సాధారణంగా ధనం తక్కువ వున్నవారే ధ్యానం చేస్తూ వుంటారు. వారిని చూసి మిగతా వారు ఏమిటి? వీళ్ళు ఏమీ చేయకుండా! ఏమీ సంపాదించకుండా! ఏమీ అనుభవించకుండా! అలా ఎప్పుడూ ధ్యానం చేస్తూ కూర్చుంటారు. చాలా తెలివి తక్కువ వారిలా వున్నారే! అని ధ్యానం చేసే వారిని చూసి చాలా మంది అనుకుంటూ వుంటారు. అనే వారు కూడావున్నారు.

కానీ అలా ధ్యానం చేసే వారు ఎంత గొప్పవారో! వారు పరంలో ఎంతటి గొప్ప లోకాలకు చేరుకుంటారో! మరలా వారికి ఎంత ఉన్నతమైన జన్మ లభిస్తుందో! పై శ్లోకాల ద్వారా భగవానుడు తెలియచేయడం జరిగింది. ఆయన చెప్పిన ప్రకారం మరుజన్మలో అప్రయత్నంగానే శ్రీమంతుల ఇళ్ళలో జన్మిస్తారని, గొప్ప జ్ఞానవంతులగు యోగుల ఇళ్ళలో జన్మిస్తారని, అలాంటి జన్మ లభించడం మహా దుర్లభమని ఆయన చెప్పడం జరిగింది. అందుకే ఆయన అందరికంటే 'యోగి' గొప్పవాడని చెప్పడం జరిగింది. ఆఖరుకు యజ్ఞ, యాగాది కర్మలు చేసే వారి కంటే 'యోగి' గొప్పవాడని చెప్పడానికి కారణం ఇదే.

దీనిని బట్టి 'ధ్యానం' చేసే 'యోగి' ఎంత గొప్పవాడో! ఎంత అదృష్టవంతుడో! అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ధ్యానం చేసే వారు సామాన్యంగా కనిపించవచ్చు. లోకం దృష్టిలో సామాన్యులు కావచ్చు. కానీ అందరికంటే వారే గొప్పవారని భగవానుడు చెప్పిన దానిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కొంతమంది ధనవంతులుగా వుండవచ్చు. కానీ ఆ

ధనం చనిపోయిన తరువాత పరానికి కానీ, మరుజన్మకు కానీ తీసుకు వెళ్ళలేరు. అంతేకాదు వారి మరుజన్మ ఎలా వుంటుందో కూడా తెలియదు. కాని ధ్యానం చేసిన వారు పరంలో పుణ్యా లోకాలు పొందడమే కాదు, మరు జన్మలో శ్రీమంతులుగా కాని, గొప్ప యోగులుగా కాని జన్మిస్తారని, అంతేకాదు అలాంటి జన్మలు పొంది వారు తదనంతర సాధన పూర్తి చేసుకుని మోక్షాన్ని కూడా పొందుతారని భగవానుడు చెప్పారు.

ఈక్రింది శ్లోకం చూద్దాం:–

**శ్లో॥ ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః**
**అనేకజన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్** **(భ.గీ.6–45)**

తా:– అలా ప్రయత్నించునట్టి యోగి పాపరహితుడై, అనేక జన్మములందు చేయబడిన అభ్యాసముచే యోగ సిద్ధిని పొంది ఆ పిదప సర్వోత్తమమగు మోక్షమును పొందుచున్నాడు.

అలా ధ్యానం చేసే యోగి గొప్ప జన్మలు పొందడమే గాక, చివరకు మోక్షాన్ని కూడా పొందగలరు కాబట్టి. అర్జునుని 'యోగివికా!' అని భగవానుడు చెప్పడం జరిగింది.

అర్జునునకు చెప్పాడు అంటే మనందరికీ చెప్పినట్టే! అందుచేత బిర్లాలు, టాటాలు, అంబానీలు అవ్వాలనే ప్రయత్నం మాని భగవానుడు చెప్పినట్టు యోగి కావడానికి ప్రయత్నించాలి. 'ధ్యానం' చెయ్యాలి. 'ధ్యానం' చెయ్యడం కంటే మానవుడు చెయ్యగలిగిన గొప్పపని ఈ భూలోకంలో ఇంకొకటి లేదని తెలుసుకోవాలి. అదే భగవానుడు చెప్పిన సందేశం.

మనం ఇంకొకటి గుర్తుంచుకోవాలి. మనం ఎంత ప్రయత్నించినా బిర్లాలు, టాటాలు, అంబానీలు కాలేము. కారణం దానికి అర్హత వుండాలి. కానీ ధ్యానం చేస్తే యోగులుగా అవ్వగలం. అలా యోగులయ్యే అర్హత, ధ్యానం చెయ్యగల శక్తి, ప్రతీ ఒక్కరికి వుంది. అందుచేత అందరూ ధ్యానం చెయ్యండి. భగవానుడు చెప్పినట్టు 'యోగులు' కండి.

**"హంసల బారులు, రత్నాలరాశులు ఉండవు.**
**అలాగే సజ్జనుల సమూహాలు, యోగుల గుంపులు వుండవు".**



# భగవద్గీతను బట్టి యోగి ఎవరు? భోగి ఎవరు?

శ్లో॥యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః
(భ.గీ.2-69)

తా:- సామాన్య జనులకు (భోగికి) ఏది రాత్రో, యోగికి అది పగలు, సామాన్యులకు ఏది పగలో యోగికి అది రాత్రి.

దీనిని బట్టి భోగి పగలు మేలుకుంటాడని, రాత్రి నిద్రపోతాడని, అలాగే యోగి పగలు నిద్రపోతాడని, రాత్రి మేలుకుంటాడని అంతా అనుకుంటారు. ఇక్కడ కూడా భగవానుడు చెప్పింది ఒకటి, అందరూ అర్థం చేసుకునేది మరొకటి. కానీ శ్రీ కృష్ణ భగవానుడు చెప్పిన ఉద్దేశ్యం అది కాదు.

ఆయన చెప్పింది భోగి ఏ విషయాల పట్ల ఆసక్తి చూపిస్తాడో, ఆ విషయాల పట్ల యోగి అనాసక్తితో వుంటాడని, అలాగే భోగి ఏ విషయాల పట్ల అనాసక్తిగా వుంటాడో ఆ విషయాల పట్ల యోగి ఆసక్తిగా వుంటాడని దీని అర్థం.

సహజంగా భోగి ప్రాపంచిక విషయాలు అంటే ధన సంపాదన, భోగాలు, పదవులు, ఉద్యోగాలు, బంధుమిత్రులు, ఫంక్షన్లు, పార్టీలు లాంటి విషయాల పట్ల చాలా ఆసక్తి చూపిస్తూ వుంటాడు. కానీ అవే విషయాల పట్ల యోగి చాలా అనాసక్తిగా వుంటాడు. అంటే రాత్రి నిద్రించినట్లు వుంటాడు.

అలాగే భోగి ఆధ్యాత్మిక విషయాలు అంటే ఆత్మ విషయాలు పట్ల అనాసక్తిగా నిద్రపోతూ వుంటాడు. కానీ అవే విషయాల పట్ల యోగి చాలా ఆసక్తి చూపిస్తూ వుంటాడు. మేలుకొని వుంటాడు.

దీనిని బట్టి మనం యోగిలా అవ్వాలంటే! యోగిలా ఆధ్యాత్మిక విషయాలు పట్ల అంటే ఆత్మ విషయాల పట్ల ఆసక్తి చూపించాలి. యోగిలా ప్రవర్తించాలి. మరి యోగి ఏం చేస్తాడు? 'ధ్యానం' చేస్తాడు. అంటే మనం కూడా ధ్యానం చెయ్యాలి. ధ్యానం పట్ల ఆసక్తి చూపించాలి. ఇదే శ్రీ కృష్ణ భగవానుడు చెప్పిన దానికి అర్థం.



# భగవంతునికి ఇష్టమైనవారు ఎవరు?

సాధారణంగా చాలా మంది తమకు భగవంతుడండే ఇష్టమంటారు. చాలా ఇష్టమా? అంటే ఆ! చాలా ఇష్టం! అని కూడా అంటారు. నీకు భగవంతుడండే ఇష్టమని ఎలా చెప్పగలవు? అని అంటే నేను రోజూ పూజ చేస్తాననికొందరు, భజన చేస్తానని కొందరు, ప్రార్ధన చేస్తానని కొందరు, నైవేద్యాలు, ప్రసాదాలు సమర్పిస్తానని కొందరు, రోజూ జపం చేస్తానని కొందరు, రోజూ గుడికి వెడతానని కొందరు చెపుతూవుంటారు. ఇవన్నీ భగవంతుడంటే ఇష్టం కాబట్టే చేస్తున్నానని అంటారు.

అలా తనకు భగవంతుడంటే ఇష్టమంటారు కాని, అసలు తాను భగవంతునికి ఇష్టుడయ్యాడా లేదా? అన్నది ఆలోచించరు. ఎందుకంటే తనకు భగవంతుడు ఇష్టమైనంత మాత్రాన ప్రయోజనం లేదు. భగవంతునికి తాను ఇష్టుడవ్వాలి. అలా భగవంతునికి తాను ఇష్టుడయిపుడే తన జీవితం ధన్యం అవుతుంది.

మరి భగవంతునికి తాను ఇష్టుడవ్వాలంటే! తనకు ఇష్టమైనట్టు చేస్తే సరిపోదు. తాను చేసే పని భగవంతుడు మెచ్చాలి! మరి భగవంతుడు మెచ్చాలంటే! ఏం చేస్తే భగవంతుడు మెచ్చుతాడో తెలుసుకోవాలి. అంతేకాని అలా తెలుసుకోకుండా తనకు నచ్చినట్టు పూజచేసో, ప్రార్థించో, భజన చేసో, నామస్మరణ చేసో భగవంతునికి ఇష్టుడైపోయినట్టు భావిస్తే ప్రయోజనం ఏమీవుండదు. అందుచేత ఈ విషయం బాగా ఆలోచించాలి. ఏమీచేస్తే భగవంతునికి ఇష్టులవుతామో తెలుసుకోవాలి.

మరి ఎలా తెలుస్తుంది? అని అనవచ్చు. కాని తేలికగా తెలుసు

కోవచ్చు. ఎలా? అంటే భగవద్గీత ద్వారా భగవానుడు స్వయంగా తనకు ఎవరు ఇష్టులో తెలియచేసారు. ఈ క్రింది శ్లోకాలు చూస్తే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

**శ్లో॥ చతుర్విధా భజన్తే మాం జనాస్సుకృతినోర్జున**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. (భ.గీ 7-16)**

**శ్లో॥ తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే**
**ప్రియో హి జ్ఞానినోత్యర్థమహం స చ మమ ప్రియ: (భ.గీ 7-17)**

తా:- భరతవంశ శ్రేష్ఠుడవగు ఓ అర్జునా! ఆపదలలో ఆర్తనాదాలు చేసేవారు, ధనాన్ని ఆశించేవారు, భగవంతుని తెలుసుకోవాలనే ఆసక్తి కలవారు, ఆత్మజ్ఞానము కలవారు అనే నాలుగు విధాలైన వారు నన్ను సేవిస్తున్నారు.

వారిలో పరమాత్మయందు భక్తి కలవాడగు 'జ్ఞాని' శ్రేష్టుడు. అట్టి 'జ్ఞానికి' నేనూ ఇష్టుడనే. అతడు కూడా నాకు ఎక్కువ ఇష్టుడే.

పై శ్లోకాలను బట్టి నాలుగు రకాల భక్తులలో అంటే కష్టాలు తొలగించమని, పూజలు, భజనలు, ప్రార్థనలు చేస్తూ ఆర్తనాదాలు చేసే 'ఆర్తులు' కంటే, అలాంటివే చేస్తూ ధనాన్ని, సంపదల్ని ప్రసాదించమని కోరికలు కోరే 'అర్థార్థుల' కంటే, భగవంతుని తెలుసుకోవాలనే జిజ్ఞాసతో శాస్త్రాలను అధ్యయనం చేసే 'పండితుల' కంటే కూడా, 'ధ్యానం' ద్వారా ఆత్మజ్ఞానం సంపాదించుకున్న 'జ్ఞానే' నాకు ఇష్టుడు అని భగవానుడు చెప్పడం జరిగింది. అంటే అందరి భక్తుల కంటే ధ్యానం చేసేవాడే నాకు ఇష్టుడని స్పష్టంగా శ్రీ కృష్ణ భగవానుడు చెప్పారు.

ఇంకా ఆయనకు ఎవరు ఇష్టులో ఈ క్రింది శ్లోకాలు చూద్దాం.

**శ్లో॥ అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథ:**
**సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియ:. (భ.గీ 12-16)**

తా:- కోరికలు లేనివాడు, అంతర శుద్ధిగలవాడు, వివేకవంతుడు, దేనియందు ఆసక్తిలేనివాడు, దు:ఖించనివాడు సమస్త కార్యాలు పరిత్యజించినవాడు. నాయందు (ఆత్మ యందు) భక్తి కలవాడు ఎవడుకలడో అతడు నాకు ఇష్టుడు.

పై శ్లోకాన్ని బట్టి కోరికలతో ఆరాధించకూడదని, అంతర్‌శుద్ధి అంటే మంచి గుణాలు కలిగి వుండాలని, ఏమీ ఆశించకూడదని, ఏది జరిగినా దుః ఖించకూడదని, సమస్త ఇంద్రియ ధర్మాలను పరిత్యజించాలని, తన యందు అంటే ఆత్మ యందు ఇష్టం వుండాలని, అలాంటి వారే తనకు ఇష్టులని తెలియజేసారు.

ఆయన ఇంకా :-

**శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్ర: కరుణ ఏవచ**
**నిర్మమో నిరహంకార: సమదు:ఖసుఖ: క్షమీ. (భ.గీ 12-13)**

**శ్లో॥ సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయ:**
**మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తస్స మే ప్రియ:. (భ.గీ 12-14)**

తా:- సమస్త ప్రాణులయెడల ద్వేషములేనివాడు, మైత్రి కరుణకలవాడు, అహంకార మమకారములు లేనివాడు, సుఖదుఃఖాలలో సమభావం కలవాడు, ఓర్పుకలవాడు, ఎల్లప్పుడు సంతృప్తితో వుండేవాడు, యోగయుక్తుడు, మనస్సును స్వాధీనపరచుకున్నవాడు, దృఢమైననిశ్చయముగలవాడు, నాయందు (ఆత్మయందు) సమర్పింపబడిన మనోబద్ధులుగలవాడు, నాయందు (ఆత్మ యందు) భక్తిగలవాడు ఎవడుకలడో అతడు నాకు ఇష్టుడు.

ఇక్కడ కూడా తనకు ఎవరు ఇష్టులో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఏ జంతువును హింసిం చకూడదని, వాటితో స్నేహభావం కలిగివుండాలని. వాటిపై దయచూపించాలని 'నేను' అనే అహంకారం 'నాది' అనే మమకారం ఉండకూడదని, ఉన్నదానితో తృప్తి చెందాలని, 'ధ్యానము' ద్వారా మనస్సు స్వాధీనం చేసుకోవాలని, మనస్సు, బుద్ధి బాహ్య విషయాల మీద కాక భగవంతుని పై, అంటే ఆత్మపై వుంచాలని. అంటే ధ్యానం చెయ్యాలని, అలా ఎవడు చేస్తాడో వాడే తనకు ఇష్టుడని శ్రీ కృష్ణులవారు చెప్పారు.

**శ్లో॥ యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజత్ చ య:**
**హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యస్స చ మే ప్రియ:. (భ.గీ 12-15)**

తా:- ఎవని వలన లోకములోని జనులు భయము చెందరో, ఎవడు లోకము

వలన భయము పొందడో, ఎవడు సంతోషము, క్రోధము, భయము, మనోవ్యాకులత మున్నగునవి లేకుండా వుంటాడో అట్టి వాడు నాకు ఇష్టుడు.

**శ్లో॥ యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాఙ్క్షతి**
**శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః. (భ.గీ 12-17)**

తా:- ఎవడు సంతోషింపడో, ద్వేషింపడో, శోకమునుపొందడో, ఎవడు శుభాశుభములను వదలినవాడో (మంచి-చెడు; పుణ్యము-పాపము) అట్టి భక్తుడు నాకు ఇష్టుడు.

**శ్లో॥ సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః**
**శీతోష్ణసుక దుఃఖేషు సమస్సఙ్గవివర్జితః (భ.గీ 12-18)**

**శ్లో॥ తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సంతుష్టో యేనకేనచిత్**
**అనికేతః స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియో నరః (భ.గీ 12-19)**

తా:- శత్రువునియందు, మిత్రునియందు, మానావమానములయందు శీతోష్ణ, సుఖదు:ఖములందు సమముగా ఉండేవాడు. దేనియందు ఆసక్తి లేనివాడు, నిందాస్తుతులందు సమముగా వుండువాడు, మౌనముతో వుండువాడు, దొరికిన దానితో లేక ఉన్నదానితో తృప్తిని పొందేవాడు, నిర్దిష్టమగు నివాసస్థానము లేనివాడు, నిశ్చయమగు బుద్ధిగలవాడు, భక్తితో కూడివుండువాడు అగు మనుజుడు నాకు ఇష్టుడు.

ఇక్కడ అన్నిటి యందు సమభావము కలవాడే నాకు ఇష్టుడు అని చెప్పడం జరిగింది. ఆ సమ స్థితి ఎవరికైనా 'ధ్యానం' వల్ల మాత్రమే కలుగుతుంది. 'ధ్యానం' చెయ్యనివాడు ఎప్పటికి సమ స్థితి పొందలేడు.

**శ్లో॥ యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే**
**శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేతీవ మే ప్రియాః. (భ.గీ 12-20)**

తా:- ఎవరైతే శ్రద్ధావంతులై, నా యందు (ఆత్మయందు) ఆసక్తి గలవారై ఈ అమృత రూపమగు పై ధర్మాలను ఆచరిస్తారో వారే నాకు ఇష్టులు.

ఈ విధంగా భగవానుడు తనకు ఎవరు ఇష్టులో పై శ్లోకాల ద్వారా వివరించడం జరిగింది. ఆయన చెప్పిన విధంగా ఎవరు ప్రవరిస్తారో, నడచుకుంటారో వారే భగవానునికి ఇష్టులు. అలా కాకుండా నేను పూజ

చేస్తున్నాను, భజన చేస్తాను, నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ప్రార్థన క్రమం తప్పక చేస్తున్నాను అనుకుని నిజ జీవితంలో భగవానుడు చెప్పినట్లు ఆచరించకపోతే వారు ఎప్పటికీ భగవానునికి ఇష్టులు కాలేరు. ఆయనకు ఇష్టులు కాలేనివారు ఏమి చేసినా దండగే, ఎలా జీవించినా వ్యర్ధమే. అందుచేత భగవానుడు చెప్పిన విధంగా నడుచుకోండి ఆయనకు ఇష్టులు కండి! జీవితాన్ని ధన్యం చేసుకోండి!.

ముఖ్యంగా భూతదయ కలిగి వుండాలి. అంటే జీవహింస చేయకూడదు అంటే 'మాంస భక్షణ' మానాలి. అంతేకాదు ఆయనకు ఇష్టమైన 'ఆత్మ జ్ఞానం' సంపాదించుకోవాలి. దానికి 'ధ్యానమే' మార్గం కాబట్టి ధ్యానం చెయ్యండి. ఈ రెండూ ఆచరించేవారు నెమ్మదిగా భగవానుడు చెప్పిన గుణాలు సంపాదించుకుంటారు. చివరకు 'ఆత్మజ్ఞానాన్ని' కూడా సంపాదించుకుంటారు. భగవానునికి ఇష్టమైన వారి లిస్టులో చేరిపోతారు.

"మన ధ్యాస ఏ సమయంలోనైతే పరమాత్మ వైపునకు (ఆత్మవైపునకు) మళ్ళుతుందో! ఆ ఘడియ, ఆ క్షణం, ఆ ముహూర్తం, ఆ రోజు, ఆవారం, ఆ తిథే పవిత్రమైనదని గుర్తుంచుకోండి!"

"దైవాలు వేరు వేరు అన్న భావం ధ్యానం చేస్తే! ఉప్పు నీటిలో కరిగిపోయి ఏకమైనట్లుగా! అంతా ఒక్కటే అన్న భావం కలుగుతుంది".



# భగవద్గీతను బట్టి గోవిందా! గోవిందా!! అనాలా? గోవిందునితో వుండాలా?

అందరూ భగవంతుడంటే ఇష్టమంటారు. చాలా ఇష్టమంటారు. అలా అంటూ ఆయన ప్రతి రూపాలను అంటే ఫోటోలను, ప్రతిమలను, విగ్రహాలను పూజిస్తారు. పేర్లను, నామాలను ఉచ్ఛరిస్తారు. భజిస్తారు, స్తోత్రిస్తారు. మంత్ర రూపకంగా జపిస్తారు. అలా ఇంత వరకే చేస్తున్నారు. అదే ఆరాధన అని సంతృప్తి పడుతున్నారు. అదే భగవంతుని విషయంలో చేయవలసిందని సంతృప్తి చెందుతున్నారు.

కానీ ఇవన్నీ తాత్కాలిక తృప్తిని మాత్రమే ఇస్తాయి తప్ప, అసలైన ఆనందాన్ని, బ్రహ్మానందాన్ని అంటే ముక్తిని ఇవ్వలేవు. అటువంటి 'బ్రహ్మానందం', 'అనిర్వచనీయమైన ఆనందం' అంటే వర్ణించలేని, మాటలతో చెప్పలేని ఆనందం, భగవంతుని చెంత వున్న వారికే లభిస్తుంది. భగవంతుని చేరిన వారికే లభిస్తుంది. అందుకే **"గోవిందా! గోవిందా!! అనడం కాదు గోవిందునితో వుండాలి"** అంటారు. దేవుడా! అనడం వేరు, దేవునితో వుండడం వేరు. కారణం **దేవుడా! అనే వాడికంటే దేవునితో వుండేవాడే గొప్పవాడు. అదృష్టవంతుడు.**

చిన్న ఉదాహరణ చూద్దాం. భార్యకు భర్త తాత్కాలికంగా దూరమైనా! శాశ్వతంగా దూరమైనా! అంతులేని చింతకు లోనవుతారు. దుఃఖితులవుతారు. ఆ విరహాన్ని భరించలేక భర్త ఫోటో వుంచుకుని అలాగే చూస్తూ వుంటారు. భర్త గురించిన విషయాలు అందరికీ చెప్పుకుంటారు. మాటి మాటికీ భర్తను తలుచుకుంటూ వుంటారు. శాశ్వతంగా దూరమైతే వారి ఫోటోకు దండవేసి పూలు వుంచుతారు.

కాస్త గమనిస్తే ఇలాంటివి ఎన్ని చేసినా అవన్నీ తాత్కాలిక చర్యలే అవుతాయి కానీ భర్త చెంత వున్నంత తృప్తి; భర్తతో వున్నంత ఆనందం కలుగదు కదా? ఇలాంటి పరిస్థితే భర్తకు భార్య విషయంలో కూడా ఏర్పడుతుంది.

అలాగే మన దగ్గర లేని భగవంతుని రూపాన్ని పూజించినా, నామాన్ని ఉచ్ఛరించినా, మంత్రాన్ని జపించినా, భగవంతునితో వున్నంత ఆనందం, ఆయన చెంత వున్నంత ఆనందం వుండదు కదా? కానీ సత్యమైన భగవంతునితో వుంటే! ఆయన చెంతే కనుక వుంటే! ఆ ఆనందం వర్ణించలేం కదా? అందుచేత ఆయన విగ్రహంతో కాదు, ఆయన బొమ్మతో కాదు ఆయనతోనే వుండాలి. నామాన్ని చెప్పడం కాదు ఆయన చెంత వుండాలి. మరి ఇది సాధ్యమా? అంటే సాధ్యమే!

ఆ మార్గమే "శ్వాస మీద ధ్యాస ధ్యానం". ధ్యానం ద్వారా భగవంతుని చేరవచ్చు. ఆయనతో వుండవచ్చు. ఆయన చెంత వుండవచ్చు.

భగవంతునితో వుండాలంటే చేతులతో, చేసే పూజాదికాల వల్ల సాధ్యం కాదు. నోటితో చెప్పే ఆయన స్తోత్రాలు, భజనల వల్ల సాధ్యం కాదు. మనసుతో చేసే నామస్మరణ, మంత్రజపాల వల్ల సాధ్యం కాదు. కారణం ఇలాంటివి ఎన్ని చేసినా ఆయనతో వున్నట్టు కాదు. భగవంతుడు వీటన్నిటికీ అతీతమైనవాడు. వీటితో భగవంతుని చెంతకు చేరడం అసాధ్యం. వీటితో తాత్కాలికంగా ఆయనను గుర్తు చేసుకున్నట్టు అవుతుంది తప్ప, అంతకన్నా వేరే ఏమీ కాదు.

ఆయన చెంతకు చేరాలంటే! ఆయనను పొందాలంటే! ఆయనతో వుండాలంటే! మనసు లేని స్థితిలో చేసే సాధన అంటే 'ధ్యానం' వల్లనే సాధ్యం. కారణం భగవంతుడు 'ఆత్మ' రూపుడు. మానవ ఇంద్రియాలకు గోచరము కాని వాడు, లభించని వాడు. అందుచేత మానవులకు వున్న ఏ ఇంద్రియంతో ప్రయత్నించినా, భగవానుడు లభించడు. మానవ ఇంద్రియాలకు ఆ శక్తి లేదు. ఇంద్రియాతీత స్థితిలోనే భగవంతుడు లభిస్తాడు. ఆ స్థితి 'ధ్యానం' ద్వారా మాత్రమే ఎవరైనా సాధించగలరు. అలా సాధించిన 'యోగులు' ఎంతో మంది వున్నారు. అలా సాధించి వారి జన్మను ధన్యం చేసుకున్నారు.

ధ్యానం చేసే యోగులు భగవంతునితో ఎలా వుండగలిగారో చూద్దాం. మానవునకు రెండు రకాల ఇంద్రియాలు వున్నాయి. (1)బాహ్యేంద్రియాలు, (2) అంతరేంద్రియం. బాహ్యేంద్రియాలు అంటే అయిదు జ్ఞానేంద్రియాలు. అయిదు కర్మేంద్రియాలు. అంతరేంద్రియమంటే మనస్సు. మనం ఈ రెండిటికీ అతీతమైన స్థితికి చేరుకోవాలి. అంటే మనం యీ రెండింటినీ దాటాలి అంటే రెండింటినీ ఉపయోగించకూడదు.

మనం పూజలు, భజనలు, నోములు, వ్రతాలు, స్తోత్రాలు చేస్తూంటే బాహ్య ఇంద్రియాలను ఉపయోగిస్తున్నట్టు. అందుచేత ఇంద్రియాలను కట్టేయాలి. అంటే చేతులు కట్టేయాలి, కాళ్ళు కట్టేయాలి. కళ్ళు మూసుకోవాలి. నోరుమూసుకోవాలి. ఇది ధ్యానంలో మొదటి స్థితి.

అలా కూర్చున్న వెంటనే ఎవరికైనా లోపల అంటే అంతరంలో ఆలోచనలు వస్తూ వుంటాయి. అంటే మనస్సు పని చేస్తూ వుంటుంది. అంటే బాహ్య ఇంద్రియాలు పని చెయ్యడం లేదు కానీ అంతరేంద్రియమైన మనస్సు పనిచేస్తూనే వుంటుంది. కానీ మనస్సు కూడా పనిచెయ్యకూడదు. మనస్సును దాటాలి. అంటే ఆలోచనలు ఆపేయాలి.

ఇది సాధించడం కోసం చాలా మంది మనస్సులో ఒక నామాన్ని స్మరిస్తారు. కొంతమంది ఒక మంత్రాన్ని జపిస్తారు. ఇంకా కొంతమంది ఏదో ఒక రూపం మీదో, వస్తువు మీదో, శరీరంలోని ఏదో ఒక భాగం మీదో మనస్సును కేంద్రీకరిస్తారు. అలా చేసినపుడు ఆలోచనలు లేనట్టుగా కనిపించవచ్చు కానీ మనస్సు వుంటుంది. అలా ఎంతసేపు కూర్చున్నా మనస్సు వుంటుంది. అంటే అంతరేంద్రియమైన మనస్సు పనిచేస్తూనే వుంటుంది అంటే మనస్సును ఉపయోగిస్తున్నాం. కానీ ఇంద్రియాలకు అతీతమైన స్థితికి చేరలేదు. అందుచేత బాహ్య యింద్రియాలే కాదు అంతరేంద్రియమైన మనస్సును కూడా స్వాధీనం చేసుకోవాలి. పని చెయ్యకుండా చెయ్యాలి. అంటే మనస్సులో ఏమీ ఉండకూడదు. మనస్సుతో ఏమీ చెయ్యకూడదు. అప్పుడే భగవానుడు చెప్పినట్టు ఇంద్రియాలను స్వాధీనం చేసుకున్న వారమవుతాం.

**శ్లో॥ యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే**
**సర్వత్రగమచిన్త్యం చ కూటస్థమచలం ధ్రువమ్. (భ.గీ.12-3)**

**శ్లో॥ సంనియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః**
**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః (భ.గీ.12-4)**

తా:- ఎవరు ఇంద్రియములన్నిటిని బాగుగ నిగ్రహించి (స్వాధీనపరచుకొని) ఎల్లెడల సమభావము గలవారై, సమస్త ప్రాణులకును హితమొనర్చుటయం దాసక్తిగలవారై, ఇట్టిదని నిర్దేశింపశక్యము కానిది, ఇంద్రియములకు గోచరము కానిది, చింతింపనలవికానిది, నిర్వికారమైనది, చలించనిది, నిత్యమైనది, అంతటను వ్యాపించియున్నది అగు అక్షర పరబ్రహ్మమును ధ్యానించుచున్నారో, వారు నన్ను పొందుచున్నారు.

కానీ ఈ స్థితి, అంటే ఆలోచనలు లేని స్థితి "ఎవరికైనా తేలికగా, సునాయాసంగా, తొందరగా రావాలంటే "శ్వాసమీద ధ్యాస" వుంచాలి. అలా వుంచితే ఆ స్థితి దానంతట అదే వస్తుంది. అలా వుంచి ధ్యానం చేసిన వారు ఎంతోమంది ఈ విషయం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు.

అలా 'శ్వాస మీద ధ్యాస' ద్వారా ఆలోచనలు లేని, అంటే మనస్సు లేని అంటే ఇంద్రియాలకు అతీతమైన స్థితికి చేరుకున్నప్పుడు ఇక అక్కడ వుండేది "ఆత్మ" ఒక్కటే. కాబట్టి మనం 'ఆత్మ'తో వుంటాం. 'ఆత్మ స్థితి'లో వుంటాం. 'ఆత్మ' అంటే 'భగవంతుడేగా!' అంటే 'భగవంతుని'తో వుంటాం. 'గోవిందుని'తో వుంటాం.

ఇదే మానవుడు సాధించవలసిన, చేరుకోవలసిన, పొందవలసిన అద్భుతమైన స్థితి. ఈ స్థితిలో ఎవరికైనా అంతులేని, అనిర్వచనీయమైన అంటే వర్ణించలేని ఆనందానుభూతి కలుగుతుంది. ఎన్ని జన్మలెత్తినా, వారి జీవితంలో ఎన్ని సాధించినా, ఎన్ని వున్నా, ఎన్ని పొందినా, పొందలేనంత ఆనందాన్ని, బ్రహ్మానందాన్ని పొందుతారు. ఈ స్థితినే "సమాధి స్థితి" అంటారు.

దీనితో వారి జన్మ ధన్యమైనట్టే. కారణం 'ఆత్మ'ను పొందిన వారు అంటే 'భగవంతుని' పొందిన వారు 'భగవంతుని' లోకానికి చేరుకుంటారు. 'సత్యలోకానికి' చేరుకుంటారు. మరల తిరిగి రారు. ఇదే విషయం భగవద్గీతలో

ఈ క్రింది శ్లోకం ద్వారా తెలియచెయ్యడం జరిగింది.

**శ్లో॥ ఆ బ్రహ్మ భువనాల్లోకా పునరావర్తినోర్జున**
**మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే (భ.గీ.8-16)**

తా:- ఓ అర్జునా! ఆ బ్రహ్మ లోకాల్లాంటి లోకాలకు చేరుకున్నా మరల తిరిగి జన్మ తీసుకోవలసిందే! (భూలోకానికి వస్తావు). కానీ నేను వుండేటటువంటి లోకానికి (సత్యలోకానికి) చేరుకుంటే అంటే నన్నే చేరుకుంటే నువ్వు మరల తిరిగి రావు.

ఇదే విషయాన్ని బ్రహ్మర్షి పత్రి గారు కూడా చెప్పారు. "పుణ్యం చేస్తే పుణ్య లోకాలకు చేరుకుంటారు. తిరిగి వస్తారు". అలాగే "తపస్సు చేస్తే తపోలోకాలకు చేరుకుంటారు. తిరిగి వస్తారు". కానీ "ధ్యానం చేసి సత్యలోకానికి చేరుకుంటే మరల తిరిగి రారు".

అందుచేత "శ్వాస మీద ధ్యాస" వుంచండి. ధ్యానం చెయ్యండి. 'గోవిందుని' చెంతకు చేరండి. 'గోవిందుని'తో వుండండి. 'గో' అంటే ఇంద్రియాలు, 'గోవిందుడు' అంటే ఇంద్రియాలకు అధిపతి అయిన 'ఆత్మ'. అంటే 'ఆత్మ'తో వుండండి. జీవితాన్ని ధన్యం చేసుకోండి. దీనినే మోక్షం అని అంటారు. అందుచేత **గోవిందా! గోవిందా!! అనడం కాదు. గోవిందునితో వుండాలని తెలుసుకోండి.**

**"కాకికి అమృతం లభించినా దానికి**
**మురికితోనే తృప్తి కలుగుతుంది.**
**అలాగే మూర్ఖుడికి శ్రేయో మార్గం (భగవంతుని మార్గం)**
**లభించినా ప్రేమో మార్గమే (ప్రాపంచిక మార్గం) తృప్తినిస్తుంది.**
**అదే అనుసరిస్తాడు".**



# భగవంతుని చేరాలంటే?

భగవంతుని చేరడానికి చాలా మంది భగవంతుని నామాన్ని చెపుతూ వుంటారు. భజిస్తూ వుంటారు. స్మరిస్తూ వుంటారు. వారికి భగవంతుని పేరు మాత్రమే తెలుసు. అంతే కానీ ఆయన ఎలా వుంటాడో? ఎక్కడ వుంటాడో? ఎలా చేరుకోవాలో? ఏ మార్గం ద్వారా చేరుకోవాలో తెలియదు. తెలియక ఎంతసేపూ తపనతో, ఆర్తితో ఆ నామాన్నే అనేక సార్లు పలుకుతూ వుంటారు. జపిస్తూ వుంటారు. కానీ అలా జీవితమంతా చేసినా చేరలేరు.

కారణం వారు భగవంతుని నామం మాత్రమే తెలుసుకున్నారు. అంతేకానీ ఆ భగవంతుడు ఎలా వుంటాడో వారికి తెలియదు. ఇది తెలియక పోవడం వల్ల ఎంత సేపూ తెలిసిన నామాన్నే పలుకుతూ జపిస్తూ వుంటారు. కానీ చేరలేరు. కారణం ఈ చిన్న ఉదాహరణ చూద్దాం. ఒకడు ఢిల్లీలో తనకు ఫోన్ ద్వారా పరిచయమైన స్నేహితుడ్ని చేరడానికి ఢిల్లీ వెళ్ళాడు. ఫోను నెంబరు లేదు. అతనికి స్నేహితుని పేరు మాత్రమే తెలుసు. అతను ఎలా వుంటాడో? ఎక్కడ వుంటాడో? అతన్ని ఎలా చేరుకోవాలో? తెలియదు. అందుచేత ఎంతసేపూ! ఢిల్లీలో అటూ ఇటూ తిరుగుతూ! అతని పేరు పలుకుతూ వుంటాడు. గట్టిగా అరుస్తూ వుంటాడు. తలుచుకుంటాడు. కానీ అలా చేస్తే చేరగలడా? ఆలోచించండి ఎన్నాళ్ళు అలా చేసినా చేరలేడు కదా?

అలాగే భగవంతుని విషయంలో కూడా! అందుచేత భగవంతుని చేరాలంటే ఆయన ఎలా వుంటాడో తెలుసుకోవాలి. ఎక్కడ వుంటాడో తెలుసుకోవాలి. ఎలా చేరుకోవాలో తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే

చేరుకోగలరు. అందుచేత భగవంతుని నామాన్ని గట్టిగా పలకడం కాదు. స్మరించడం కాదు. అనడం కాదు. భగవంతుని గురించి తెలుసుకోవడం ముఖ్యం. మరి భగవంతుడు ఎలా వుంటాడు? అంటే ఆయన అనంత శక్తి స్వరూపుడు. ఆ శక్తినే ఆత్మ అంటారు. అంటే 'ఆత్మే' భగవంతుడు.

ఎక్కడ వుంటాడు? ఆయన సర్వ వ్యాపి అంటే ఆయన అంతటా వుంటాడు. అంతేకాదు ఆయన సర్వాంతర్యామి. అంటే సర్వులలో అంటే సర్వమానవుల్లో, సర్వ జీవుల్లో, జంతువుల్లో అంతర్యామిగా వ్యాపించి వుంటాడు. అంటే అందరిలో వున్న భగవంతుడు మనలో కూడా వున్నట్టే కదా?

ఆయన్ను ఎలా చేరుకోవాలి? అంతరంలో వున్న ఆయన్ను చేరుకోవాంటే అంతర్ముఖులు అవ్వాలి. అంటే ఎవరికి వారు తమ లోపలికి వెళ్ళాలి. అలా లోపలికి వెళ్ళాలంటే "శ్వాసమీద ధ్యాస వుంచి ధ్యానం చెయ్యాలి". ధ్యానం చేస్తే మెల్లిగా శరీరాన్ని దాటి, మనస్సును దాటి ఆత్మను అంటే భగవంతుణ్ణి చేరుకోవచ్చు.

అలా ధ్యానం ద్వారా ఎంతోమంది భగవంతుణ్ణి చేరుకున్నారు. ధన్యులయ్యారు. అందుచేత భగవంతుణ్ణి చేరాలంటే నామాలను ఉచ్ఛరించడం, మంత్రాలను జపించడం కాదు. ధ్యానం చెయ్యాలి.

**"ఎంతో శ్రమతో ప్రయాణించినవాడు గమ్యం చేరిన**
**వెంటనే ఎంత ఆనందం పొందుతాడో!**
**అలాగే ఎన్నో కష్టాలు అనుభవించిన వాడు భగవంతుని చేరగానే**
**అంత బ్రహ్మానందం పొందుతాడు".**



# భగవద్గీతలో కష్టాలు, సమస్యల గురించి

సాధారణంగా ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్నో కష్టాలు వుంటాయి, సమస్యలు వుంటాయి. ఈ సమస్యలు, కష్టాలు అన్నవి ఎవరికైనా చాలా భాధాకరం. భరించలేనివి కూడా! అందుచేత వాటి నుంచి బయటపడటానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తుంటారు.

సహజంగా ప్రపంచవ్యాప్తంగా ఎవరైనా చేసే ప్రయత్నమేమిటంటే వారు ఒక దేవుని పోటో దగ్గరో, పూజా మందిరం వద్దో, గుడిలోనో లేక చర్చిలోనో లేక మసీదులోనో కూర్చుని తమ సమస్య, కష్టం తోలగించమని దేవుని పూజిస్తూ ప్రార్ధించేవారు కొందరైతే, కొందరు మామూలుగా ప్రార్ధిస్తారు. కొందరు నమాజు ద్వారా ప్రార్ధిస్తారు. కొందరు భజన చేసి ప్రార్ధిస్తారు. ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒక దేవుని ప్రార్ధిస్తూ నాకు ఈ కష్టం వచ్చింది! నేను ఏమీ చేయలేకపోతున్నాను! నన్ను నువ్వే ఆదుకోవాలి! కాపాడాలి! ఇక నాకు వేరే దారి లేదు! అంటూ దీనంగా, హీనంగా ప్రార్ధిస్తున్నారు. ఏమీ చేయలేనివారిలా అర్ధిస్తున్నారు. ఆదుకోమని వేడుకుంటున్నారు. అలా ఏ చిన్న కష్టం వచ్చినా వెంటనే అలా కూలబడిపోయి అంటే చతికిలబడి ఏమీ చేయలేనివారిలా, చేతకానివారిలా ఉన్నారు, తమకు ఏమీ సాధ్యం కానట్టు ప్రవర్తిస్తున్నారు. ప్రస్తుత ప్రపంచం తీరు ఇలా వుంది.

కాని మానవులు సర్వ శక్తిమంతులు.. మానవులు ప్రయత్నిస్తే సాధ్యంకానిది ఏదీ లేదని తెలుసుకోలేక పోతున్నారు. తమ కష్టాలకు తామే కారణం. అంతేకాదు తమ కష్టాలు తమ ప్రయత్నం వల్ల మాత్రమే అధిగమించగలం. తమ సమస్యలను తాము మాత్రమే పరిష్కరించుకోగలమని అర్ధం చేసుకోలేక పోతున్నారు. కాని మానవులు ఈ విషయం ఆలోచించాలి.

బ్రహ్మర్షి పత్రిగారు సమస్యల పరిష్కారానికి మానవులు ఆచరించవలసిన రెండు విషయాలు భోధించారు.

1) ఏ కష్టాన్నైనా, ఏ సమస్యనైనా తమ స్వప్రయత్నం వల్ల, తమ స్వయంకృషి వల్ల మాత్రమే అధిగమించగలరు, పరిష్కరించుకోగలరని! అంటే "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలని" చెపుతున్నారు.

ఇదే విషయం శ్రీ కృష్ణ భగవానుడు "ఉద్ధరేదాత్మనాత్మానాం" అని భోధించారని, బుద్ధ భగవానుడు "అప్పోదీపోభవ" అని భోధించారని చెపుతున్నారు.

2) అలాగే ఏ సమస్య నుంచి అయినా బయటపడాలంటే, బయట పడటానికి చేసే కృషి కంటే, ముందు సమస్యకు కారణం తెలుసుకోవాలని చెపుతున్నారు.

అలా చెపుతూ సృష్టి సిద్దాంతాలలో ఒక ముఖ్య సిద్ధాంతమైన **"కార్యాకారణ సిద్ధాంతం!"** గురించి ప్రముఖంగా వివరిస్తున్నారు. అంటే ఈ సృష్టిలో ఏకారణం లేకుండా ఏదీ జరగదు. ఏ సమస్యా ఉత్పన్నం కాదు. అందుచేత సమస్య నుంచి బయటపడాలంటే ముందు సమస్యకు కారణం తెలుసుకోవాలంటున్నారు.

ఎప్పుడయితే సమస్యకు మూల కారణం తెలుసుకుంటామో! వెంటనే సమస్యకు సరైన పరిష్కారం దోరుకుతుంది. అప్పుడు తేలికగా ఆ సమస్య నుంచి బైటపడతాం. తిరిగి అదే సమస్య పునరావృత్తం కాకుండా చేసుకోగలుగుతాం. ఎందుచేతనంటే సమస్యకు మూల కారణం తెలుసుకోనంత వరకు ఆ సమస్య నుండి బైటపడలేం. అంతేకాదు కారణం తెలుసుకోకుండా కృషి చేసినపుడు ఒక్కొక్కసారి సమస్య నుండి బైటపడినట్లు కనిపించినా, మరల అదే సమస్యలో చిక్కుకుంటాం. కారణం సమస్యకు మూలం అలాగే వుంది. కాబట్టి, దాన్ని సరిచెయ్యలేదు కాబట్టి.

గోడమీద మొక్క ఎన్నిసార్లు నరికినా మూలమైన వేరును తొలిగించనంతకాలం ఎలా వస్తూవుంటుందో, మన సమస్య కూడా అలా వస్తూనే వుంటుంది. ఆలోచిస్తే సృష్టిలో 'సమస్య' కనిపిస్తుంది, సమస్యకు 'కారణం' కనిపించదు.మానవులు ఎంతసేపూ కనిపించే బాహ్య సమస్యను చూస్తారు తప్ప, కనిపించని కారణాన్ని తెలుసుకోరు, ఆలోచించరు. అందుచేత ఆ సమస్యల్లో అలాగే వుండిపోతున్నారు. ఏమీ చెయ్యలేక చతికిలబడి దేవుళ్ళను

కాపాడమని ప్రార్ధిస్తున్నారు.

కాని సమస్యకు కారణం తెలుసుకుని ప్రయత్నిస్తే తేలికగా అధిగమించవచ్చు. అందుచేత కారణం తెలుసుకోవాలి! ధైర్యంగా ప్రయత్నం చెయ్యాలి!. ఇదే భగవద్గీత ద్వారా శ్రీ కృష్ణ భగవానుడు అర్జునునకు భోధించింది. అర్జునునకు భోధించిందీ అంటే! అర్జునునకే కాదు, సమస్త మానవాళికి భగవానుడు భోధించినట్టే! అందుచేత ఆ విషయం తెలుసుకుందాం.

భారత యుద్దం ఇంకా ప్రారంభం కాలేదు. కాని అర్జునుని కోరిక మేరకు శ్రీ కృష్ణ భగవానుడు రెండు సేనల మధ్యకు రధాన్ని నడిపించాడు. అపుడు అర్జునుడు శత్రువులను, శత్రుసైన్యాన్ని చూసి భీతి చెంది, దు:ఖితుడై వీరందరినీ నేను చంపడమా? వీరందరినీ నేను ఎదుర్కోగలనా? అని భావించి ఈ యుద్దం నా వల్ల కాదు కృష్ణా! అని భీరువులా (పిరికివాడిలా) పలికాడు. తన ఆయుధాలన్నీ పడవేసి అక్కడే చతికిలబడిపోయాడు.

సరిగ్గా ఆనాడు అర్జునుడు భారత సమరంలో, శత్రువులతో పోరాటం చేయడానికి భయపడి ఎలా చతికిలపడిపోయాడో! అలాగే ప్రస్తుతం మనం కూడా జీవిత సమరంలో సమస్యలతో, పోరాడలేక, కష్టాలను ఎదుర్కోలేక దేవుని పోటో దగ్గరో, పూజా మందిరం దగ్గరో, విగ్రహం దగ్గరో చతికిలపడి పోతున్నాము. ఆనాడు అర్జునుడు సాక్షాత్తూ భగవానుడైన శ్రీ కృష్ణుని దగ్గరే చతికిలపడితే మనం ఆయన బొమ్మ దగ్గర, విగ్రహం దగ్గర చతికిలబడుతున్నాం. ఏమీ చేయలేని వారిలా కూలబడుతున్నాం.

అలోచించండి అలా కూలబడిన అర్జునునకు శ్రీ కృష్ణ భగవానుడు తన శక్తిని ఇచ్చి, ధైర్యాన్ని కలగ చేసాడా? లేక జ్ఞానాన్ని భోధించి ధైర్యస్తుడిని చేసాడా? అంటే భగవానుడు జ్ఞానాన్ని భోధించాడు కాని తన శక్తిని ఇవ్వలేదు. అలాగే నేను నీకు సాయం చేస్తాను, నీ తరపున నేను యుద్దం చేస్తాను, నీతోపాటు నేను కూడా యుద్దంలో పాల్గొంటాను, నా ఆయుధాలు ఇస్తాను, నా శక్తిని ప్రసాదిస్తాను, నేనే నీకు విజయం కలుగ చేస్తాను, నా అనుగ్రహం నీకుందని చెప్పలేదు. ఆయన ఆత్మ జ్ఞానాన్ని భోధించి అర్జునుని శక్తి సామర్ధ్యాలు గుర్తుచేసి అతని ధర్మాన్ని భోధించాడు. అతనిని కార్యోన్ముఖుడిని చేసాడు.

ఆలోచించండి అంతటి బంధువైన, ఇష్టమైన అర్జునునికే సాక్షాత్తు భగవానుడు తాను వున్నప్పుడే! పిరికివాడిలా చతికిలబడితే ఏమీ ఆదుకోలేదే!

మరి మనలాంటి వారిని, అందులోనూ ఆయనను కాకుండా ఆయన బొమ్మను ఆశ్రయిస్తే కాపాడతాడా? రక్షిస్తాడా? ఆదుకుంటాడా? అనుగ్రహిస్తాడా? సమస్యల నుంచి, కష్టాల నుంచి బయటపడేస్తాడా? అంటే కాదనేగా దీని అర్దం! అలాంటప్పుడు మనం కష్టాల నుంచి బయటపడగలమా? అంటే ఎప్పటికీ బయట పడలేముకదా!

అందుచేత భగవానుని భోధ అర్ధం చేసుకుని, మనశక్తి సామర్ధ్యాలు తెలుసుకుని, మన ప్రయత్నం ద్వారా, మనమే మన సమస్యలు పరిష్కరించుకోవాలి! మన కష్టాలు ఎదుర్కోవాలి! అంటే 'మనల్ని మనమే ఉద్దరించుకోవాలి!' అదే భగవానుడు బోధించింది, పత్రిగారు బోధించేది. అంతకు తప్ప వేరే మార్గంలేదు. ఏ దేవుడు ఎవరినీ ఉద్దరించరు, ఆదుకోరు ఇదే **"భగవద్గీతలోని సారం! శ్రీ కృష్ణుని సందేశం!".**

ఆ సందర్భంలో భగవానుడు ఈ క్రింది శ్లోకాలద్వారా అర్జునునకు ఏమి చెప్పారో! చూద్దాం.

**శ్లో॥ క్లైబ్యం మాస్మగమః పార్ద నైతత్త్వయ్యుపపద్యతే**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప. (భ.గీ 2-3)**

తా:- ఓ అర్జునా! అధైర్యము పొందకుము (భయపడకు) ఇది నీకు తగదు. నీచమగు ఈ మనో దుర్బలత్వం (హీనభావము) వీడి యుద్దం చేయుటకు లెమ్ము.

ఈ శ్లోక సందేశం ఎమిటంటే! ఎవరైనా సమస్యలకు, కష్టాలకు భయపడకూడదని, అలా భయపడి చతికిలపడిపోవడం, నా వల్ల కాదనడం చాలా నీచమైన, హీనమైన పని అని చెప్పడమే కాదు... ప్రతీ ఒక్కరు అలాంటి హీన స్దితిని వదలి, కష్టాలను ఎదుర్కొని, సమస్యలపై ధైర్యంగా పోరాడమని భగవానుని సందేశం.

ఆనాడు అర్జునుడు శత్రువులను ఎదుర్కోలేక శ్రీ కృష్ణుని ఎదురుగా చతికిలబడి దీనాలాపాలు చేస్తే ఈనాడు మనం నా వల్ల కాదని, ఏమీ చేయలేని వారిగా ఆయన విగ్రహం దగ్గర చతికిలపడి ప్రార్దనలు, వేడుకోళ్ళు, దీనాలాపనలు చేస్తున్నాం.

కాని సాక్షాత్తూ భగవానుడు అలాంటి పని నీచమైనదని అప్పుడే చెప్పారు. ఆదుకోలేదు కూడా! మరి ఇప్పుడు మాత్రం భగవానుడు మనల్ని

ఆదుకుంటాడా? కాపాడతాడా? ఆలోచించండి! అందుచేత ఎవరి ప్రయత్నం వారే చెయ్యాలి. "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి."

ఆయన ఇంకా ఏమి చెప్పారంటే :-

**శ్లో॥ అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాష సే**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాం: (భ.గీ 2-11)**

తా:- ఓ అర్జునా! నీవు శోకింపదగని వారిని గూర్చి శోకిస్తున్నావు. పైగా తెలివైన వాడిలా మాటలను కూడపలుకుతున్నావు. పండితులు, మరణించిన వారి గురించి గాని, జీవించివున్న వారి గురించి కాని ఎప్పుడూ దు:ఖించరు.

అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుని దగ్గర శోకించినట్టుగానే, మనం ఇపుడు విగ్రహం దగ్గర ఏడుస్తున్నాం. అర్జునుడు ఎవరి గురించి శోకించకూడదో! వారి గురించి శోకిస్తున్నాడు. అలాగే మనం ఏ సమస్యల గురించి ఏడవకూడదో! భాధపడకూడదో! వాటి గురించే భాధపడుతున్నాం, ఏడుస్తున్నాం. అలా శోకిస్తూ కూడా అర్జునుడు పెద్ద పెద్ద విషయాలు తెలిసిన వాడిలా మాట్లాడుతున్నాడు.

మనం కూడా అలా విగ్రహం దగ్గర వేడుకుంటూ, ఏడుస్తూ, అర్థిస్తూ, బయట మటుకు గొప్పగొప్పమాటలు మాట్లాడుతాం. నేను అది సాధించాను ఇది సాధించాను. అంత గొప్పవాడిని, ఇంత గొప్పవాడిని, ఆ మేడ కట్టాను, ఈ భూమి కొన్నాను, ఈ కారు నాది. వాడి కంటే ఎక్కువ సంపాదించాను. వాడు చెయ్యలేని పనులు చేస్తున్నాను. వాడికేమీ తెలియదు. నాకే అన్నీ తెలుసు. వాడెంత? వీడెంత? నేను తలచుకుంటే ఏదైనా చేస్తాను. నేనంటే ఏమనుకున్నావు? అని ఎన్నో ప్రగల్భాలు నిజ జీవితంలో పలుకుతున్నాం. ఎన్ని పలికినా విగ్రహం కనబడగానే చతికిలపడుతున్నాం.

అలాగే పండితులు, అంటే అన్నీ తెలుసున్నవారు, మరణించిన వారి గురించిగాని, జీవించి వున్నవారి గురించిగాని ఎప్పుడూ దుఃఖించరు అని భగవానుని సందేశం. అంటే బయట ఇన్ని గొప్ప మాటలు మాట్లాడే మనం... గొప్పలు చెప్పుకునే మనం... అన్నీ తెలుసని భావించే మనం... జరిగిపోయిన సమస్య గురించికాని, ప్రస్తుతం వున్న సమస్య గురించికాని దుఃఖించకూడదు కదా? మరి విగ్రహం దగ్గర కూలబడి ఎందుకు శోకిస్తున్నాము?

అలా శోకించకూడదనే, ఏడవ కూడదనే భగవానుడు ఈ శ్లోకం ద్వారా మనందరకు ఇచ్చిన సందేశం. కానీ ఆయన చెప్పింది ఒకటి! మనం

చేస్తున్నది ఒక్కటి! అందుచేత సమస్యలను ఎదుర్కోవాలి. భగవానుడు అక్కడ అర్జునుని శత్రువులను ఎలా ఎదుర్కోమన్నాడో! మనం కూడా కష్టాలను ఎదుర్కోవాలి. అలా ఎదుర్కొని యుద్ధం చేస్తే ఏమవుతుందో కూడా శ్రీ కృష్ణులవారు బోధించారు.

**శ్లో॥ హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్**
**తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః (భ.గీ 2-37)**

తా:- అర్జునా! ఒకవేళ ఈ యుద్ధంలో శత్రువులచే నీవు చంపబడితే స్వర్గాన్ని పొందుతావు. అలాకాక నీవే విజయం సాధిస్తే రాజ్యాన్ని పాలిస్తావు. ఏ రకంగా చూసినా లాభమే (యుద్ధము చేయ్యకపోతే స్వర్గమూరాదు, రాజ్యభోగమురాదు కదా!). అందుచేత, లే! శత్రువులతో యుద్ధానికి సిద్ధం కా! అన్నారు.

భగవానుని సందేశమేమిటంటే అర్జునుడు శత్రువులతో యుద్ధం చేసినప్పుడు ఓడితే స్వర్గాన్ని పొందుతాడని, గెలిస్తే రాజ్య సుఖాలు భోగించవచ్చని తెలియజేసారు. అలాగే మనం కూడా మన శత్రువులైన సమస్యలపై (శత్రువులు ఎలా భాధిస్తారో సమస్యలు కూడా మనల్ని శత్రువులు కంటే ఎక్కువ భాధిస్తాయి). యుద్ధం చెయ్యాలి, ధైర్యంగా ఎదుర్కోవాలి. అలా చేసినప్పుడు ఓడిపోతే అంటే సమస్యలు పరిష్కరించుకోలేకపోతే... అలాంటి వారికి తప్పకుండా పరంలో స్వర్గలోక ప్రాప్తి లభిస్తుంది. ఒక వేళ యుద్ధంలో గెలిస్తే అంటే సమస్యలు పరిష్కరించుకోగలిగితే భోగము అంటే సుఖము లభిస్తుంది. కారణం సమస్యలు వున్నవాడు సుఖం అనుభవించలేడు. సమస్యలు లేనివాడు సుఖాలు అనుభవించగలడు. అందుచేత సమస్యలను ఎదుర్కొన్న వారికి ఏమి జరిగినా లాభమే. కాని సమస్యలకు భయపడి విగ్రహం దగ్గర చతికిలపడిన ప్రార్థించే వారికి రెండు రకాలుగా నష్టమని శ్రీ కృష్ణులవారి సందేశం.

అందుచేత చతికిలపడకూడదు. "ఉత్తిష్ట" అంటే లేవాలి, సమస్యలను ఎదుర్కోవాలి, కష్టాలకు వెరవకూడదు. ఇదే భగవానుని సందేశం. ఇంకా ఈ క్రింది శ్లోకం చూద్దాం.

**శ్లో॥ ఉద్ధరేదాత్మ నాత్మానం నాత్మాన మవసాదయేత్**
**ఆత్మైవ హ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మనః (భ.గీ 6-5)**

తా:- తనను తానే ఉద్ధరించుకోవాలి. అంతే కాని హీనమైన పనులు చేసి

ఆత్మను కించపరచకూడదు. అలా కించపరిస్తే ఆ ఆత్మే శత్రువై తనకు అపకారం చేస్తుంది. అలాకాక ఆత్మను ఉన్నతమైనదిగా భావించి కించపరచకపోతే ఆ ఆత్మే మిత్రుడై తనకు ఉపకారం చేస్తుంది.

ఇక్కడ ప్రతి ఒక్కరూ తాను దేహం కాదు 'ఆత్మ' అని తెలుసుకోవాలి. అంతా దేహధారులే కాని దేహంకాదు. అంటే దేహాన్ని ధరించినవారము. దేహాన్ని ధరించాము కాబట్టి జీవుల మయ్యాము. అంటే జీవాత్మ అయ్యాము. అలా ప్రతి ఆత్మా! అంటే ప్రతి జీవుడూ! అంటే ప్రతి ఒక్కరూ! ఎవరిని వారే ఉద్ధరించుకోవాలని భగవానుడు భోధిస్తున్నారు. అంతేకాని ప్రతి సమస్యకూ భయపడి ఏమీ చేయలేనివారిగా, శక్తి లేని వారిగా ఒక విగ్రహం దగ్గర చతికిలబడి ధీనంగా, హీనంగా అర్ధించకూడదు. ప్రవర్తించకూడదు. లేవాలి! ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలి! తనకు తానే పరిష్కరించుకోవాలి! అలా చేస్తే ఆ 'ఆత్మే' బంధువై మనకు ఉపకారం చేస్తుంది. అలా కాకుండా అనంతశక్తి వంతమైన 'ఆత్మ'ను ఒక బొమ్మ దగ్గర చతికిలబడి అవమానిస్తే, కించపరిస్తే, ఆ ఆత్మే మీకు అపకారం చేస్తుంది. ఇదే భగవానుని సందేశం.

లోకంలో గురువులు, శాస్త్రాలు, దైవము వీరంతా దారి చూపిస్తారే కాని, నడువవలసింది మనమే! మన కాళ్ళతో మనమే నడవాలి. మన కళ్ళతో మనమే చూడాలి. మన ఆకలి మనమే పోగొట్టుకోవాలి. ఇవన్నీ ఎవరో వచ్చి చెయ్యరు. అన్నీ మన ప్రయత్నం వల్ల మాత్రమే జరుగుతాయి. అందుకే అంటారు **"God Helps those who helps Themselves"** అంటే **"మానవ ప్రయత్నం వున్నప్పుడే దైవ సహాయం లభిస్తుంది"** అని అర్ధం.

భారతయుద్ధంలో కూడా; యుద్ధం చేసేటప్పుడు అనేక సందర్భాలలో ధర్మాన్ని ఆశ్రయించిన పాండవులకు భగవానుడు సాయం చేసాడు. మనం కూడా కష్టాలు వచ్చాయని ఏ ప్రయత్నం చేయకుండా విగ్రహం దగ్గర చతికిలబడి సోమరులలా ప్రార్ధిస్తే, భగవానుడు మనల్ని పట్టించుకుంటాడా? అందుచేత కష్టపడాలి! కృషి చెయ్యాలి! మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి! మన ప్రయత్నం మనమే చెయ్యాలి! ఇదే బ్రహ్మర్షి పత్రిగారు అందరికీ భోధించేది. మరి ఎటువంటి ప్రయత్నం చెయ్యాలి?ఆ ప్రయత్నమే, కష్టపడి 'ధ్యానం' చెయ్యడం. సమస్యను బట్టి ఎక్కువ కష్టపడాలి. అంటే రోజూ ఎక్కువ గంటలు ధ్యానం చెయ్యాలి. అప్పుడే సమస్యల నుంచి బయటపడతాం.

అలాగే పత్రీజీ చెప్పిన రెండవ విషయం ఏమిటంటే ఎంతసేపూ సమస్య గురించి, సమస్య నుంచి బయటపడటానికి బండగా ప్రయత్నిస్తే సరిపోదు అంటే వూరికే గంటలు, గంటలు ధ్యానం చేస్తే సరిపోదు. అసలు సమస్యకి కారణమేమిటో తెలుసుకోవాలి. అలా కారణం తెలుసుకుని సరిచేసుకుంటే ఆ సమస్య మన జీవితంలో పునరావృత్తం కాదు. ఆ సమస్య నుంచి తేలికగా బయటపడగలుగుతాం. ఇదే 'భగవద్గీత'లోని సందేశం.

భగవానుని గీతా బోధ తరువాత అర్జునుడు యుద్ధానికి సంసిద్ధుడయ్యాడు. యుద్ధం ఆరంభమయ్యింది. కౌరవ పక్షానికి నాయకత్వం వహిస్తున్న భీష్మాచార్యులు యుద్ధంలో విజృంభించాడు. పాండవులు ఆయనను ఎదుర్కోలేకపోయారు. తమ శక్తి యుక్తులన్నీ ఉపయోగించినా వారికి సాధ్యంకాలేదు. చివరకు అపజయం తప్పదేమోనని భయపడ్డారు. వారికి ఏమీ చెయ్యడానికి పాలుపోలేదు. భీష్ముడిని ఎలా ఓడించాలో... ఎలా చంపాలో... వారికి తెలియలేదు.

అలా దిక్కుతోచక దిగులు చెందుతుంటే అప్పుడు శ్రీ కృష్ణుల వారి సలహా మేరకు ధర్మరాజు భీష్మాచార్యుల వారిని ఆయన ఓటిమికి కారణం అడిగాడు. మీరు శిఖండిని ఎదురుగా వుంచుకుంటే, నేను యుద్ధం చెయ్యను. అప్పుడు మాత్రమే మీరు నన్ను పరాజితుడ్ని చేయగలరు. ఇక దేని వల్లా మీకు సాధ్యం కాదని, తన 'ఓటమికి కారణం' భీష్ముల వారు తెలిపారు. మరునాడు అర్జునుడు శిఖండిని ఎదురుగా వుంచుకుని తేలికగా భీష్ముడిని ఓడించడం జరిగింది.

అంటే **సమస్యకు కారణం తెలుసుకుంటే ఎంతటి సమస్యనైనా తేలికగా పరిష్కరించుకోవచ్చని భగవద్గీత ద్వారా మనం తెలుసుకోవచ్చు.** అలాగే ద్రోణుడు కూడా ఆయన కుమారుడు అశ్వద్దామ వున్నంతవరకు ఆయనను ఎవరూ పరాజితుల్ని చెయ్యలేరని శ్రీ కృష్ణులవారే సలహా ఇవ్వగా ధర్మరాజు "అశ్వద్దామ హత: అని బిగ్గరగా చెప్పి! కుంజర:" అని మెల్లిగా అన్నాడు. అంటే అశ్వద్దామ చనిపోయాడని గట్టిగా చెప్పి! ఏనుగు అని మెల్లిగా ధర్మరాజు చెప్పగానే ద్రోణాచార్యుడు యుద్ధం చెయ్యడం ఆపి ఆలోచించేలోపునే ఆయనను హతమార్చడం జరిగింది. ఇలా ఎన్నో సందర్భాలలో సమస్యకు కారణం తెలుసుకున్న వెంటనే సమస్య తేలికగా పరిష్కరించుకోవచ్చని గీత ద్వారా

మనం తెలుసుకోవచ్చు.

అలాగే ప్రస్తుతం మానవుల సమస్యలకు కూడా కారణం వుంటుంది. కారణం లేకుండా సమస్యలు ఉత్పన్నంకావు. ఆరోగ్య సమస్యలైనా, కుటుంబ సమస్యలైనా, వృద్ధాప్య సమస్యలైనా లేక ఇంకా ఏ సమస్య అయినా కారణం వుంటుంది. అందుచేత ముందు ఆ కారణం తెలుసుకోవాలి.

అలాగే పత్రీగారు మానవుల సమస్యకు ముఖ్య కారణం తెలియ జేస్తున్నారు. అది తెలుసుకోమంటున్నారు. దాన్ని సరిచేసుకోమంటున్నారు. అదే 'హింస', 'జీవహింస' దానికి కారణమైన మాంసభక్షణ. అందుచేత మాంసభక్షణ మానమంటున్నారు. కారణం మాంసం తినేవారు ఎంత ధ్యానం చేసినా ఆ సమస్య నుండి బయటపడలేరు. ఎంత కృషి చేసినా ప్రయోజన ముండదు. అందుచేత హింసకు ప్రధాన కారణమైన 'మాంసభక్షణ మానాలి'. 'ధ్యానం చెయ్యాలి'. అప్పుడు ఏ సమస్య అయినా తేలికగా పరిష్కరించుకోగలుగుతారు.

అలాగే రక రకాల సమస్యలు వున్నా... వాటి కారణాలు ఏమయినా! పరిష్కారం మాత్రం ఈ 'రెండే' అని కారణం తెలుసుకున్న తరువాత అర్థమవుతుంది. అందుచేత "హింస మానండి ధ్యానం చెయ్యండి". సమస్యలు వుండవు, కష్టాలు వుండవు. ఇదే పత్రీజీ సందేశం. శ్రీ కృష్ణుని సందేశం కూడా.

**"చుట్టాలు ఎలా వచ్చిపోతుంటారో అలాగే సుఖ-దుఃఖాలు,**
**శీతోష్ణాలు, మానావమానాలు వచ్చిపోతుంటాయి.**
**వాటి గురించి పట్టించుకోకూడదు".**



# భగవద్గీతలో పునర్జన్మల గురించి!

ప్రస్తుతం లోకంలో ఎక్కువ శాతంమంది పునర్జన్మలు వుండవనే అనుకుంటున్నారు. అంటే మరణించిన తరువాత తమకు ఇక జీవితం లేదనే అనుకుంటున్నారు. అందు చేత ఉన్నంత వరకు జీవితాన్ని బాగా అనుభవించాలని, అవకాశం ఉన్నంత వరకు సుఖపడాలని, అందరి కంటే బాగా జీవించాలని, అవకాశం ఉన్న మేర గోప్పగా జీవించాలని తాపత్రయ పడుతున్నారు, ప్రయత్నిస్తున్నారు.

అలా జీవించాలంటే ముఖ్యంగా కావలసింది డబ్బు కాబట్టి, డబ్బు ఎంత ఎక్కువ వుంటే అంత బాగా అనుభవించవచ్చని, డబ్బు సంపాదనకు అందరూ ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు. సంపాదనే లక్ష్యంగా జీవిస్తున్నారు. ఎంత ఎక్కువ సంపాదించామా? అని చూస్తున్నారు. కాని ఎలా సంపాదించామా? అని ఆలోచించడం లేదు. సంపాదన కోసం చేయకూడని పనులు చేస్తున్నారు. పాపాలు చేస్తున్నారు, మోసాలు చేస్తున్నారు, అధర్మ మార్గాలు అనుసరిస్తున్నారు.

అంతేకాదు అనుభవించడమంటే తినడం ఒక్కటే! అనుకుంటూ ఏమి తింటున్నారో కూడా ఆలోచించడంలేదు. అలా తినడం కోసం జీవహింసకు పాల్పడుతున్నారు. జీవుల మాంసాన్ని భక్షిస్తున్నారు, జీవహింసకు కారకులై పాపాన్ని మూట కట్టుకుంటున్నారు. జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటున్నారు. తమ ఆనందం కోసం అల్పులను, బలహీనులను దోచుకుంటున్నారు. స్త్రీలను వేధిస్తున్నారు, ఆడవారిపై అత్యాచారాలు చేస్తున్నారు. ఎవరైనా కొంచం వివేకమున్నవారు, వారిని ఏరా అలా ప్రవర్తిస్తున్నావు? వచ్చే జన్మలో నీవు నరకాన్ని అనుభవిస్తావు! అలాంటి తప్పులు, పాపాలు చెయ్యకు. మాంసభక్షణ చెయ్యకు, అది హింస, ఘోరమైన పాపం, అని చెపితే వారు ఏమంటారంటే,

అసలు చనిపోయిన తరువాత నేను వుంటానో! వుండనో! అసలు నాకు ఇంకా జన్మలున్నాయని నీవు ఎలా చెప్పగలవు? నాకు ఇంకా జీవితం వుందని దేన్ని బట్టి చెపుతున్నావు? నువ్వు చూపించగలవా? రుజువు చెయ్యగలవా? ఎలా చెపుతున్నావు? చూపించు? అని ఎదురు ప్రశ్నలు వేస్తారు. అసలు జన్మలే లేవని వాదిస్తారు కూడా.

వారు ఇంకా ఉన్నంతలో అనుభవించకపోతే ఎందుకీ జీవితం.? అసలు జీవితం అనుభవించడానికేగా? తినకపోతే అది జీవితమా? అసలు ఆ జంతువుల్ని భగవంతుడు మా కోసమే పుట్టించాడు. లేకపోతే అవి ఎందుకు వున్నాయి? అని వాదిస్తూ వుంటారు.

మరి కొంతమంది జన్మలు వున్నాయంటారు కాని వున్నట్టుగా జీవించరు. ఎంతసేపూ చనిపోయే వరకే ఆలోచిస్తారు అంతవరకే జీవితమన్నట్టుగా జీవిస్తారు, ప్రవర్తిస్తారు. తరువాత జీవితం గురించికాని, జన్మలు గురించి కాని ఆలోచించరు. వీరు పునర్జన్మలు వున్నాయని అన్నా; నమ్మినా, ఆచరణ మాత్రం పునర్జన్మల గురించి అర్థం కానట్టుగానే వుంటుంది. ఇలా కొంతమంది పునర్జన్మలు లేవని భావిస్తుంటే! మరికొంతమంది వున్నాయని నమ్ముతున్నా! లేనట్టుగా జీవిస్తున్నారు.

చాలా కొద్ది శాతం మందే ఇంకా పునర్జన్మలు వున్నాయని నమ్ముతూ, పునర్జన్మల గురించి, మరణించిన తరువాత జీవితం గురించి అర్థం చేసుకుని దానికి అనుగుణంగా జీవిస్తున్నారు. జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

కానీ ప్రతి మానవుడు ముందు ఇది నిర్ధారణ చేసుకోవాలి. అసలు పునర్జన్మలు వున్నాయా? లేవా? మరణానంతర జీవితం వుందా? లేదా? మరణించిన తరువాత నేను వుంటానా? వుండనా? ఇది చాలా ముఖ్యం. ఎందుచేతనంటే? పునర్జన్మలు వుంటే జీవించవలసిన విధానం ఒక రకంగా వుంటుంది. పునర్జన్మలు లేకపోతే జీవించవలసిన విధానం ఇంకొక రకంగా వుంటుంది. ఎందుచేతనంటే? పునర్జన్మలే కనుక లేకపోతే ప్రస్తుతం అందరు జీవించే విధానం వారి లెక్కలో కరక్టే.! కాని ఒక వేళ పునర్జన్మలే కనుక వుంటే, వారు జీవించే విధానం తప్పు అని మనం తెలుసుకోవచ్చు. అందుచేత

ప్రతి ఒక్కరూ ముందు ఇది నిర్ధారణ చేసుకోవాలి. అసలు పునర్జన్మలు వున్నాయా? లేవా?

ఎందుచేతనంటే పునర్జన్మలు వున్నప్పుడు, అంటే మరణానంతరం మనకు జీవితం వున్నప్పుడు, మనం ఆలోచించవలసినవి, చేయవలసినవి చాలా వున్నాయి. మరణించిన తరువాత ఏమవుతాం? ఎక్కడకు వెళ్తాం? ఎక్కడ వుంటాం? ఎన్నాళ్ళు వుంటాం? ఏంచేస్తాం? మరలా తిరిగి ఎప్పుడు భూలోకానికి వస్తాం? మళ్ళీ ఎక్కడ పుడతాం? ఎలా పుడతాం? ఏ దేశంలో, ఏ ప్రాంతంలో పుడ్తాం? ఏ మతంలో? ఏ కులంలో పుడతాం? స్త్రీ గానా? పురుషుడుగానా? ధనవంతుడుగానా? పేదవాడిగానా? ఆరోగ్యవంతుడిగానా? రోగిష్టిగానా? అంగవికలుడిగానా? అన్నీ వున్నవాడిగానా? మేధావిగానా? మందబుద్ధిగానా? తరువాత జీవితం ఎలా వుంటుంది? అన్న విషయాలు ఆలోచించాలి. కారణం ఆ జన్మకు ఈ జన్మకు సంబంధం వుంటుంది. కారణం మరుజన్మ వున్నపుడు ఈజన్మలో చేసుకున్న దాన్ని బట్టి మరుజన్మ వుంటుంది. అందుచేత ఈ విషయం బాగా ఆలోచించాలి. ముందు పునర్జన్మల గురించి నిర్ధారణ చేసుకోవాలి.

ఎందుచేతనంటే పునర్జన్మలు వున్నాయని అర్ధం చేసుకున్నప్పుడు ప్రస్తుత జన్మలో చేసిన కర్మలు వచ్చే జన్మలో అనుభవించవలసి వస్తుందని, మరలా అలాంటి జన్మ పొందవలసి వస్తుందని అర్ధం చేసుకున్నవారు ఇన్ని పాపాలు చెయ్యరు, ఎవరినీ మోసగించరు, జీవహింస చెయ్యరు. అత్యాచారాలు, అరాచకాలు, మానభంగాలు చెయ్యరు, హింసచెయ్యరు, కుల, మత, ప్రాంత వైషమ్యాలు, ఘర్షణలు వుండవు. దేశాల మధ్య యుద్ధాలు వుండవు. యుద్ధాలకోసం అపార ధననష్టం వుండదు. ఇలా ప్రజలలో ఎన్నో మార్పులు ప్రపంచంలో చూడగలుగుతాం. మానవులు చేసే పనులన్ని లోకకళ్యాణకరం గానే వుంటాయి. లోకం శాంతిగా వుంటుంది.

ఇదంతా పునర్జన్మలు వున్నాయని అర్ధం చేసుకున్నప్పుడే. అందుచేత పునర్జన్మలు వున్నాయా? లేవా? అన్నది తెలుసుకోవలసిన అవసరం, నిర్ధారించుకోవలసిన అవసరం ఎంతైనావుంది. ఈవిషయం గురించి కొంచెం చర్చిద్దాం.

మానవుల ప్రవర్తన, మాటలేకాదు, నమ్మకంతో వారు చేసే కొన్ని పనులు పునర్జన్మలు వున్నాయని చెపుతాయి. మానవులలో పుట్టుక నుంచే ఈ తారతమ్యాలు ఎందుకు వున్నాయి? అని అంటే వాడు గత జన్మలో చేసుకున్న దాన్ని బట్టి అంటారు. అంటే జన్మలు వున్నట్టేకదా! అలాగే హిందువులు వారి తల్లి తండ్రులు చనిపోయినపుడు వారి పేరుతో చేసే కర్మకాండలు కూడా, పునర్జన్మలు వున్నాయని, మరణానంతరం ఇంకా వారు వుంటారని,నమ్ముతూ చేస్తున్నవే కదా? దీనిని బట్టి మరణానంతర జీవితం వుందని, పునర్జన్మలు వున్నాయని తెలుస్తుంది కదా!

అంతేకాదు అన్ని మతాలవారు దేవుళ్ళు వున్నారని నమ్ముతున్నారు. దేవుళ్ళంతా గొప్పవారనే నమ్ముతున్నారు. దేవుళ్ళు చనిపోయినా; వారి శరీరం ప్రస్తుతం లేకపోయినా, వారు కనబడకపోయినా, వారు ఇంకా వున్నారనే నమ్ముతున్నారు. అంటే మరణానంతరం వారు వున్నట్టేగా? అలాగే శరీరాలు తీసుకున్న మానవులు కూడా చనిపోయిన తరువాత శరీరం లేకపోయినా వారూ వుంటారు కదా? దేవుళ్ళు గొప్పవారు కాబట్టి తిరిగిరారు. కాని మానవులు పాపాలు చేస్తున్నారు కాబట్టి వాటిని అనుభవించడానికి మరోక శరీరం తీసుకుని భూమి మీదకు వస్తారు. అలా మరోక శరీరాన్ని తీసుకోవడాన్నే పునర్జన్మ అంటారు. అంటే పునర్జన్మలు వున్నట్టే కదా?

అంతేకాదు అందరూ శ్రీకృష్ణ భగవానుని దేవుడని, అవతారపురుషుడని నమ్ముతున్నారు. ఆలయాలు కట్టి పూజిస్తున్నారు. మందిరాలు కట్టి, పోటోలు పెట్టి ఆరాధిస్తున్నారు. అనంతశక్తి స్వరూపుడని నమ్ముతున్నారు. ఆయనకు తెలియంది ఏదీలేదని అంటారు. అటువంటి శ్రీకృష్ణ భగవానుడు చెప్పింది అందరికి ప్రామాణికమేగా? మరి శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో మనకు పునర్జన్మలు వున్నాయని చెప్పారా? లేదా? అంటే ఆయన ప్రతి ఒక్కరికీ పునర్జన్మలు వున్నాయని కచ్చితంగా చెప్పారు. భగవద్గీతలో చాలా సందర్భాలలో ఈ విషయం చెప్పడం జరిగింది.

అవగాహన కోసం భగవద్గీతలోని కొన్ని శ్లోకాలు చూద్దాం:-

**శ్లో॥ దేహినోస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా**
**తథా దేహాన్తర ప్రాప్తిర్ధీర స్తత్ర న ముహ్యతి. (భ.గీ 2-13)**

తా:- మానవునకు శరీరమందు బాల్యము, యౌవనము, వార్ధక్యము అను అవస్థలు ఎట్లు అనివార్యముగా కలుగుచున్నవో, అట్లే మరణానంతరము మరియొక శరీరము పొందుట కూడా జరుగుతున్నది. కావున ఈ విషయంలో జ్ఞానియగు వాడు ఎంత మాత్రము మోహమును పొందదు.

అని చాలా స్పష్టంగా, కచ్చితంగా పునర్జన్మలు వున్నాయని శ్రీకృష్ణ భగవానులవారు చెప్పడం జరిగింది. అంతేకాదు మానవుడంటే శరీరం కాదు. ఈ శరీరం ఉండటానికి కారణమైన 'ఆత్మే' మానవుడని చెప్పడం జరిగింది. శరీరం అన్నది మానవుడు అంటే ఆత్మ ధరించిన వస్త్రంలాంటిదని చెప్పడం జరిగింది.

**శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ. (భ.గీ 2-22)**

తా:- మానవుడు చినిగిపోయిన పాత బట్టలను వదలి కొత్త బట్టలు ఎలా ధరిస్తున్నాడో అలాగే జీర్ణమైన పాత శరీరాన్ని (ముదసలి) వదలి కొత్త శరీరాన్ని తీసుకుంటున్నాడు.

'మానవునకు' అంటే 'ఆత్మ'కు చావు లేదని శ్రీకృష్ణ భగవానుడు ఈ క్రింది శ్లోకాల ద్వారా కూడా స్పష్టంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః**
**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః (భ.గీ 2-23)**

తా:- ఆత్మను శస్త్రములు చేధించలేవు, అగ్ని దహింపలేదు. నీరు తడపలేదు వాయువు ఆర్పి వేయనూలేదు.

అంటే మనకు మరణం లేదు. మరణించేది మనం ధరించిన దేహం మాత్రమేనని చెప్పడం జరిగింది. అలా **"దేహం ధరించడాన్ని పుట్టడమని, దేహం వదలడాన్ని మరణమని"** ఆయన చెప్పడం జరిగింది. అందుచేత ఎవరికీ చావులేదు కనుక విచారించవలసిన పనిలేదని ఈ క్రింది శ్లోకం ద్వారా తెలియజేయడం జరిగింది.

**శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ**
**తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి. (భ.గీ 2-27)**

తా:- పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చినవానికి పుట్టుక తప్పదు.

తప్పనిసరియగు ఈ విషయం గురించి నీవు శోకించుట తగదు అని పునర్జన్మ గురించి స్పష్టంగా చెప్పడం జరిగింది. అంతే కాదు మనం ఈ జన్మలో ఏం చెయ్యాలి? ఈ జన్మలో ఏం చేస్తే, మరుజన్మలో పొందే లాభం ఏమిటి? అన్నది కూడా భగవానుడు చెప్పడం జరిగింది.

ఆయన ప్రతి ఒక్కరిని 'ధ్యాన యోగి' అవ్వమని చెప్పారు. అంటే 'ధ్యానం' చెయ్యమని చెప్పారు. అలా ధ్యానం చేసి యోగి అయిన వాడే అందరికంటే గొప్పవాడని ఈ శ్లోకం ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోధిక:**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున. (భ.గీ 6-46)**

తా:- తాపసి (జప, తపాలు చేసేవాడు) కంటే యోగి గొప్పవాడు. జ్ఞాని (పుస్తక జ్ఞానం, పండిత జ్ఞానం వున్నవాడు) కంటే యోగి గొప్పవాడు. కర్మలు చేసేవాని కంటే (నిత్య, నైమిత్తిక కర్మలు అంటే సంధ్యావందనం, సూర్యనమస్కారాలులాంటివి యజ్ఞ, యాగాది కర్మలు) యోగి గొప్పవాడు అందుచేత అర్జునా ధ్యాన యోగివికా!

అని అర్జునుని పేరుతో మనందరికి శ్రీకృష్ణ భగవానుడు సందేశం ఇచ్చారు. అపుడు అర్జునుడు భగవానునితో, "నీవు చెప్పినట్లు ధ్యానం చేస్తాను యోగత్వం సంపాదించటానికి ప్రయత్నిస్తాను. కాని నా సాధన పూర్తి కాక ముందే నేను శరీరం వదల వలసి వస్తే నా పరిస్థితి ఏమిటి?" అని అడిగినపుడు శ్రీకృష్ణులవారు ఈ విధంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీ: సమా:**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోభిజాయతే. (భ.గీ 6-41)**

**శ్లో॥ అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్. (భ.గీ 6-42)**

తా:- అలాంటి 'యోగ భ్రష్టుడు' (యోగ సాధనపూర్తి కాకుండా మధ్యలో శరీరం వదలినవాడు) మరణానంతరం పుణ్యాత్ముల లోకాన్ని పొంది, అక్కడ అనేక సంవత్సరములు నివసించి, తరువాత పరిశుద్ధులైనట్టి శ్రీమంతుల యొక్క గృహమందు పుట్టుచున్నాడు. లేక జ్ఞాన వంతులగు యోగుల యొక్క వంశమందు జన్మించుచున్నాడు. ఇలాంటి జన్మ లోకమున లభించడం

మహాదుర్లభమైనది అని యోగాన్ని అభ్యసించిన వారికి అంటే ధ్యానాన్ని చేసిన వారికి మరు జన్మలో ఎంతటి గొప్ప స్థితి లభిస్తుందో తద్వారా మోక్షాన్నే పొందవచ్చని శ్రీకృష్ణ భగవానుడు చెప్పారు. దీన్ని బట్టి చూసినా పునర్జన్మలు వున్నట్టేగా! అంతేకాదు మానవులకే కాదు, దేవుళ్ళకు కూడా జన్మలు వున్నాయని ఈ క్రింది శ్లోకం ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప. (భ.గీ 4-5)**

తా:- ఓ అర్జునా నీకు, నాకు అనేక జన్మలు గడిచాయి. అవన్ని నాకు తెలుసు కాని నీకు తెలియదు.

అలా అందరికీ జన్మలున్నాయని చెప్పడం జరిగింది. అంతేకాదు! ఏం చేస్తే ఇక జన్మలు లేకుండా చేసుకోవచ్చో అన్నది కూడా ఈ క్రింది శ్లోకాల ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ ఆబ్రహ్మభువనాల్లోకా: పునరావర్తినోర్జున**
**మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే. (భ.గీ 8-16)**

తా:- ఓ అర్జునా బ్రహ్మలోకాల్లాంటి లోకాలకు నువ్వు చేరుకున్నా మరల జన్మ తీసుకోవలసిందే! కానీ నేను వుండేటటువంటి లోకానికి (సత్యలోకానికి) చేరుకుంటే! అంటే నన్ను పొందితే మరల పునర్జన్మ వుండదు.

పై శ్లోకాన్ని బట్టి భగవానుని పొందిన వారికి మరల జన్మ వుండదని చెప్పడం జరిగింది. ఇది ఎప్పుడు, ఎలా సాధ్యమో కూడా చెప్పారు.

**శ్లో॥ బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే**
**వాసుదేవస్సర్వమితి స మహాత్మా సుదుర్లభ: (భ.గీ 7-19)**

తా:- అనేక జన్మల అంతమున మానవుడు జ్ఞానవంతుడై సమస్తము వాసుదేవుడే (భగవంతుడే) అను సద్బుద్ధి కలిగి నన్ను పొందుచున్నాడు. అలాంటి మహాత్ముడు లోకములో చాలా అరుదుగా వుంటాడు.

**శ్లో॥ జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వత:**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోర్జున. (భ.గీ 4-9)**

తా:- అర్జునా! ఎవడీ ప్రకారముగ నా యొక్క దివ్యమైన జన్మమును, కర్మమును గూర్చి యథార్థముగ తెలిసికొనుచున్నాడో అట్టివాడు మరణానంతరము మరల

జన్మను పొందకనే యున్నాడు.

దీనిని బట్టి అలా యోగాభ్యాసం చేసిన వారు అంటే ధ్యానం చేసిన వారు భగవంతునికి సంబంధించిన జ్ఞానం పొంది ఆయనను చేరుకుని మోక్షాన్ని పొందుతారని చెపుతూ అసలు అలాంటి వారు లోకంలో చాలా అరుదుగా వుంటారని కూడా చెప్పడం జరిగింది. అంటే ఇవన్నీ అర్థం చేసుకుని ధ్యానం చేసేవారు చాలా తక్కువగా వుంటారని కూడా చెప్పడం జరిగింది.


పై శ్లోకాల ద్వారా ప్రతి ఒక్కరికీ జన్మలున్నాయని ఇక్కడ చేసే కర్మలనుబట్టి పై లోకాలలో స్థానం పొంది, మరల భూమి మీద జన్మలు తీసుకుంటారని, 'ధ్యానయోగి' అయినవాడు చివరకు భగవంతునినే పొంది జన్మలు లేని మోక్ష స్థితి పొందుతాడని దు:ఖం నుంచి పూర్తిగా బయటపడతాడని శ్రీకృష్ణ భగవానుని గీతాసందేశం ద్వారా మనం తెలుసుకోవచ్చు. అందుచేత భగవానుడు 'పునర్జన్మలు' వున్నాయని చెప్పడమూ జరిగింది. మరణానంతర జీవితం వుందని చెప్పడమూ జరిగింది. మానవుడు 'ధ్యానం' చెయ్యాలని చెప్పడం కూడా జరిగింది.

కాని పునర్జన్మలు లేవని భావిస్తూ ఇష్టం వచ్చినట్లు జీవిస్తూ, దుర్మార్గాలు, మోసాలు, హింస, మాంస భక్షణలు అధర్మ కార్యకలాపాలు చేస్తూ పాపాన్ని పెంచుకుంటే ఆ జన్మే కాదు మరు జన్మ కూడా నరక ప్రాయమవుతుంది. అలా కష్టాలలో, భరించలేని రోగాలతో నాకు ఈ బాధ వద్దు అని రోదిస్తున్న వారిని ఎంతోమందిని చూస్తున్నాం. వారందరికీ ఈ గతి ఎందుకు పట్టింది? పునర్జన్మలు లేవనుకుని జీవించబట్టేగా?

అందుచేత పునర్జన్మలు వున్నాయని తెలుసుకోండి. అంతేకాదు జీవితంలో దుఃఖం నుండి బయటపడాలంటే 'ధ్యానం' చెయ్యాలని, ధ్యానం చెయ్యకపోతే జన్మలు తప్పవని కూడా తెలుసుకోవాలి. అర్థం చేసుకోండి.

**"జన్మ దేనికంటే! ధ్యానంచేసి జన్మ లేకుండా చేసుకోవడానికే!"**

"నేను మరణిస్తాను, మరణిస్తాను, మరణిస్తాను అని ఎందుకు చెప్పుకుంటున్నావు? మరణం తర్వాత కూడా నేను వుంటాను. నేను వుంటాను, నేను వుంటాను అనే సత్యాన్ని ఎందుకు తెలియకుండా వున్నావు?"



# భగవద్గీతలో కర్మలు గురించి!

ప్రస్తుతం కొంతమంది కర్మ సిద్ధాంతం లేదనే వాదనలు వినిపిస్తున్నారు. కర్మలే లేవని కూడా చెపు తున్నారు. దీనివల్ల చాలా మంది గందరగోళానికి లోనవుతున్నారు. అసలు కర్మలు వున్నాయా? లేవా? అన్న సందేహంతో చాలా మంది సతమతమవుతున్నారు.

అందుచేత ఈ కర్మల గురించి, కర్మ సిద్ధాంతం గురించి కొంచెం తెలుసుకుందాం. అసలు కర్మలు వున్నాయా? లేవా? అని అంటే కచ్చితంగా వున్నాయనే చెప్పాలి.

ఎందుకంటే కర్మ సిద్ధాంతం ఉందా? లేదా? అనే ప్రశ్న కంటే ముందు కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి అసలు మనం వున్నామా? లేమా? అంటే కచ్చితంగా ఉన్నామనే తెలుస్తుంది కదా! అంతేకాదు మనం ఎక్కడ వున్నాము? అని ప్రశ్నించుకుంటే మన ఇంటిలోనా? లేక మన వూరిలోనా? జిల్లాలోనా? రాష్ట్రంలోనా? దేశంలోనా? లేక ఈ భూమిలోనా? అంటే వీటన్నిటిలోనే కాకుండా ఈ సృష్టిలో కూడా వున్నామని తెలుస్తుంది. మరి ఈ సృష్టిని ఎవరు సృష్టి చేసారు? అని అంటే ప్రతి ఒక్కరు మనకు తెలియని, మనకు కనిపించని ఒక శక్తి అని చెపుతారు. నాస్తికులైనా, ఆస్తికులైనా ఒక శక్తి వల్లే ఈ సృష్టి ఏర్పడిందని అంగీకరిస్తారు. ఆ శక్తినే వివిధ మతాలవారు వివిధ రకాల పేర్లతో పిలుస్తారు కూడా!

కొంతమంది 'అల్లా' అంటారు, కొంతమంది 'నా తండ్రి' అంటారు, కొంతమంది 'భగవంతుడు' అంటారు, కొంతమంది 'దేవుడు' అంటారు, కొంతమంది 'పరమాత్మ' అని, 'పరబ్రహ్మ' అని, 'పరాశక్తి' అని చెపుతూ

వుంటారు. ఏది ఏమైనా ఆ శక్తి అంటే భగవంతునిచే ఈ సృష్టి సృష్టింపబడింది. అంతేకాదు ఈ సృష్టి కొన్ని నియమాల ప్రకారం అంటే రూల్సు ప్రకారం నడపబడుతుంది. ఆ నియమాలనే, రూల్సునే 'ధర్మాలు' అని పెద్దలు చెపుతూంటారు.

అంటే ఈ సృష్టిలో జీవించే ప్రతి జీవి అంటే మానవునితో సహా ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కటీ ఆ 'సృష్టి ధర్మాల' ప్రకారం జీవించవలసిందే! జీవిస్తున్నారు కూడా! అంటే ఏ మానవుడైనా ఈ 'సృష్టి ధర్మాలకు' బద్దుడై వుండవలసిందే! జీవించవలసిందే! అంటే ఆ ప్రకారం నడుచుకోవలసిందే ! అంటే కర్మలు ఆచరించరించవలసిందే ! లేని పక్షంలో సృష్టియొక్క ధర్మ సూక్ష్మాల ప్రకారం శిక్షలు అనుభవించవలసిందే ! అనుభవిస్తున్నారు కూడా! ఆ శిక్షలే మానవులకు వస్తూన్న కష్టాలు.

అందుకే "ధర్మో రక్షతి రక్షిత:" అని అంటారు. అంటే "ధర్మాన్ని రక్షిస్తేనే నువ్వు రక్షింపబడతావు" అంటే ధర్మం ప్రకారం నీవు జీవిస్తే నీకు కష్టాలు రావు, ధర్మాలు ఉల్లంఘిస్తే, అంటే ధర్మ విరుద్ధమైన కర్మలు చేస్తే, శిక్ష అనుభవించవలసి వస్తుంది, అంటే "ఎలాంటి కర్మలు చేస్తే అలాంటి ఫలితం" సృష్టియొక్క ధర్మ సూక్ష్మాల ప్రకారం అనుభవించవలసివస్తుందని తెలుసుకోవాలి. దీనిని బట్టి ఈ సృష్టిలో "కర్మ సిద్ధాంతం" వుందని కచ్చితంగా అర్థమవుతుంది.

ఏ దేశంలోకాని, రాష్ట్రంలోకాని వున్నవారు ఆదేశం, ఆ రాష్ట్రం యొక్క చట్టాల ప్రకారం అంటే రూల్సు ప్రకారం ఎలా జీవిస్తారో! రూల్సు ఉల్లంఘిస్తే ఎలా శిక్షలు పడతాయో! అలాగే ఈ సృష్టిలో వున్న వారికి కూడా, సృష్టి ధర్మాల ప్రకారం ధర్మ విరుద్దంగా కర్మలు చేస్తే శిక్షలు పడతాయి. అంటే చేసిన కర్మలను బట్టి ఫలితాలు ఉంటాయి. అంటే 'కర్మలు' వున్నాయి. 'కర్మ సిద్ధాంతం' వుంది అన్నది స్పష్టంగా అర్థమవుతుంది.

ఇవే కాకుండా 'కర్మ సిద్ధాంతం' గురించి మనం ఎంతో మంది యోగులను, శాస్త్రాలను కూడా ప్రామాణికంగా తీసుకోవచ్చు.



**శాస్త్రాలు ఏమంటున్నాయంటే:-**

**"పూర్వజన్మ కృతం పాపం వ్యాధి రూపేణపీడ్యతే!"**

పూర్వజన్మలో చేసుకున్న పాపం వల్లే వ్యాధి రూపంలో పీడింపబడతారు. అంటే చేసుకున్న కర్మను బట్టి వ్యాధి రూపంలో ఫలితం అనుభవించ వలసి వుంటుందని అర్ధమవుతుంది కదా! అంటే కర్మ సిద్ధాంతం ఉన్నట్టే కదా!

ఇంకా శాస్త్రాలను బట్టి 3 రకాల కర్మలు ఉన్నాయని స్పష్టంగా తెలుస్తుంది. అవి 1) సంచిత కర్మలు. 2) ప్రారబ్ధ కర్మలు. 3) ఆగామి కర్మలు, (వర్తమాన కర్మలు). ఈ కర్మలు ఉన్నంతవరకూ ఎవరికైనా జన్మలు తప్పవని, వాటి ఫలితం అనుభవించక తప్పదని మనం తెలుసుకోవాలి.

అంతేకాని కర్మలు లేవంటూ దోపిడీలు, మానభంగాలు, హత్యలు, మోసాలు, జీవహింస, మాంసభక్షణ లాంటి చేయకూడని కర్మలు చేసుకుంటూపోతే చివరకు జీవితం నరకప్రాయమవుతుందని గ్రహించాలి.

ఆలోచించండి భగవంతుడున్నాడని ఇంచుమించు మానవులంతా అంటే 99 శాతం నమ్ముతున్నారు. అన్ని మతాలవారు కూడా నమ్ముతున్నారు. అంతేకాదు భగవంతునికి అందరూ సమానమని కూడా అంటారు. అటువంటప్పుడు అందరి జీవితాలు ఒకేలా వున్నాయా? అంటే కచ్చితంగా లేవనే చెప్పాలి. మరి ఈ తేడాలన్ని ఎందుకు వున్నాయి? అని అడిగితే కచ్చితంగా వారు చేసుకున్న కర్మల వల్లే అని చెపుతారు.

ఇంకా "చేసుకున్నవాడికి చేసుకున్నంత మహదేవా!" అనే శాస్త్ర వాక్యాన్నికూడా చెపుతారు. ఇంకా గమనించండి ఎన్ని ఆరాధనలు చేసినా కష్టాలు తీరకపోతే వాళ్ళు చేసుకున్న కర్మలు ఎక్కడికి పోతాయి? అని అంటారు. అలాగే ఎవరైనా దగ్గర వాళ్ళు బాగా కష్టాలు పడుతుంటే; దాని 'ప్రారబ్ధం' అలా వుంది. మనమేం చేస్తాం? అంటారు. ఇంకా ఎవరైనా ఎన్ని చెప్పినా వినకపోతే "నీ కర్మ! ఏడు, నీకెవరూ చెప్పలేరు" అంటారు. ఇంకా ఎవరైనా ఎంత కష్టపడినా కలసి రాకపోతే వాడి దురదృష్టం అంటారు. ఎవరికైనా ఊరికే కలసి వస్తుంటే, వాడి అదృష్టం అంటారు. ఇవన్నీ వాళ్ళు గతంలో చేసుకున్న కర్మలని బట్టేగా!

ఎవరైనా సరే మంచి పనులే చేయ్యమంటారు, మంచిగా ప్రవర్తించ మంటారు. పుణ్యకర్మలు చెయ్యమంటారు. అంటే మంచి కర్మలు చేయమనేగా? దేనికి?  మంచి జరగటానికే కదా? మంచి భవిష్యత్తుకోసమేగా? జీవితంలో మంచి ఫలితాల కోసమేగా? అంటే మంచి కర్మలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయనేగా?

అసలు కర్మలే లేకపోతే ! కర్మసిద్ధాంతమే లేకపోతే ! చేసిన కర్మలకు ఫలితాలే లేకపోతే! లోకంలో మానవులంతా పూజలు, ప్రార్ధనలు, నమాజులు ఎందుకు చేస్తున్నట్టు? వారు చేసిన ఆ కర్మకు ఫలితం ఎందుకు కోరుతున్నట్టు? ఫలితం కోరుతున్నారంటే కర్మలకు ఫలితాలు వున్నట్టేగా? కర్మసిద్ధాంతం ఉన్నట్టేగా?

అలాగే పురాణాలలో కూడా మనం చదువుకున్నాం. హింసాత్మకమైన కర్మలు చేసే రాక్షసులు శిక్షింపబడ్డారని, సంహరింపబడ్డారని. మంచి కర్మలు చేసే సాధువులు, ఋషులు రక్షింపబడ్డారని. మోక్షాన్ని కూడా పొందారని. అంటే సృష్టి అంతా కర్మ సిద్ధాంతాన్ని బట్టే నడుస్తుందని స్పష్టంగా అర్ధం చేసుకోవచ్చు. కర్మలు లేవు,  కర్మ సిద్ధాంతం లేదు అని చెప్పడం మూర్ఖులు చెప్పే మాటలే తప్ప మరొకటికాదు. సమాజాన్ని తప్పు దోవ పట్టించి మానవులను రాక్షసులుగా మార్చడానికి ఆ మాటలు ఉపయోగపడతాయి తప్ప అందులో నిజం లేదు.

**ముఖ్యంగా ఈ క్రింది యోగులు ఏమన్నారో చూద్దాం:-**



**బ్రహ్మర్షి వశిష్ఠులు :-**

**ఎవడెలా చేసుకుంటాడో! అతడు దాని ఫలాన్ని అలాగే అనుభవిస్తాడు. పూర్వ జన్మకృత సకర్మే దైవమని, "ప్రారబ్ధమని" చెప్పబడుతోంది. కనుక తాను చేసుకున్న కర్మ కంటే వేరుగా దైవం గానీ, ప్రారబ్ధం గానీ ఏదీ లేదు.**

**గౌతమబుద్ధుడు :-**



**"పాపం చేసేటపుడు ఎవరికైనా సుఖ భ్రాంతి వుంటుంది, కాని ఆ పాప ఫలితం అనుభవించేటపుడు మాత్రం జీవితం కడు దుర్భరంగా వుంటుంది". అని కర్మ సిద్ధాంతం గురించి చెప్పారు.**



**జీసస్ క్రైస్ట్ :-**

"ఏది విత్తుతావో ఆ పంటే కోసుకుంటావు". అంటే ఎలాంటి కర్మలు చేస్తావో అలాంటి ఫలితం అనుభవిస్తావు అని చెప్పడం జరిగింది.



**శ్రీ రామకృష్ణ పరమహంస :-**

"మనం ఏ కర్మ చేస్తే ఆ ఫలితం అనుభవించితీరాలి" అని అంటూ కారం తింటే నోరు మండుతుంది. పంచదార తింటే నోరు మధురంగా వుంటుంది కదా! అని చెప్పారు.



**గురు సాహెబ్ :-**

"కర్మ సిద్ధాంతం ప్రకృతి యొక్క మారని శాశ్వత చట్టం. ఇది వ్యక్తి గత మరియు ఆధ్యాత్మిక జీవితానికి పునాది".

ఆయన ఇంకా "రాత్రింబవళ్ళు మానవుడు చేసేదంతా వాని నోసట వ్రాయబడుతుంది". అని కూడా కర్మసిద్ధాంతం గురించి చెప్పారు.



**భాయి గురుదాస్‌జీ :-**

"మంచి చేస్తే చెడు లభించదు, చెడు చేస్తే మంచి లభించదు". అని కర్మ సిద్ధాంతం గురించి చెప్పడం జరిగింది.




కబీర్ :-

"ఎవరు చేసిన కర్మలు వారే అనుభవిస్తారు". అని అంటూ "ఏ చేయి కర్మలనాచరిస్తుందో, ఆ చేయే ఫలితాలననుభవిస్తుంది." అని కర్మలు ఉన్నాయనే చెప్పారు.



గురు రవిదాస్ :-

"తాను చేసిన కర్మలకు ఎపుడో ఒకప్పుడు ఫలితాలు అనుభవించక తప్పదనే విషయాన్ని మానవుడు ఎప్పుడూ మరువకూడదు"



## బ్రహ్మర్షి పత్రీగారు :-

కర్మ సిద్ధాంతం గురించి అనేక సందర్భాలలో అనేక రకాలుగా చెప్పడం జరిగింది.

**1) సృష్టి సిద్ధాంతాలలో :-** 1) ఆత్మ సిద్ధాంతం 2) పునర్జన్మ సిద్ధాంతం 3) కర్మ సిద్ధాంతం ఇంకా అనేక సిద్ధాంతాలు వున్నాయని చెప్తూ ముఖ్యంగా 'కర్మ సిద్ధాంతం' గురించి "ఆధ్యాత్మికశాస్త్రం" అనే పుస్తకంలో చెప్పడం జరిగింది. ఆయన ఏమి చెప్పారంటే **"మనం చేసే ఏ రకమైన కర్మ అయినా, సమయం సందర్భానుసారంగా ఆ కర్మకు తగిన ప్రతిఫలానికి కచ్చితంగా దారితీస్తుంది".**

అలాగే ఆయన **"విత్తుబట్టి చెట్టు అంటా... కర్మ బట్టి ఫలితమంటా..."** అని పాట రూపంలో కర్మలున్నాయనే సందేశం ఇవ్వడం జరిగింది.

అలాగే **"పెద్ద పెద్ద పాపాలు చేస్తే, పెద్ద పెద్ద రోగాలు, చిన్న చిన్న పాపాలు చేస్తే, చిన్న చిన్న రోగాలు, రక రకాల పాపాలు చేస్తే, రక రకాల రోగాలు"** అని కూడా చెప్పడం జరిగింది.

ఆయన **"మాంసాహారం పాపాహారం, అదే అన్ని అనర్థాలకు మూలం అందుచేత మాంసాహారం మానండి, శాకాహారం తీసుకోండి"** అని చాలా గట్టిగా కూడా చెపుతున్నారు.

అంతేకాదు **"నీ నోటిమాటే నీ నుదిటిరాత"** అని చెప్తూ, నీ మాటల్ని బట్టి నీ భవిష్యత్తు వుంటుంది. మాటల్ని అదుపు చేసుకో, మాటమీద ఎరుక కలిగి వుండు అని చెపుతున్నారు.

ఆయన ఇంకా **"మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు ఫలితాలు"** పొందుతారని కూడా చెపుతున్నారు.

ఇలా పత్రీజీ అనేక సందర్భాలలో 'కర్మ సిద్ధాంతం' గురించి, 'కర్మల' గురించి ప్రస్తావించారు. 'కర్మలు' వున్నాయనే చెప్పారు. కాని కొంత మంది 'కర్మ సిద్ధాంతం' లేదని చెపుతున్నారంటే అసలు వారిని ఏమనాలో కూడా అర్థం కాదు.



## శ్రీ కృష్ణ పరమాత్మ:-

శ్రీకృష్ణ భగవానుడు అందరికంటే గొప్పవాడని అంతా పూజిస్తున్నారు, ఆరాధిస్తున్నారు. మరి భగవద్గీత ద్వారా ఆయన చెప్పిన సందేశం అందరికి ప్రామాణికమేగా! మరి ఆయన కర్మలు వున్నాయని చెప్పారా? లేవని చెప్పారా? అంటే కచ్చితంగా ఉన్నాయనే చెప్పారు. అంతేకాదు పాప కర్మలు వల్ల దుఃఖం కలుగుతుందని. అలాంటి దుఃఖం తొలగించుకోవాలంటే ఏం చేయాలో! ఆ కర్మల కష్టాలు అనుభవించకుండా వుండాలంటే, వాటిని ఎలా తొలగించుకోవాలో కూడా చెప్పారు. అంతేకాదు కర్మలు చేసినా అవి అంటకుండా వుండాలంటే అంటే కర్మలు చేసినా కూడా, చెయ్యనట్టు ఎలా అవుతుంది? అది ఏ సందర్భంలో వర్తిస్తుంది? అన్నది కూడా చెప్పడం జరిగింది. ఆ విషయాలను పరిశీలిద్దాం.

ముఖ్యంగా ఈ క్రింది శ్లోకాలను బట్టి కర్మలున్నాయని స్పష్టంగా తెలుస్తుంది:-

**శ్లో॥ కాఙ్క్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతా:**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా. (భ.గీ. 4-12)**

తా:- కర్మలయొక్క ఫలప్రాప్తిని కోరుకునే మానవులు ఈ ప్రపంచంలో దేవతలను ఆరాదిస్తున్నారు. ఎందుకనగా, కర్మఫలసిద్ధి ఈ మనుష్యలోకంలో శీఘ్రముగా కలుగుచున్నది.

**శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**
**మా కర్మఫలహేతుర్భూర్మాతే సఙ్గోస్త్వ కర్మణి. (భ.గీ. 2-47)**

తా:- అర్జునా! నీకు కర్మను చేయుటయందే అధికారము కలదు. కాని కర్మఫలము ఆశించుటయందు నీ కధికారములేదు. కర్మఫలమునకు నీవు కారణభూతుడవుకారాదు. మఱియు కర్మలు మానుటయందు కూడా ఆసక్తి చూపించకు.

**శ్లో॥ యుక్త: కర్మఫలం త్యక్త్వా శాన్తిమాప్నోతి నైష్ఠికీమ్**
**అయుక్త : కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే. (భ.గీ. 5-12)**

తా:- యోగయుక్తుడు (నిష్కామకర్మయోగి) కర్మలయొక్క ఫలమును విడిచిపెట్టి ఆత్మనిష్ఠాసంబంధమైన శాశ్వతమగు శాంతిని బొందుచున్నాడు. యోగయుక్తుడు కానివాడు ఆశచే ప్రేరితుడై కర్మఫలమందాసక్తి గల్గి బద్ధుడగుచున్నాడు.

**శ్లో॥ శ్రేయో హి జ్ఞానమభ్యాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే**
**ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్. (భ.గీ.12-12)**

తా:- (వివేకముతోగూడిన) అభ్యాసముకంటె (శాస్త్రజన్య) జ్ఞానము శ్రేష్ఠమైనది! జ్ఞానముకంటె ధ్యానము శ్రేష్ఠమగుచున్నది. ధ్యానము (నిర్విషయ ముగనుండు మన:స్థితి) కంటె కర్మఫలమును విడుచుట శ్రేష్ఠమైయున్నది. అట్టి కర్మఫలత్యాగముచే శీఘ్రముగ శాంతి లభించుచున్నది

**శ్లో॥ సక్తా: కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత**
**కుర్యాద్విద్వాం స్తథాసక్తశ్చికీర్షుర్లోకసఙ్గ్రహమ్. (భ.గీ. 3-25)**

తా:- ఓ అర్జునా! అజ్ఞానులు కర్మలందు తగుల్కొని ఫలాపేక్షతో ఏ ప్రకారము చేయుచున్నారో, ఆ ప్రకారమే జ్ఞానులు వానియందు తగుల్కొనక ఫలాసక్తి రహితులై లోకకల్యాణము నిమిత్తము కార్యముల నాచరించుచున్నారు.

పై శ్లోకాలలో శ్రీకృష్ణుల వారు కర్మలున్నాయిని వాటికి ఫలితముం టుందని చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. అంతేకాదు కర్మ ఫలితం ఆశించ వద్దని, కర్మ ఫలితం త్యాగం చెయ్యమని చెప్పారు. అంతేకాదు అజ్ఞానులు కర్మలలో ఎలా చిక్కుకుంటున్నారో, జ్ఞానులు కర్మలలో తగుల్కొనక ఎలా శాంతి పొందుతున్నారో, కూడా చెప్పడం జరిగింది. అలాగే అన్నిటికంటే కర్మఫలత్యాగం గొప్పదని కూడా చెప్పడం జరిగింది.

అలా ఆయన కర్మలలో చిక్కుకున్నవారికి, ఆ కర్మలను ఎలా రహితం చేసుకోవాలో, ఆ కర్మల నుండి ఎలా బయటపడాలో కూడా చెప్పడం జరిగింది.

**శ్లో॥ యథైధాంసి సమిద్ధోగ్నిర్భస్మసాత్కురుతేర్జున**
**జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా. (భ.గీ. 4-37)**

తా:- అర్జునా! బాగుగ ప్రజ్వలింపజేయబడిన అగ్ని కట్టెలనేప్రకారము బూడిదగాచేయునో ఆ ప్రకారమే జ్ఞానమను అగ్ని సమస్త కర్మలను భస్మమొనర్చుచున్నది.

**శ్లో॥ యజ్ఞ శిష్టాశినస్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషై:**
**భుఞ్జతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్. (భ.గీ. 3-13)**

తా:- యజ్ఞంలో మిగిలిన దానిని తినే సజ్జనులు సమస్త పాపాల నుంచి విముక్తులవుతారు. అయితే ఎవరు తమ స్వంత శరీర పోషణ నిమిత్తమే అన్నం వండుకుంటున్నారో వారు పాపాన్ని తింటున్నారు.

**శ్లో॥ యే మే మతమిదం నిత్యమనుతిష్ఠన్తి మానవా:**
**శ్రద్ధావన్తో నసూయన్తో ముచ్యన్తే తేపి కర్మభి: (భ.గీ. 3-31)**

తా:- ఏ మనుజులు శ్రద్ధావంతులై, అసూయలేనివారై, నా అభిప్రాయములను ఎల్లపుడు ఆచరణలో ఉంచుతున్నారో, వారు కర్మబంధమునుండి విడివడుచున్నారు.

**శ్లో॥ అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి. (భ.గీ. 4-36)**

తా:- (ఒకవేళ) పాపాత్ములందఱికంటెను నీవు మిగుల పాపము చేసినవాడవైతివేని, ఆ సమస్త పాపసముద్రమును జ్ఞానమను తెప్పచేతనే లెస్సగ దాటివేయగలవు.

అంతే కాదు ఆ కర్మలు ఎప్పుడు వుండవు? ఆ కర్మ సిద్ధాంతం మానవులకు ఎప్పుడు వర్తించదో! కూడా ఆయన ఈక్రింది శ్లోకాలలో తెలియపరచడమైనది.

**శ్లో॥ బ్రాహ్మణ్యాధాయ కర్మాణి సఙ్గం త్యక్త్వా కరోతి యః**
**లిప్యతే న స పాపేన పద్మ పత్రమివామ్భసా. (భ.గీ. 5-10)**

తా:- ఎవడు తానుజేయుకర్మలను పరమాత్మకర్పించి సంగమును (ఆసక్తిని) విడిచి చేయుచున్నాడో అట్టివాడు తామరాకు నీటిచే అంటబడనట్లు, పాపముచే అంటబడడు.

**శ్లో॥ త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః**
**కర్మణ్యభిప్రవృత్తోపి నైవ కించిత్కరోతి సః. (భ.గీ. 4-20)**

తా:- ఎవడు కర్మపలము నందు ఆసక్తిని విడనాడి నిరంతరము సంతృప్తిగలవాడై, దేనిని ఆశ్రయించకనుండునో, అట్టివాడు కర్మములందు ప్రవర్తించినను ఒకింతైనను చేయనివాడేయగును.

**శ్లో॥ న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా**
**ఇతి మాం యోభిజానాతి కర్మభిర్న స బధ్యతే. (భ.గీ. 4-14)**

తా:- నన్ను కర్మలంటవు. నాకు కర్మఫలమునం దపేక్ష కూడా లేదు. ఈ ప్రకారముగ యెవడు తెలుసుకొనునో అతడు కర్మలచే బంధింపబడడు.

**శ్లో॥ నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహంః**
**శారీరక కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. (భ.గీ. 4-21)**

తా:- ఆశలేనివాడును, ఇంద్రియ, మనంబులను నిగ్రహించినవాడును, ఏవస్తువును పరిగ్రహింపనివాడునగు మనుజుడు శరీరము చేత కర్మము చేసినను పాపము నొందదు.

**శ్లో॥ యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః**
**సమ: సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే. (భ.గీ. 4-22)**

తా:- కోరుకోకుండానే లభించినదానితో సంతుష్టి పోందువాడు, సుఖ దు:ఖాది ద్వంద్వములను దాటినవాడు, ఈర్ష్య లేనివాడు, ప్రాప్తములోనూ, అప్రాప్తంలోను సమబుద్ధిగలవాడు (లేక కార్యము సిద్దించినను, సిద్దింపకున్నను సమభావముతో నుండువాడు) నగు మనుజుడు కర్మ చేసినప్పటికిని బంధింపబడడు.

**శ్లో॥ యోగసన్న్యస్త కర్మాణం జ్ఞాన సంఛిన్న సంశయమ్**
**ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనఞ్జయ. (భ.గీ. 4-41)**

తా:- ఓ అర్జునా! నిష్కామకర్మయోగముచే కర్మఫలములను త్యజించినవాడును, లేక ఈశ్వరార్పణమొనర్చిన వాడును, జ్ఞానముచే సంశయములు నివర్తించినవాడు నగు ఆత్మనిష్ఠుని (బ్రహ్మజ్ఞానిని) కర్మలు బంధింపవు.

**శ్లో॥ యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేద్రియః**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే. (భ.గీ. 5-7)**

తా:- (నిష్కామ) కర్మయోగము నాచరించువాడును, పరిశుద్ధమైన హృదయము గలవాడును, లెస్సగజయింపబడిన మనస్సుగలవాడును, ఇంద్రియములను జయించినవాడును, సమస్త ప్రాణులయందు ఉన్న ఆత్మ, తన ఆత్మ ఒకటే అని తెలిసికొనిన మనుజుడు కర్మలను జేసినను వానిచే

నంటబడదు.

ఇలా చాలా స్పష్టంగా ఏ సందర్భంలో కర్మలు అంటవు... అన్నది తెలియచేయడం జరిగింది. అంతేకాని అసలు 'కర్మలు' లేవు 'కర్మసిద్ధాంతం' లేదు, అని ఎక్కడా చెప్పలేదు. అలా చెప్పడం మూర్ఖత్వంకాక మరేమిటి? వీరు శ్రీ కృష్ణ భగవానుని కంటే గొప్పవారా? పత్రీజీ కంటే గొప్పవారా?

అంతేకాదు శ్రీకృష్ణ భగవానుడు ఇంకా:

**శ్లో॥ కిం కర్మ కిమకర్మేతి కవయోప్యత్ర మోహితాః**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్ఞాత్వా మోక్ష్యసేశుభాత్. (భ.గీ. 4-16)**

తా:- కర్మయెట్టిది, అకర్మయెట్టిది అను ఈ విషయమును పండితులు కూడ సరిగా తెలిసికొనజాలకున్నారు. దేనినెఱిగినచో నీవు సంసారబంధమునుండి విముక్తుడవుకాగలవో అట్టి కర్మరహస్యమును నీకిపుడు తెలుపుచున్నాను.

అంటే కర్మ, అకర్మ విషయాల గురించి పండితులు లాంటి వారు కూడా తెలుసుకోలేకపోతున్నారని శ్రీ కృష్ణ భగవానుడే అన్నారంటే మరి సామాన్యులు, చాల పరిమితి జ్ఞానమున్న అజ్ఞానులు, మూర్ఖులు కర్మల గురించి, 'కర్మ సిద్ధాంతం' గురించి ఏం చెప్పగలరు? అలా చెప్పడానికి ప్రయత్నించినా వారు మూర్ఖులే అవుతారు.

## కర్మలు అనుభవం కోసమా?

అలా కర్మలు లేవని వాదించే వారిని, మానవులలో ఈ తేడాలు ఎందుకు వున్నాయి? అని అడిగితే వారు, కర్మలు లేవు, కర్మ సిద్ధాంతం లేదు. ఈ కష్టాలు, రోగాలు, భాధలు, సమస్యలు జీవితంలో అనుభవం కోసం మాత్రమే అంటారు.

కాని వారికిఅనుభవమంటే ఏమిటి? ఎందుకు అనుభవం కావాలి? అనుభవం వస్తే ఏమవుతుంది? అనుభవాల అవసరం ఏమిటి? అన్నది తెలియదు, అర్థం చేసుకోరు.

ఎందుచేతనంటే చేసిన కర్మల నుంచి పాఠాలు నేర్చుకోవడానికే అనుభవం అవసరం. స్వానుభవం పొందనంత వరకు మనిషి మారడు. మనిషిలో పరివర్తన కలగదు. మంచి మార్గంలోకి రాడు. మంచిపనులు చెయ్యడు, లోకాన్ని పీడిస్తాడు, హింసిస్తాడు, అందరికి నరకాన్ని చూపిస్తాడు.

ధర్మమంటే ఏమిటో తెలుసుకోడు, సత్యాన్ని తెలుసుకోడు, సృష్టి రహస్యాన్ని తెలుసుకోనే ప్రయత్నం చేయ్యడు. తనకు నిర్దేశింపబడిన జీవిత లక్ష్యాన్ని సాధించే ప్రయత్నం చేయ్యడు.

ప్రతి ఒక్కడూ తాను చేసిన కర్మల నుంచి అనుభవాలు నేర్చుకుని మారితేనే జీవిత లక్ష్యాన్ని సాధిస్తాడు! సత్యాన్ని తెలుసుకుంటాడు, సృష్టి రహస్యాన్ని తెలుసుకుంటాడు.

చిన్న ఉదాహరణ చూద్దాం ఈ జన్మలో బాగా ధనవంతుడుగా పుట్టాడనుకుందాం. వాడికి పేదవాడి భాధ ఎలా వుంటుందో అనుభవం లేదు. కాబట్టి తన కన్నా ధనం తక్కువ వున్న వారిని హేళన చేస్తాడు, అవమానిస్తాడు. చులకనగా చూస్తాడు. వారు కష్టంలో వున్నా కొద్దిగా కూడా సాయం చేయడు.

పేదవాడు, తిండికి అలమటించేవాడు, అడుక్కునేవాడి భాధ ఎలా వుంటుందో అతడికి అనుభవం లేదు కాబట్టి అలాంటి వాడు అర్ధించినా, ఆకలితో అలమటిస్తున్నానని ప్రార్ధించినా, వేడుకున్నా లేదు పో! అని చీదరించుకుంటాడు. ఒక్కోసారి అవమానించడం కూడా చేస్తూవుంటాడు.

అలా తనకంటే క్రింది వారిని, పేదవారిని భాధిస్తాడు. అలా ప్రవర్తిస్తూ పేద వారంతా ఎవరో అనుకుంటూ, వారు తన కంటే తక్కువ వారు అనుకుంటూ ప్రవర్తిస్తాడు. ఆ పేదవాడూ నేను ఒకటే,! ఈ సృష్టిలో అంతా సమానమే అన్న అవగాహన లేక ప్రకృతి విరుద్దంగా ప్రవర్తిస్తాడు. అలా సృష్టి విరుద్దంగా ఎన్నో కర్మలు చేస్తాడు, పాపాలు చేస్తాడు, అందరినీ బాధిస్తాడు, లోకంలో అశాంతి సృష్టిస్తాడు.

అలాంటివారు మరు జన్మలో అలాంటి పాప కర్మలు చేసినందుకు, ధర్మ విరుద్దంగా ప్రవర్తించినందుకు, సృష్టి విరుద్దంగా ప్రవర్తించినందుకు అంతా ఒక్కటే అయినా ఆపేద వారి కష్టం, భాధ, తెలుసుకోక ఆకలిభాధ తాళ లేక అడుక్కుంటుంటే, వారు పడే మానసిక క్షోభ ఏమిటో తెలుసుకోనందుకు, అటువంటి అనుభవం ఒకసారి తనకు కూడ స్వయంగా కలగడం కోసం మరుజన్మలో పేదవాడిగా జన్మ తీసుకుంటాడు. అలా జన్మ తీసుకుని పేదవాడి భాధ తెలుసుకుంటే తప్ప మరలా పేదవారి పట్ల మంచిగా ప్రవర్తించడు, మంచిగా జీవించడు.

తాను కూడా అలాంటి పేదవాడి అనుభవం బాగా పొందితే మరు జన్మలో ఎవరైనా పేదవాడు కనిపిస్తే సాయం చేస్తాడు. ఆకలితో ఉన్న వాడికి అన్నం పెడతాడు, ఉపకారం చేస్తాడు.

అలా ప్రవర్తించాలన్నా, అలా మారాలన్నా, పేదవాడి అనుభవం వీడికి కూడా కలగాలి కదా! అందుకే వీరు గత జన్మలో తాను చేసిన కర్మల నుంచి పాఠాలు నేర్చుకోవడానికి, పేదవాడి అనుభవం పొందటానికి పేదవాడిగా కాని, అడుక్కునేవాడిగా కాని జన్మ తీసుకోవలసివస్తుంది. తీసుకుంటాడు కూడా! అలా ప్రస్తుతం మనం చూస్తున్న పేదవారిలో ముష్టివాళ్ళలో, అడుక్కునే వారిలో ఎంతోమంది గత జన్మలలో ధనవంతులు, కోటీశ్వరులు, రాజులుగా జీవించిన వారు కూడా వుంటారు. కానీ అనుభవం కోసం అలా జన్మ తీసుకోవలసి వస్తుంది. ఇలాంటి విషయాలు శ్రీ కృష్ణుడు లాంటి యోగీశ్వరులే తెలుసుకోగలరు.

అంటే ఎలాంటి కర్మలు ఈజన్మలో చేస్తాడో! దాని నుండి పాఠాలు నేర్చుకోవటానికి మరు జన్మలో దానికి తగ్గ అనుభవం పొందటానికి జన్మ తీసుకుంటాడు. అంటే "కర్మలని బట్టే జన్మ" అని తెలుసుకోండి. ఒక రకం కర్మలు చేసేవాడికి ఇంకో రకం అనుభవం వస్తే ప్రయోజనమేముంది. "ఎలాంటి కర్మలు చేస్తాడో, అలాంటి అనుభవమే కావాలి" అప్పుడే వాడిలో మార్పు వస్తుంది.

పేదవాళ్ళను అవమానించిన వానికి పేదవాడి అనుభవమే కావాలి. అంతేకాని కాలులేని అనుభవం వల్ల ప్రయోజనమేమిటి? ఇంకొకరి కాలు నరికిన వాడికి కాలులేని అనుభవం కావాలి. అలాగే అందవికారంగా వున్న వారిని హేళన చేసినందుకు, వారిని అవమానించినందుకు తాను అంద వికారంగా పుడితే తప్ప వారి భాధ అనుభవంలోకి రాదు.

అలా ఒక్కొక్క జన్మలో చేసిన కర్మలను బట్టి మరు జన్మలో పాఠాలు నేర్చుకుని అనుభవాలు పొందుతాడు దాని కొరకు తిరిగి జన్మ తీసుకుంటాడు.

అలా ఒక్కొక్క జన్మలో తాను చేసిన కర్మలను బట్టి అనుభవాల కోసం వాటికి తగ్గ ఫలితం అనుభవిస్తాడు. అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుంటాడు, మారతాడు. మరల అటువంటి తప్పులు, పాపాలు చెయ్యడు. మెల్లిగా లోకానికి

ఉపకారం చేస్తాడు.

ఇలా మానవ జన్మ ప్రారంభమైన తరువాత జన్మ లక్ష్యం సాధించటానికి కనీసం 400 లేక 500 జన్మలు తీసుకుంటారంటారు. అలా తాను చేసిన కర్మల నుంచి అనుభవాలు నేర్చుకుని, మొదట రాక్షసుడిలా ప్రవర్తించే జన్మల నుంచి, మానవుడిగా మారి మానవత్వం ప్రదర్శిస్తాడు. ఇంకా అనుభవం సంపాందించి మెల్లిగా మహాత్ముడిగా మారతాడు. చివరకు పరమాత్ముడు అవుతాడు.

అందుకే శ్రీ కృష్ణ పరమాత్మ ఎక్కువ కర్మలు చేయ్యమన్నారు. అకర్ముడిగా వుండవద్దన్నారు. (భ।గీ। 2-47) కారణం ఎన్ని ఎక్కువ కర్మలు చేస్తే వాటి నుండి అంత ఎక్కువ అనుభవం వస్తుంది కాబట్టి. అందుకే జీవితం అన్నది పాఠాలు నేర్చుకోవడానికేనని అంటారు. నేర్చుకోమని కూడా చెపుతారు.

ఇంకా మనం చూస్తే ఈ జన్మలో మనం ఎవరి దైనా చెయ్యి తీస్తే ఆకర్మ చేసినందుకు, ఆ రకమైన అనుభవం పొందటానికి మరు జన్మలో అవిటివాడుగానో, లేక యాక్సిడెంటులో చెయ్యి పోగొట్టుకునో ఆ భాధ అనుభవించవలసి వస్తుంది. అలాంటివాడు ఆ మరు జన్మలో అలాంటి పని చెయ్యడు.

అలాగే తక్కువ కులమని అవమానిస్తే, ఆ భాధ ఎలాంటిదో తెలుసుకోనటానికి తాను కూడా తక్కువ కులంలో పుట్టవలసివస్తుంది. తెలివి తక్కువ వాడని హేళన చేస్తే, తాను కూడా తెలివి తక్కువవాడిగా, మానసిక వికలాంగుడిగా జన్మ తీసుకోవలసి వస్తుంది.

బలం వుందని గర్వంతో విర్రవీగితే, మరు జన్మలో ఆ అనుభవం కోసం బలహీనుడిగా జన్మించవలసివస్తుంది. అలా జన్మ తీసుకున్నది అనుభవం కోసమే! కానీ చేసిన కర్మని బట్టి తీసుకుంటాడు. అంటే కర్మలే ప్రధాన పాత్ర వహిస్తాయని అర్ధమవుతుంది. కర్మను బట్టి జన్మ వుంటుంది. అందుచేత "కర్మలు వున్నాయి. కర్మ సిద్ధాంతం వుందని" తెలుసుకోవచ్చు.

అందుచేత పాప కర్మలు చేసి ఆ కర్మఫలం అనుభవించడానికి, అనుభవం పొందటానికి ప్రయత్నించకండి. అది చాలా భాధాకరం, జీవితం నరకమవుతుంది. కర్మ సిద్ధాంతం వుందని తెలుసుకొని ఎదుటవారి జీవితాలను

చూసి దాని నుంచి పాఠాలు నేర్చుకోండి. అంతేకాని అనుభవం నుంచి నేర్చుకోవడం కాదు.

యోగుల పుస్తకాలు చదవండి. గొప్ప వారి జీవితాలు చూడండి. వారి మార్గంలో పయనించండి. వారి నుండి పాఠాలు నేర్చుకోండి. అంతేకాని నేర్చుకోవటానికి అనుభవిస్తున్నాను అంటూ భాధలు అనుభవించకండి. ధ్యానం చేయండి.

అందుచేత **"కర్మల నుంచే అనుభవాలు. అంతేకాని అనుభవాల కోసం కర్మలు కాదు".**

ఆలోచించండి అనుభవం కోసమే ఇతరులను హింసించాడు అనుకుందాం! అందరినీ అలా హింసించుకుంటూ పోతే వాడికి ఏమి అనుభవం కలుగుతుంది. అనుభవం రాదు సరికదా ఇంకా ఇంకా హింస చేస్తూనే వుంటాడు. వాడికి ఏమి అనుభవం వస్తుంది?. "హింస అనుభవిస్తేనే కదా! అనుభవం వస్తుంది"?. అందుచేత చేసిన కర్మలు అనుభవించవలసిందే పాఠాలు నేర్చుకోవలసిందే.

కర్మలు ఉన్నాయి కాబట్టి హిందూ శాస్త్రాలలో యమలోకం వుందని, యముడు వున్నాడని, చిత్రగుప్తుడు వున్నాడని, పాప కర్మలు చేసిన వారి చిట్టా ఆయన దగ్గర వుంటుందని, పాప కర్మలు చేసి చనిపోయిన వారు యమలోకానికి చేరుకుని అక్కడ తాము చేసిన పాప కర్మలకు తగ్గ శిక్షలు అనుభవించవలసి వస్తుందని చెప్పబడింది.

ఇక్కడ మనం గ్రహించవలసినదేమిటంటే అక్కడ యముడు వున్నాడా? యమలోకం వుందా? లేదా? అన్నది కాదు. పాపాలు, హింసలు చేసేవారు కచ్చితంగా శిక్ష అనుభవించవలసివస్తుందనేదే ఆ శాస్త్రాల యొక్క సందేశం. మనం ఆలోచిస్తే **జీవితంలో మనం అనుభవించే కష్టాలు, సమస్యలు అన్నీ మనం గతంలో చేసిన హింసాత్మకమైన కర్మలు, పాపకర్మల ఫలితమే తప్ప ఇంకొకటి కాదని అర్ధమవుతుంది.** లేకపోతే కష్టాలు ఎందుకు వస్తాయి? అందరికీ ఒకే రకం కష్టాలు రావట్లేదు కదా! ఒక్కొక్కరికీ ఒక్కోరకం కష్టం, ఒక్కొక్కరికీ ఒక్కోరకం సమస్య. అందుచేత **"ఎవరు ఎలాంటికర్మ చేసుకుంటే**

**అలాంటి ఫలితం"** అనుభవిస్తున్నారు.

**"మంచిచేస్తే మంచి, చెడు చేస్తే చెడు పొందుతున్నాం". "హింస చేస్తే హింస", "ఆనందం కలిగిస్తే ఆనందం పొందుతున్నాం".** అంతెందుకు ఎప్పుడో ఏదో జరుగుతుందనుకోవక్కరలేదు. ఈ జన్మలోనే ఎవరైనా చేసిన కొన్ని తప్పులు తప్పించుకోవచ్చు. కాని అదే తప్పు మరల మరల చేసేవారు ఇక్కడ చట్టానికే అంటే పోలీసులకు దోరికి శిక్షలు అనుభవిస్తున్నారు. అలా దొంగతనం చేసేవారు, నేరాలు చేసేవారు, హత్యలు చేసేవారు, మోసాలు చేసేవారు శిక్షలు అనుభవించడం చూస్తున్నాం. అంటే కర్మలు చేసి ఫలితం అనుభవిస్తున్నారు అంటే 'కర్మ సిద్ధాంతం' ఉన్నట్లేగా!

అంతెందుకు ఎవరినైనా ఎదటవారిని తిట్టండి వెంటనే వాడి నుంచి స్పందన వచ్చి మరల మిమ్మల్ని తిడతాడు. కోట్టండి వెంటనే దానికి ప్రతిస్పందన చూపిస్తాడు. ఒకవేళ వీడు కోట్టలేక పోతే తన వారిని తీసుకువచ్చైనా కొట్టిస్తాడు. అంటే కొన్ని కర్మలకు వెంటనే ఫలితం అనుభవిస్తున్నాం. అలాగే ఫ్యాక్షన్ కక్షలు చూడండి ఒకరిని చంపితే ఆ వర్గం వారిని ఇంకోక వర్గం చంపుతున్నారు కదా! అలా అవకాశం ఉన్నంత వరకు చంపుకుంటునేవున్నారు. నక్సలైట్లను పోలీసులు చంపుతుంటే! పోలీసుల్ని నక్సలైట్లు చంపడం చూడటం లేదా! అంటే చేసిన కర్మకి ప్రతి చర్య పొందుతున్నారు కదా! అంటే 'కర్మ సిద్ధాంతం' ఉన్నట్లేకదా!

ఇంకా చూడండి ఎవరైనా బాగా తప్పులు, పాపాలు చేసినప్పుడు, ఏదైనా కష్టం కలిగితే మనమే అంటాం "చేసిన పాపాలు ఎక్కడికి పోతాయి?. పాపం చేశాడు అనుభవిస్తున్నాడు" అని అంటాం. వీటన్నిటి బట్టి కచ్చితంగా ఈ సృష్టిలో "కర్మలు వున్నాయి. కర్మ సిద్ధాంతం వుందని" కచ్చితంగా అర్ధమవుతుంది.

**ఎలాంటి కర్మలు చేస్తే అలాంటి అనుభవాలు. అందుకే జీసస్ అన్నారు. "ఏది విత్తుతే ఆ పంటే కోసుకుంటావు"** అంటే ఏ కర్మ చేస్తే అలాంటి ఫలితం అనుభవిస్తావు. అనుభవం ఎందుకు? మళ్ళీ చేయకుండా వుండటానికి, మంచిగా జీవించటానికి, అందుచేత **"అనుభవాల కోసం జన్మకాదు కర్మలను**

**బట్టి జన్మ"** అని తెలుసుకోవాలి. అందుచేత కచ్చితంగా "కర్మలు వున్నాయి. కర్మసిద్ధాంతం వుంది". ఇదే యోగులు మహానుబావులంతా చెప్పింది.

కొంతమంది మూర్ఖులు రకరకాల పుస్తకాలు చదివి అర్ధంకాక, అర్ధం చేసుకోలేక తమకు తోచిన అర్ధాలు చెపుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు..

అందుచేత సంశయాలను ప్రక్కనపెట్టి, ధ్యాన సాధన చేస్తూ మంచి మార్గంలో పయనించండి. యోగుల పుస్తకాలు చదవండి. మీరు కూడా ఎంతో కొంత జ్ఞానం సంపాదించుకోండి. మూర్ఖులను వదిలివేయండి. వారి మాటలు పట్టించుకోకండి.

యోగీశ్వరులైనటువంటి శ్రీకృష్ణుడు, బుద్ధుడు, జీసస్, పత్రీజీ లాంటి వారి మార్గంలో పయనించి, పాప కర్మలైనటువంటి జీవహింస, మాంస భక్షణ మాని జీవితాన్ని ధన్యం చేసుకోండి. ధ్యానం చెయ్యండి. అజ్ఞానుల, అవివేకుల మాటలు విశ్వశించకండి. అనవసరంగా జీవితాన్ని నరకప్రాయం చేసుకోకండి. పత్రీజీ బాటలో నడిచి, ఇహ పరాలలో ఆనందాన్ని పొందండి.

**చేసిన కర్మ అనుభవించవలసిందే!**
**ఎవరూ తప్పించుకోలేరు. దైవనామస్మరణ చేసి**
**నిప్పును ముట్టుకుంటే కాలకుండా వుంటుందా?**



# భగవద్గీతార్థాన్ని "అనుకోవడం కాదు- అనుభవించాలి!"

**శ్రీ కృష్ణులవారు :-**

**శ్లో॥ సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి (భ.గీ.2-38)**

తా:- సుఖ దుఃఖములందు, లాభ నష్టములందు, జయాపజయములందు సమ బుద్ధి కలిగి యుద్ధమునకు సంసిద్ధుడవగును. అట్లు చేసితివేని నీవు పాపమును పొందకుందువు.

శ్రీ కృష్ణభగవానుడు అర్జునునకు ఏది బోధించినా అది లోకమంతటికీ బోధించినట్టే. అందరికీ బోధించినట్టే. అంటే మనందరికీ బోధించినట్టే. ఆయన సందేశమేమిటంటే! మన జీవితంలో మనకు కలిగే సుఖదుఃఖాలలో కాని, లాభ నష్టాలలో కాని, జయాపజయాలలో కాని సమబుద్ధి కలిగి, అంటే అన్నిటిని సమానంగా భావిస్తూ, ఈ జీవిత సమరం సాగించాలి. అలా జీవించిన వారికి పాపము అంటదు. అటువంటి వారు 'యోగి' అని పిలువబడతాడు. దీనినే ఈ క్రింది శ్లోకం ద్వారా భగవానుడు చెప్పడం జరిగింది.

**శ్లో॥ యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనంజయ**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే (భ.గీ.2-48)**

తా:- ఓ అర్జునా ! నీవు యోగ నిష్ట యందు వుండి, సంగమును త్యజించి, కార్యము ఫలించినను, ఫలించకపోయినను సమానముగా ఉన్న వాడవై కర్మలు చేయుము.

భగవానుడు చెప్పినట్టు కర్మలు చెయ్యాలంటే 'యోగనిష్ట' అవసరం. అట్టి సమత్వ బుద్ధియే 'యోగ'మవుతుంది . **'యోగ నిష్ట'** అన్నది మనస్సును

దాటి 'ఆత్మ స్థితి'లో వున్నప్పుడే కలుగుతుంది. అది 'ధ్యానం' ద్వారానే సాధ్యం అవుతుంది. అంటే భగవానుని సందేశం ప్రకారం ఎవరైతే 'ధ్యానం' చేస్తూ, ప్రాపంచిక విషయాల పట్ల సంగాన్ని త్యజించి, అంటే ఆసక్తిని వదిలి, కార్యము అంటే చేసే పని ఫలించినా, ఫలించకపోయినా, పట్టించుకోకుండా పనులు చేస్తూ వుంటారో! దానిని సమ స్థితి అంటారు. అది 'యోగమని' పిలువబడుతుంది. అలాంటి వాడినే 'యోగి' అని పిలుస్తారు. వాడికి ఏ పాపము అంటదు అని భగవానుడు చెప్పడం జరిగింది.

కానీ ఇక్కడ మనం ఒక విషయం గ్రహించాలి. మానవులలో రెండు రకాల వారున్నారు. సమ స్థితిని "అనుకునేవారు – అనుభవించేవారు". "అనుకునేవారు యోగులు కాదు. అనుభవించేవారే యోగులు". కారణం ఏమిటంటే చాలా మంది అంటూ వుంటారు. నేను ఏం జరిగినా ఏమీ పట్టించుకోనండీ! దాన్ని అలాగే వదిలేస్తూ వుంటాను అంటారు. అంటే వారు ప్రతి దానికి లోపల ప్రతిస్పందిస్తూ వుంటారు, కాని పైకి వ్యక్తం చెయ్యరు. పట్టించుకోనట్టుగా వుంటారు. వీరు యోగులు కాదు. వీరికి పాపం అంటుతూనే వుంటుంది. కాని తాత్కాలిక శాంతి మాత్రమే పొందగలరు.

కాని యోగ స్థితి పొందిన వారు అంటే 'ఆత్మ స్థితి'ని పొందినవారు అంటే 'మనో స్థితి'ని దాటినవారు అంటే 'ధ్యానం' చేసేవారు సమత్వాన్ని అనుభవిస్తూ వుంటారు. వీరు అనుకోరు. అనుభవిస్తూ వుంటారు. వీరికి పాపాలు అంటవు. అందుచేత అనుకునేవాడు 'యోగి' కాదు. అనుభవించే వాడే 'యోగి'. వీరికి ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి వుండదు. ఆధ్యాత్మికం పైనే ఆసక్తి వుంటుంది. ఎంతసేపూ ఆధ్యాత్మిక భావాలే వుంటాయి. ఇది అనుభవించే స్థితి. అందుచేత 'అనుకోవడం' వేరు. 'అనుభవించడం' వేరు అని తెలుసుకోవాలి.


ఆధ్యాత్మిక స్థితి 'ధ్యానం' ద్వారానే వస్తుంది. అందుచేత పూజలు, స్తోత్రాలు, జపాలు చేసే వారు అనుకుంటూ వుంటారు. వీరు మనో స్థితిలో వుంటారు. కానీ 'ధ్యానం' ద్వారా మనో స్థితిని దాటి 'ఆత్మ స్థితి'లో అంటే 'భగవత్ స్థితి'లో వుండేవారు అనుభవిస్తూ వుంటారు. వీరే 'యోగులు'. అందుచేత భగవానుడు చెప్పిన సమత్వ స్థితి అనుభవించాలంటే 'ధ్యానం' చెయ్యవలసిందే. అందుచేత అందరూ 'ధ్యానం' చెయ్యండి. అన్ని విషయాలలో, అన్ని సందర్భాలలో 'సమ స్థితి'ని పొందండి. ఆనందంగా జీవించండి.



# భగవద్గీతలో యుగాంతం గురించి!

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 2012తో యుగాంతంకాబోతున్నదనే చర్చలు బాగా జరుగుతున్నాయి. రకరకాల ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు భూమండలంలో ఎన్నో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని, అంటే సునామీలు, తుపానులు, భూకంపాలు, అగ్ని పర్వ తాలు పేలడం,అడవుల దహనం, వరదలు, అకాల వర్షాలులాంటివి సంభవించి అపార ఆస్తి నష్టం, జన నష్టం జరుగుతుందని; మానవ జాతే అంతరించిపోవచ్చని అంటున్నారు.

మరికొంత మంది ఉపద్రవాలు జరగడం వల్ల, భూమండలంలోని ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలలోని మంచు కరగడం వల్ల సముద్రాలు పొంగి భూమండలంలో బౌగోళిక మార్పులు సంభవిస్తాయనీ, అంటే కొన్ని దేశాలు మునిగిపోవచ్చు,కొన్ని కొత్తదీవులు బయటపడవచ్చు అంటున్నారు.


మరికొంత మంది సూర్యగోళంలో సునామి ఏర్పడుతుందని, అది భూమిని తాకితే భూమి సర్వ నాశనమవుతుందని చెపుతున్నారు. మరికొంత మంది గ్రహాల కక్షలు మారతాయని, అందుచేత సృష్టిలో చాలా మార్పులు సంభవిస్తాయని, మరి కొంతమంది భూమి మీద కాలుష్యం పెరిగిపోయింది దాని వల్ల భూమిని రక్షిస్తున్న ఓజోన్‌పొర చిల్లుపడింది, దానివల్ల హానికరమైన

కిరణాలు భూమిని తాకి మానవాళికి ఎప్పుడూ వూహించని జబ్బులు, రోగాలు సంభవిస్తాయని, విపరీతమైన మరణాలు వుంటాయని, ఆ లక్షణాలు ఇప్పటికే అందరిలో కనిపిస్తున్నాయని, ప్రస్తుతం చాలా మంది విపరీతమైన అంతుపట్టని రోగాలతో భాధపడుతున్నారని కూడా చెపుతున్నారు.

మరికొంత మంది బ్రహ్మంగారి కాలజ్ఞానం వాస్తవమయ్యే సమయం వచ్చింది అందుకే ఈ మధ్య కుక్క కడుపున పిల్లి పుట్టింది, గోపురాలు కూలుతున్నాయి, ధ్వజ స్తంభాలు పడిపోతున్నాయి, అన్ని చోట్ల అపశకునాలు కనబడుతున్నాయి అని చెపుతున్నారు. ఇంకా కొంతమంది ఈ విషయాలు 'నోష్టర్ డామస్' అనే త్రికాలజ్ఞాని చెప్పడం జరిగింది, అవే ఇప్పుడు వాస్తవాలు అవుతున్నాయి అని చెపుతున్నారు. ఇంకా  కొంతమంది ఈ విషయాలన్ని 'మియామి క్యాలండరు'లో వేల సంవత్సరాల క్రితమే పేర్కోనడం జరిగిందని ఆ క్యాలండరు 2012తో అంతమయ్యిందని చెపుతున్నారు.

అలా ఈ విషయాలన్నీ ఇటీవల టి.వి. చానల్సులో అదేపనిగా ప్రసారం చేస్తున్నారు. ఏదో జరుగుతుందని కొందరు, భయపడవలసింది, కంగారు పడవలసింది ఏమీ లేదని కొందరు, 3 రోజులు అంధకారం వ్యాప్తిస్తుందని కొందరు,  ఎలక్ట్రానిక్ పరికరాలు పని చెయ్యవని కొందరు ఇలా రకరకాలుగా చెపుతున్నారు.

అసలు ఇంతకీ ఏం జరుగుతుంది? ఏమి జరగబోతుంది? అసలు యుగాంతం గురించి భగవద్గీతలో ఏమైనా చెప్పబడిందా? లేక ఇదంతా వూహాగానాలా? అసలు భగవద్గీతలో యుగాంత ప్రస్తావన వుందా? అంటే వుందనే చెప్పాలి ఈ క్రింది శ్లోకాలు చూద్దాం:-

**శ్లో॥ పరస్తస్మాత్తు భావోన్యోవ్యక్తోవ్యక్తాత్సనాతన:**
**యస్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి. (భ.గీ 8-20)**

తా:- ఏ వస్తువు (భగవంతుడు) అవ్యక్తమైనది, ఉత్తమమైనది, ఇంద్రియములకు వ్యక్తముకానిది, పురాతనమైనది అయివున్నదో ఆ పరమాత్మ సమస్తప్రాణికోట్లు నశించినను నశించకయే యుండును.

ఇక్కడ సమస్త ప్రాణికోట్లు నశించినను అని చెప్పబడిందంటే యుగాంతము వుందని చెప్పినట్లే కదా!

ఆయన ఇంకా :-

**శ్లో॥ అవ్యక్తాద్వ్యక్తయ: సర్వా: ప్రభవన్త్యహరాగమే**
**రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్త సంజ్ఞ కే. (భ.గీ 8-18)**

తా:- బ్రహ్మదేవుని పగలు ప్రారంభమైనపుడు, అవ్యక్తము (భగవంతుని) నుండి సమస్త చరాచరవస్తువులు పుడుతున్నాయి. మరల రాత్రి ప్రారంభమైనపుడు ఆ అవ్యక్తమునందే లీనమవుతున్నాయి.

ఇక్కడ కూడా భగవంతునికి పగలు ప్రారంభమైంది అంటే, అన్నీ అంటే చర, అచర వస్తువులన్నీ సృష్టింపబడుతున్నాయి. అలాగే భగవంతునికి రాత్రి ప్రారంభమైంది అంటే సృష్టింపబడిన వన్నీ అంతమవుతున్నాయి. అందుకే **"భగవంతుడు కన్ను మూస్తే యుగాంతము, కన్ను తెరిస్తే యుగారంభము"** అంటారు. అదే ఈ క్రింది శ్లోకంలో చెప్పబడింది.

**శ్లో॥ భూతగ్రామస్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే**
**రాత్ర్యాగమేవశ: పార్థ ప్రభవత్యహరాగమే. (భ.గీ 8-19)**

తా:- ఓ అర్జునా! ఆయా ప్రాణిసమూహమే కర్మ పరాధీనమై పుట్టి బ్రహ్మదేవుని రాత్రియొక్క ప్రారంభమున విలయమొందుచున్నవి తిరిగి బ్రహ్మదేవుని పగటియొక్క ప్రారంభమున పుట్టుచున్నవి.

**శ్లో॥ సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్. (భ.గీ 9-7)**

తా:- అర్జునా! సమస్తప్రాణికోట్లు ప్రళయకాలమున నా ప్రకృతిని (మాయను) జేరి అందు అణగియుండును. తిరిగి సృష్టికాలమున వానిని నేను సృజించుచుందును.

ఇలా సృష్టిలో యుగారంభము, యుగాంతము జరుగుతుందని శ్రీకృష్ణ పరమాత్మ తెలియజేసిఉన్నారు. యుగారంభములో చర, అచర జగత్తు

సృష్టింపబడుతుంది. యుగాంతంలో ఈజగత్తు అంతా అదృశ్యమవుతుందని తెలియజేయడం జరిగింది. అంటే భగవద్గీతలో యుగాంతము గురించి ప్రస్తావించడం జరిగింది.

కానీ అది ఎప్పుడు జరుగుతుందో? ఏ సంవత్సరములో జరుగుతుందో? అన్న వివరణ మనకు లేదు. కాని యుగాంత ప్రస్తావన మాత్రం వుంది. మరి 2012లో జరిగేది యుగాంతమా? కాదా? అంటే బ్రహ్మర్షి పత్రీగారు స్పష్టంగా చెపుతున్నారు 2012లో జరగబోయేది 'యుగాంతము' కాదు, 'యుగమార్పు'. యుగాంతము వేరు! యుగమార్పువేరు! చాలా మంది యుగమార్పునే, యుగాంతంగా భావిస్తూ భయపడుతున్నారు. యుగ మార్పు వుంటుందని పురాణాల ద్వారా మనం తెలుసుకుంటున్నాము కదా! అలా సృష్టిలో 4 యుగాలు వున్నాయని. అవి 1) కృతయుగము (సత్యయుగము) 2) త్రేతాయుగము 3) ద్వాపరయుగము 4) కలియుగము అని చెప్పబడింది.

పురాణాలను బట్టి త్రేతాయుగాంతంలో శ్రీరామచంద్రుడు అవతరించాడని, ద్వాపర యుగాంతంలో శ్రీకృష్ణ భగవానుడు అవతరించాడని అలాగే కలియుగాంతంలో కల్కి భగవానుడు అవతరిస్తాడని చెపుతారు. అంటే యుగాలు మారతాయని స్పష్టంగా అర్ధమవుతుంది.

అలాగే ఇప్పుడు జరగబోయేది కూడా **"కలియుగ అంతమే కాని, సృష్టి అంతంకాదు. యుగమార్పే కాని, సృష్టి అంతం కాదు".** ఇది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. అదే పత్రి గారు కూడా చెపుతున్నారు. 2012 తరువాత యుగమార్పు జరిగి సత్యయుగం ప్రారంభమవుతుందని చెపుతున్నారు. ఏ యుగంలోనైనా ఆయుగ ధర్మం ప్రకారం ప్రజల ప్రవర్తన వుంటుందనీ, యుగం మారినపుడు వారి జీవన సరళి, ప్రవర్తన కూడా మారుతూవుంటుందనీ, అందుచేత ప్రస్తుత కలియుగం మారి 2012తో సత్యయుగం ఆరంభమవుతుంది కాబట్టి, సత్యయుగ ధర్మమైన 'ధ్యానం' అందరూ చెయ్యాలని పత్రిగారు చెపుతున్నారు.

కలియుగంలో కంటే సత్యయుగంలో భూమి మీద శక్తులు ఎక్కువ వుంటాయి కాబట్టి ఆ శక్తులు తట్టుకునే శక్తి మానవులకు వుండాలంటే,

మానవులు తప్పనిసరిగా 'ధ్యానం' చెయ్యవలసిందేనని, 'ధ్యానం' చెయ్యకపోతే మానవులు శక్తి హీనులై రకరకాల రోగాలతో, నానా అవస్థలు పడవలసి వస్తుందనీ, ప్రాణాలు కూడా కోల్పోవలసి వస్తుందని చెపుతున్నారు.

యుగమార్పు వల్ల మంచే జరుగుతుందని, అంతమయ్యేది చెడు మాత్రమే అని, అదే జరగబోయే మార్పని చెబుతున్నారు. ప్రస్తుతం కలియుగంలో విపరీతంగా వున్నటువంటి జీవహింస, మాంస భక్షణ అంతమవుతుందనీ, దానితోపాటు మానవులలో వున్నటువంటి తారతమ్యాలు, కుల, మత, ప్రాంత బేధాలు అంతమవుతాయి. "అంతా ఒకటే, అంతా సమానమనే" యుగం ప్రారంభమవుతుంది. అన్యాయాలు, దోపిడిలు, దౌర్జన్యాలు, రాక్షసకృత్యాలు, అరాచకాలు, అత్యాచారాలు అంతమవుతాయనీ, న్యాయం, ధర్మం, శాంతి, కరుణ, ప్రేమ, దయ, జాలి, దానం అన్నవి అందరి గుణాలు అవుతాయనీ, అలా 'కలియుగం' అంతమై "సత్యయుగం" ఆరంభమవుతుందనీ పత్రిగారు చెపుతున్నారు.

ఇప్పుడు వున్న అశాంతి, దు:ఖం మానవులకు వుండదు, వుండబోయేది శాంతి, సంతోషం, ఆనందం మాత్రమేనని పత్రిగారు చెపుతున్నారు. అంతా మంచే జరుగుతుందంటున్నారు. మంచే మిగులుతుందంటున్నారు. అందుచేత భయపడవలసింది ఏమీలేదు. రాబోయేది అంతా మంచి కాలం, మంచి యుగమని చెపుతున్నారు.

కాని చేయవలసింది రెండే రెండు 1) హింసనువదలాలి 2) ధ్యానం చెయ్యాలి అంటే జంతువులను హింసించకూడదు, మాంస భక్షణ మానాలి. అలాగే "శ్వాసమీద ధ్యాస" వుంచి ధ్యానం చెయ్యాలని చెపుతున్నారు. ఇదే ప్రతి ఒక్కరూ చేయవలసింది, గుర్తుంచుకోవలసింది. అందుచేత 'ధ్యానం' చెయ్యండి ఆనందంగా వుండండి. **"యుగాంతం అని భయపడకండి. యుగ మార్పునకు అనుగుణంగా ప్రవర్తించండి".**

**"ప్రకృతి నిర్ధారించిన పరిధులను ఉల్లంఘించడం అంటే!**
**నిజానికి పరమాత్మ ఆజ్ఞను ధిక్కరించడమే!"**



# భగవద్గీతలో జీవహింస గురించి!

జీవహింస గురించి భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు అనేక సందర్భాలలో పేర్కొనడం జరిగింది. జీవహింస ఎందుకు చేయకూడదు? జీవులను హింసించడం వల్ల కలిగే నష్టాలు, వాటి పరిణామాలు చక్కగా వివరించడం జరిగింది.

మానవుడు కష్టాల నుంచి బైటపడాలంటే, అంటే ముక్తి పొందాలంటే అంటే సమస్యల నుంచి ముక్తి, రోగాలనుంచి ముక్తి, బాధలనుంచి ముక్తి, అశాంతినుంచి ముక్తి, కుటుంబ సమస్యల నుంచి ముక్తి , ఆర్థిక సమస్యలనుంచి ముక్తి, వార్ధక్య భాధలనుంచి ముక్తి లభించాలంటే ఆరాధనలు అంటే పూజలు, నోములు, వ్రతాలు, భజనలు, జపాలు లాంటివి చేస్తే సరిపోదు వాటికంటే భూతదయ, ప్రాణులకు అంటే జంతువులకు మంచిచేయడంలో ఆసక్తి కలిగివుండాలి, జీవులపట్ల కాఠిన్యం లేకుండా వుండాలి, వాటిపై కరుణ చూపించాలి, అన్నిటిని సమభావంతో చూడాలి, వాటిలో భగవానుని చూడాలి, వాటి సుఖ దు:ఖాలు తన సుఖ దు:ఖాలుగా భావించాలి, జంతువులను బాధించకుండా ఉండాలి, హింసకు మూల కారణమైన మాంస భక్షణ మానాలి. ఇవి ఆచరించినప్పుడే కష్టాల నుంచి ముక్తి పొందగలరు. అంతే తప్ప హింస చేసేవారు ఎన్ని ఆరాధనలు చేసినా వ్యర్ధమని భగవద్గీత సారాన్ని బట్టి గ్రహించవచ్చు.

అందుచేత **"గీతను పారాయణ చేయడం కాదు, భగవానుడు చెప్పింది పాటించాలి". "ఆయనను ఆరాధించడంకాదు ఆయన చెప్పింది ఆచరించాలి".** ఇది ప్రతి ఒక్కరూ గ్రహించవలసిన విషయం. కారణం **జీవులలో వున్నది కూడా భగవానుడే! అంటే మనం ఎవరినైతే ఆరాధిస్తున్నామో ఆయనే!**

అందుచేత  జీవహింస చేసే వారు, మాంసభక్షణ చేస్తూ హింసకు కారకులయ్యేవారు షోడసోపచార పూజలు చేసినా భగవానుని ఆనంద పరచలేరు; కారణం **సమస్త ప్రాణులు ఆయన రూపాలే! అన్నిటిలో ఉన్నది ఆయనే!** అందుచేత 'అంతా ఒకటే' అని తెలుసుకోవాలి.

ఇది గ్రహించి జంతువులను, మూగజీవులను చంపకూడదు. మాంసం భక్షించి వాటి హింసకు, చావుకు కారకులు కాకూడదు. అది కూడా భగవంతుని హింసేనని తెలుసుకోవాలి. అంతా ఒక్కటే! అంతా సమానమని గ్రహించాలి. అప్పుడే భగవంతుని అనుగ్రహాన్ని పొందగలం. ఆయన కృపకు పాత్రులు కాగలం. దు:ఖం నుండి బైటపడగలం. ముక్తి పొందగలం. ఆనందంగా జీవించగలం.

భగవద్గీతను భోధించే పెద్దలు, గురువులు, పండితులు హింస గురించి పెద్దగా ప్రస్తావించకపోవడం వల్ల సామాన్యులు, పామరులు మాంసభక్షణ తప్పుకాదన్నట్టు భావిస్తున్నారు. పాపం కాదనుకుంటున్నారు. తరతరాల నుంచి ఆచారంగా వస్తుందని, మాంసం తింటే బలమని, రుచిగా వుంటుందనే అపోహతో తాము తినటమే కాదు చిన్ననాటి నుండి పిల్లలను కూడా తినమని ప్రోత్సహిస్తున్నారు. బలవంతం చేస్తున్నారు. తినకపోతే వత్తిడి చేస్తున్నారు. అంతకన్నా ఆలోచించటం లేదు.

మాంసం అంటే చనిపోయిన జంతువని, మృతాహారమని, రక్తపుకూడు అని ఆలోచించలేక పోతున్నారు. రక్తమాంసాలు మానవుని ఆహారం కాదని. జీవులను చంపడం పాపమని తెలుసు కోలేకపోతున్నారు. అవి అమాయకపు, అసహాయ, మూగజీవులని, అవి కనీసం తమ బాధను, తమ కష్టాన్ని కూడా చెప్పుకోలేని స్థితిలో వున్నాయని మానవులు ఆలోచించడంలేదు. అంతేకాదు తాము మానవులమని, మానవత్వమే తమ సహజ లక్షణమని, క్రూరత్వం, రాక్షసత్వం తమ లక్షణం కాదని గ్రహించలేకపోతున్నారు. సృష్టిలోని సమస్త జీవులు అంటే మానవునితో



సహా భగవంతుని సృష్టిలోనివేనని, అన్నీ ఆయన రూపాలేనని, అన్నిటిలో వున్నది ఆయన శక్తేనని, అన్నీ ఆయన బిడ్డలేనని గ్రహించలేకపోతున్నారు.

అందుచేత బాగా ఆలోచించాలి **"భగవంతుని పూజించడం కాదు భగవంతుడు బోధించింది ఆచరించాలి".**

భగవద్గీతలో జీవహింస గురించి లేదని అనుకోకండి. కచ్చితంగా హింస చేయవద్దనే చెప్పబడింది. **"అహింసే అన్నిటికంటే గొప్ప ధర్మమని చెప్పబడింది"**. అందుచేత **"జీవహింస చేయకండి మాంసభక్షణ మానండి".**

**భగవద్గీతలో భగవానుడు భూతదయ గురించి చెప్పిన విషయాలు చూద్దాం:-**

ఆయన ఈ క్రింది శ్లోకం ద్వారా అన్ని జీవులలో వున్నది తానేనని స్పష్టంగా చెప్పడం జరిగింది.

**శ్లో|| అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థిత:**
**అహమాదిశ్చ మద్యంచ భూతానామన్త ఏవచ. (భ.గీ 10-20)**

తా: ఓ అర్జునా! సర్వప్రాణులలో స్థితమైవున్న ఆత్మను నేనే అయివున్నాను. మరియు ప్రాణులయొక్క ఆదిమద్యాంతములు నేనే అయివున్నాను.

పై శ్లోకార్ధం ద్వారా సమస్త జీవులు భగవంతుని స్వరూపాలేనని తెలుసుకోవచ్చు. అందుచేత వేటిని హింసించినా భగవంతుని హింసించినట్టే! ఆయన ఇంకా:-

**శ్లో|| సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్**
**వినశ్యత్స్వవినశ్యన్తం య: పశ్యతి స పశ్యతి. (భ.గీ 13-28)**

తా:- సమస్తప్రాణులందు ఒకే రకంగా ఉన్నట్టి పరమాత్మను, ఆయా ప్రాణుల దేహాలు నశించినా, నశింపనివానినిగ ఎవడు తెలుసుకొనుచున్నాడో ఆతడే నిజముగ విజ్ఞుడగును.



శ్లో॥ సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్
న హినస్త్యాత్మ నాత్మానం తతో యాతి పరాంగతిమ్. (భ.గీ13-29)

తా:- ఎందుకనగా సమస్త ప్రాణులలో ఉన్నటువంటి పరమాత్మను ఒకే రకంగా వ్యాపించి వున్నట్లు చూడు మానవుడు తన ఆత్మను తాను హింసించుకొనడు. కావున సర్వోత్తమ గతిని (మోక్షమును) పొందుచున్నాడు.





పై శ్లోకాల ద్వారా అన్ని జంతువులలో వున్నది భగవంతుడే అని తెలుసుకోవాలి. అంతేకాదు మానవుడు స్వయంగా తాను కూడా ఆత్మ స్వరూపుడే అని తెలుసుకోవాలి. అందుకే పెద్దలు, పండితులు దివ్యాత్మస్వరూపులారా! అని మానవులను ఉద్దేశించి సంభోదించడం మనం చూస్తున్నాం. అటువంటి మానవుడు ఏ జీవిని, అంటే జంతువును హింసించినా తనను తాను హింసించుకున్నట్లే అవుతుంది. ఇది అర్థం చేసుకున్నవాడు ఏ ప్రాణిని అంటే ప్రాణమున్న ఏ జంతువును హింసించడు. ఈ సత్యాన్ని అర్థం చేసుకుని ప్రవర్తించే మానవుడు తప్పక మోక్షాన్ని పొందుతాడు. దు:ఖం నుంచి బయటపడతాడని భగవానుడు వివరించడం జరిగింది. ఇదే విషయం ఈ క్రింది శ్లోకంలో చెప్పడం జరిగింది.

**శ్లో॥ ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున**
**సుఖం వా యది వా దు:ఖం స యోగీ పరమో మత:. (భ.గీ 6-32)**

తా:- ఓ అర్జునా! ఎవరు సమస్త ప్రాణులయొక్క సుఖముగాని, దు:ఖముగాని తన సుఖ దు:ఖములుగా చూస్తాడో వాడే అందరిలో నాకెక్కువ ప్రియుడు.

ఈ శ్లోకం ద్వారా తన శరీరానికి కలిగిన బాధ తనకు ఎంత కష్టంగా వుంటుందో అలాగే సమస్త జంతువుల యొక్క బాధ కూడా వాటికి అంత కష్టంగా వుంటుందని తెలుసుకుని ఆ రకంగా ప్రవర్తించిన వాడే భగవానునికి ఇష్టుడు కాగలడని మనం తెలుసుకోవచ్చు. అంటే భగవానునికి ఇష్టులు కావాలంటే షోడసోపచార పూజలు చేస్తే లాభం లేదు. జీవహింస, మాంసభక్షణ చేయకూడదని తెలుసుకోవాలి.




ఇక్కడ ఒక విషయం ఆలోచిద్దాం. ఒక వ్యక్తి కోడి పీకను కోస్తున్నపుడు పొరపాటున అతని వేలు తెగితే 'అబ్బా', 'అమ్మా' అంటూ చాలా బాధపడతాడు. మరి కోడిని కోస్తే అది ఎంత భాధపడుతుంది? అది కూడా మన లాంటి జీవే కదా! ఇదే శ్రీకృష్ణ భగవానుని సందేశం.

**శ్లో॥ సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే**
**అవిభక్తం విభక్తేషు తజ్ఞానం విద్ధి సాత్త్వికమ్.(భ.గీ 18-30)**

తా:– విభజింపబడి వేఱువేఱుగనున్న సమస్త చరాచర ప్రాణులందు, నాశరహిత మగు ఒకే ఆత్మవస్తువును (దైవము యొక్క ఉనికిని) విభజిపబడక ఏకమై ఉన్నట్లు ఏ జ్ఞానము చేత తెలుసుకొంటున్నాడో! అట్టి జ్ఞానమును సాత్త్విక జ్ఞానమని తెలుసుకొనుము.




శ్లో॥ పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్
వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం నిద్ధి రాజసమ్.(భ.గీ 18-21)

తా:– ఏ జ్ఞానమువలన మానవుడు సమస్తప్రాణులను వేఱువేఱువిధములుగా అనేక జీవులను వేఱువేఱుగా భావించుచున్నాడో, అట్టి జ్ఞానమును రాజసజ్ఞానమని తెలిసికొనుము.

పై రెండు శ్లోకాల ద్వారా తెలుసుకోవలసింది, అన్ని జంతువులు పైకి వేరువేరుగా కనిపిస్తున్నప్పటికి అన్నిటిలో వున్న ఆత్మ, అంటే భగవంతుడు ఒక్కడే అని తెలుసుకోవాలి. ఈ రకమైన అవగాహన కలిగిన జ్ఞానం సాత్విక జ్ఞానం అనబడుతుంది. ఇది సరైన జ్ఞానం.

అలా కాకుండా అన్నీ వేరు వేరు అని భావించే జ్ఞానాన్ని రాజసజ్ఞానం అనబడుతుంది. ఇది సరికాని జ్ఞానం. ఈ సరికాని జ్ఞానాన్ని వదలి అన్నీ భగవంతుడే, అన్న సరైన జ్ఞానంతో వ్యవహరించమని భగవానుడు పై శ్లోకాల

ద్వారా భోధిస్తున్నారు. ఇది గ్రహించక జీవహింస చేసేవారికి ఎలాంటి గతి పడుతుందో శ్రీకృష్ణ భగవానుడు ఈ క్రింది శ్లోకాల ద్వారా వివరించారు.

**శ్లో॥ తానహం ద్విషత: క్రూరాన్ సంసారేషు నరాధమాన్**
**క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు. (భ.గీ 16-19)**

తా:- ఆ ప్రకారము సమస్తప్రాణులలో ఆత్మ స్వరూపుడినైవున్న నన్ను హింసించు క్రూరులైన, దుష్టులను జననమరణములతో ఉండు దు:ఖ కరమైన ఘోర సంసారమందు మాటి మాటికి పడవేసి వారిని బహు దు:ఖకరమైన అసుర యోనులందు పుట్టించెదను.

**శ్లో॥ అసురీం యోని మాపన్నా మూఢా జన్మని జన్మని।**
**మా మప్రాప్యైవ కౌన్తేయ తతో యాన్త్యధమాం గతిమ్ ॥ (16-20)**


తా:- ఓ అర్జునా! అసురయోనియందు పుట్టిన ప్రాణిహింసకులైన మూఢులు ప్రతి జన్మమునందు నన్ను పొందుమార్గము తెలియక ఇంకా అధోగతి పొంది బహుకాలం దు:ఖ భూయిష్టమైన ఘోర నరకమును పొందుదురు.

ఈ విధంగా పై శ్లోకాల ద్వారా సాక్షాత్తూ శ్రీకృష్ణ పరమాత్మ గీతలో "జీవహింస మాంసభక్షణ" వల్ల వచ్చే నష్టాల గురించి తెలియజేసియున్నారు. అంతేకాదు జీవహింస చేసేవారు భగవంతుని పొందలేరని, ఆయన ఎవరో తెలుసుకోలేరని, భగవానుని పొందగలిగే మార్గం కూడా తెలుసుకోలేరని, అలా ఎన్నో జన్మలు దుఃఖంలోనే జీవిస్తారని, భగవానుడు చెప్పడం జరిగింది.



అందుకే మాంసభక్షణ చేసే వారికి భగవానుని గురించి అంటే ఆత్మ గురించి చెప్పినా అర్థం కావడం లేదు. ఆత్మను చేరుకునే మార్గం "ధ్యానం". చెప్పినా అర్థం కావడం లేదు. వారు ఎంతసేపూ అసలైన, సత్యమైన భగవంతుని (ఆత్మను) గూర్చి తెలియక విగ్రహాలను, ఫోటోలను భగవంతుడనుకుంటూ అసలైన భగవంతుడెవరో! ఎక్కడుంటాడో! ఎలా చేరాలో! తెలియక, దుఃఖం నుండి బయటపడలేక సమస్యలతో బాధలు పడుతున్నారు. దీనికి కారణం భగవానుడు పై శ్లోకం ద్వారా చెప్పనే చెప్పారు కదా! అందుచేత జీవహింస, మాంసభక్షణ వెంటనే మానాలి. లేకపోతే ఆత్మే భగవంతుడని ఆయన ఎక్కడో కాదు తనలోనే, తనకు అత్యంత సమీపంలోనే వున్నాడన్న సంగతి ఎప్పటికి తెలియదు.

అంతేకాదు భగవానుని కోసం ఎక్కడెక్కడికో వెళ్ళనవసరం లేదు తనలోకి వెళితే చాలని, అసలు తానే ఆ భగవంతుడని ఎప్పటికీ అర్థం కాదు. చెప్పినా అర్థం చేసుకోలేరు. కారణం భగవానుడు చెప్పనే చెప్పాడు కదా! అందుచేత జంతు వధ, జంతు బలులు మానాలి. అంతేకాదు ఆయన అన్ని జంతువులను ప్రేమించే వారే తనకు ఇష్టులని ఈ క్రింది శ్లోకంలో చెప్పారు.



**శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్ర: కరుణ ఏవచ**
**నిర్మమో నిరహంకార: సమదు:ఖసుఖ: క్షమీ. (భ.గీ 12-13)**

తా:- సమస్త ప్రాణులయెడల ద్వేషములేనివాడును, మైత్రి, కరుణగలవాడును, అహంకార మమకారములు లేనివాడును, సుఖదు:ఖములందు సమభావము గలవాడును, ఓర్పుగల వాడును, ఎవడుకలడో, అతడు నాకు ఇష్టుడు.

**శ్లో॥ యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి. (భ.గీ 6-30)**

తా:- ఎవడు సమస్తభూతములను నాలో చూచుచున్నాడో, మఱియు నన్ను సమస్త భూతములందును గాంచుచున్నాడో అట్టివానికి నేను కనబడకపోను, నాకతడు కనబడకపోడు.

**శ్లో॥ లభన్తే బ్రహ్మనిర్వాణమృషయ: క్షీణకల్మషా:**
**ఛిన్నద్వైధా యతాత్మాన: సర్వభూతహితేరతా: (భ.గీ 5-25)**

తా:- పాపరహితులును, సంశయవర్జితులును, ఇంద్రియ మనంబులను స్వాధీన పఱచుకొనిన వారు, **సమస్తప్రాణులయొక్క క్షేమమందాసక్తి గలవారు** బ్రహ్మసాక్షాత్కారమును (మోక్షమును) బొందుచున్నారు.

సమస్త జీవులకు హితము చేయు మానవుడు బ్రహ్మ స్థితిని పొందడమే కాదు. శాంతిని కూడా పొందుతాడు. దేనికి దు:ఖింపడు, కోరికలుండవు గొప్ప భక్తుడవుతాడని ఈ క్రింది శ్లోకాల ద్వారా శ్రీకృష్ణులవారు తెలియ చేయుచున్నారు.

**శ్లో॥ భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తిమృచ్ఛతి. (భ.గీ 5-29)**

తా:- యజ్ఞములయొక్కయు, తపస్సులయొక్కయుభోక్త (ఫలము లనుభవించువాడు) గను, సమస్తలోకముల యొక్క ఈశ్వరుడు (ప్రభువు, శాసకుడు) గను, **సమస్తప్రాణుల యొక్క హితకారిగను,** నన్నెఱిగి మనుజుడు శాంతిని బొందుచున్నాడు.

ప్రస్తుతం అందరికీ అన్నీ వున్నాయి కానీ ఎవరికి శాంతి లేదు. దీనికి ముఖ్య కారణం పై శ్లోకం ద్వారా భగవానుడు చెప్పడం జరిగింది. ఆయన

సందేశమేమిటంటే **ఆయనచే సృష్టింపబడిన 84 లక్షల జీవుల యొక్క ఆనందం ఆయన కోరుకుంటాడని ఎవరైతే తెలుసుకుని ఆ ప్రకారం ప్రవర్తిస్తారో వారే శాంతిని పొందుతారని చెప్పడం జరిగింది.** అందుచేత శాంతిగా జీవించాలనుకునేవారు భగవానునికి తాము మాత్రమే ఇష్టులమని భావించకండి. అంటే మానవులు మాత్రమే ఇష్టులవుతారని భావించకూడదు. ఆయనకు జంతువులతో సహా అందరూ ఇష్టులే. ఆయన అందరి హితము కోరేవాడని అర్థం చేసుకోవాలి. జంతువుల మీద అమాయకపు మూగ జీవుల మీద కారుణ్యం చూపించాలి. వాటిని ప్రేమించాలి. భగవానునికి అవి కూడా ఇష్టమైనవని గ్రహించాలి. జంతువులను హింసించకూడదని తెలుసుకోవాలి.

పై శ్లోకాల ద్వారా భగవద్గీతలో భగవానుడు జీవహింస గురించి, మాంసభక్షణ గురించి చాలా ఎక్కువగానే ప్రస్తావించడం జరిగింది. ఇది ప్రతి ఒక్కరూ గ్రహించి భగవానుని పూజించటం కాదు, ప్రార్థించడం కాదు ఆయన చెప్పిన "సర్వ భూత దయ అంటే అహింసను పాటించాలి". హింస చేయ కూడదు". మాంస భక్షణ మానాలి, శాకాహారం తీసుకోవాలి. భగవానుడు చెప్పిన ధ్యానం చేయాలి. జీవితాన్ని ధన్యం చేసుకోవాలి.




**ప్రాణాన్ని తీస్తే రాక్షసుడు.**
**ప్రాణాన్ని తియ్యకపోతే మానవుడు.**
**ప్రాణాన్ని పోకుండా చూస్తే మహాత్ముడు.**
**ప్రాణాన్ని పోస్తే పరమాత్ముడు.**



# భగవద్గీతను బట్టి మానవుని ఆహారం శాకాహారమా? మాంసాహారమా?

మాంసాహారం మానవుల ఆహారం కాదు. అది తినకూడదు, పాపం అని అనగానే చాలా మంది మొక్కలలో కూడా ప్రాణం వుంది కదా! మరి శాకాహారం తిన్నా పాపమే కదా! అని ప్రశ్నిస్తారు. కాని ఈ విషయం, మానవులు తప్పనిసరిగా ఆలోచించాలి. కారణం మానవ శరీరం శాకాహార నిర్మితమే కాని మాంసాహార నిర్మితం కాదు. అంటే శాకాహారానికి అనుకూలం కానీ, మాంసాహారానికి అనుకూలం కాదు. ఇది సృష్టిలో వున్న ఏర్పాటు. అంటే భగవంతుడు చేసిన ఏర్పాటు.


అందుకే మాంసాహార జంతువులైన పులి, సింహం లాంటి వాటికి దంతాలు వుండవు. వాటికి బలిష్టమైన కోరలు, వాడి గోళ్ళు వుంటాయి. వాటితో ఏ ఆయుధం వుపయోగించకుండా జంతువులను చంపి, వాటి చర్మాన్ని చీల్చి, వాటి పచ్చి మాంసాన్ని తింటాయి. అవి మాంసాన్ని నమలవు, మింగుతాయి. అలా నమలకుండా మాంసం ముక్కలను మింగగలవు. మింగినా వాటిని అరిగించుకోగలవు. భగవంతుడే వాటికి ఆ ఏర్పాటు చేశాడు.

అంతేకాదు అవి జంతువుల రక్తాన్ని నాలికతో నాకి ఇష్టంగా ఆస్వాదిస్తాయి. **"వాటికి రక్తం అసహ్యం కాదు, మాంసం ముక్కలు మింగటం కష్టం కాదు".** మాంసాన్ని మెత్తగా నమలవలసిన పనిలేదు. నమలకపోయినా అరిగే ఏర్పాటు ప్రకృతిలో వాటికి ఇవ్వబడింది. వాటి శరీరం దానికి అనుగుణంగా తయారు చేయబడింది. అందుకే వాటి జీర్ణకోశం చాలా కురచగా వుంటుంది. ఆహారాన్ని ఆరగించే లాలాజలంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఎక్కువగా వుండడం వల్ల త్వరగా మాంసం ముక్కలు అరుగుతాయి. వ్యర్థం బయటకు

విసర్జింపబడుతుంది.

కాని సృష్టిలో శాకాహర నిర్మితమైన మానవ శరీరానికి ఈ రకమైన ఏర్పాట్లు లేవు. భగవంతుడు మానవ శరీరాన్ని శాకాహారానికి అనుకూలంగా నిర్మించాడు. మాంసాహారానికి అనుకూలంగా నిర్మించలేదు. అందుకే మానవుడు ఏదో ఒక ఆయుధం వుపయోగించి మాత్రమే ఏ జంతువునైనా చంపగలడు. అలాగే ఆయుధంతో మాత్రమే చర్మాన్ని, మాంసం నుంచి వేరు చెయ్యగలడు. అలాగే ఒక చాకో, కత్తితో మాత్రమే మాంసాన్ని ముక్కలు చెయ్యగలడు. గమనిస్తే మాంసం దుకాణంలో కత్తితో జంతువు శరీరం లోని మాంసాన్ని ముక్కలుగా చేసి వినియోగదారుడికి అంటే తినే వాడికి అమ్ముతాడు. వినియోగదారుడు కూడా ఆ మాంసం ముక్కలు వండేటపుడు కత్తితోకాని, చాకుతోకాని, ఇంకా చిన్న,చిన్న ముక్కల క్రింద కోసి ఆ ముక్కలను మెత్తగా మారేటట్లు వుడకపెడతారు. వాటి నుంచి వాసన, కంపు రాకుండా వుండటానికి వాటిపై మషాలాలు, కారం, ఉప్పు చల్లుతారు. ఇన్ని చేసినా తినలేరు కాబట్టి, వాటిలో శాకాహారం కలుపుతారు.ఇలా చేయకుండా మానవుడు మాంసాన్ని తినలేడు. మాంసాహార జంతువులా పచ్చి మాంసం ముక్కలు మింగలేడు.

అలా వండిన మాంసాన్ని మానవుడు తన దంతాలతో బాగా నమలాలి. నమిలితే కాని ఆ ఆహారాన్ని మానవుడు మింగలేడు. ఒకవేళ నమలకుండా మింగినా, తిన్న ఆహారం అరిగించుకోలేడు.అరగదు కూడా! అంటే శాకాహారి అయిన మానవుడు నమలాలి, అలా నమలటానికి దంతాలు కూడా ఇవ్వబడ్డాయి. ఆ దంతాలతో ఏ ఆహారాన్నయినా మెత్తగా చూర్ణం చేసి మింగాలి. ఇదే సృష్టిలో శాకాహారులకు వున్న ఏర్పాటు.



ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది మానవునకు దంతాలు వున్నాయి. మాంసాహార జంతువులకు దంతాలు లేవు. అందుచేత మానవుడు శాకాహారేకాని మాంసాహారి కాదు. శాకాహారమే మానవునకు యుక్తము కాని, మాంసాహారం కాదు. అందుచేత శాకాహారమే తీసుకోండి. ఇది మానవునకు ప్రకృతి సహజ సిద్ధమైన ఆహారం. భగవంతుడు నిర్దేశించినది.

ఈ విషయం భగవద్గీతలో కూడా ఉదహరించబడింది. భగవద్గీతలో ఇవ్వబడిన ఈ క్రింది శ్లోకం చూద్దాం.

**శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రిత:**
**ప్రాణాపాన సమాయుక్త: పచామ్యన్నం చతుర్విధమ్. (భ.గీ 15-14)**

తా:- నేను 'వైశ్యానరుడను' జఠరాగ్నిగా ప్రాణుల యొక్క శరీరమును ఆశ్రయించి ప్రాణము, అపాన వాయువులతో గూడుకొని, నాలుగు విధములగు అన్నమును పచనము చేయుచున్నాను.

ఇక్కడ భగవానుడు మానవులు తీసుకునే నాలుగు రకాలయిన ఆహారాన్ని పచనము చేసేది కూడా నేనే అని చెపుతున్నారు. మరి ఆ నాలుగు రకాల, ఆహారాలు ఏమిటో చూద్దాం.

1) భక్ష్యము:- దంతములచే కొరికి తినే కఠిన పదార్ధములు, పిండివంటలు, కూరగాయలు, పళ్ళు మున్నగునవి.

2) భోజ్యము:- నాలుకచే చప్పరించి మ్రింగే మెత్తటి పదార్ధములైన అన్నము మొదలగునవి.

3) లేహ్యము:- నాలుకచే రుచి చూడబడు పచ్చళ్ళు మొదలగునవి.

4) చోష్యము:- నోటిచే జుర్రబడు పాయసము, చారు, మజ్జిగ మొదలగునవి.

పై దానిని బట్టి మనం గ్రహించవలసింది 4 రకాల ఆహారాలలో దంతాలు ఉపయోగించి తీసుకునే ఆహారం కూడా వుంది. ఆ ఆహారమే శాకాహారం. మరి దంతాలు ఎవరికి వున్నాయి? శాకాహార జీవులకు మాత్రమే వున్నాయి. శాకాహార జీవులు శాకాహారాన్ని తప్పనిసరిగా దంతాలు ఉపయోగించి మాత్రమే తీసుకొనగలవు. అందుచేత దంతాలు వున్నవన్నీ శాకాహారులే.

ప్రతి జీవికీ ఆహారం భగవంతుని సృష్టిలో తప్పనిసరి అవసరం. ఏ జీవి జీవించాలన్నా ఆహారం తీసుకోవలసిందే. ఆహారం తీసుకోకుండా ఏ

జీవి తన జీవిత కాలం జీవించలేదు. అందుచేత **భగవంతుని సృష్టిలోని ఏ ప్రాణి అయినా ఆహారం తీసుకోవడం పాపం కాదు. కాని ఎవరు ఏ ఆహారం తీసుకోవలన్నదే ముఖ్యం.** ఎవరు ఏ ఆహారం తీసుకోవాలో భగవంతుడే నిర్దేశించాడు. అందుకే దానికి అనుగుణంగానే వాటి శరీరాలు నిర్మించాడు.

మానవులకు నమిలి తినే శాకాహారాన్ని నిర్దేశించాడు. అందుకే దంతాలు ఇవ్వబడ్డాయి. అలాగే మాంసాహారం నిర్దేసించబడిన పులి, సింహం లాంటి వాటికి దంతాలు ఇవ్వలేదు. మాంసాన్ని, మాంసం ముక్కలను నమలకుండా మింగుతాయి.

మాంసాహారులైన పులి, సింహం శాకాహారం తినవు, తినలేవు కూడా! అంతేకాదు అవి పచ్చి మాంసం మాత్రమే తింటూ తమ జీవితకాలం జీవించగలవు. అలాగే మానవుడు పచ్చి మాంసం తింటూ రెండు, మూడు వారాలకు మించి జీవించలేడు. కాని శాకాహారం తీసుకుంటూ తన జీవితకాలం జీవించగలడు. అంటే భగవంతుడు మానవులకు నిర్దేసించిన ఆహారం శాకాహారం మాత్రమే.

అందుచేత **దంతాలు వున్న మానవులు శాకాహారం తీసుకోవడం పాపం కాదు. అలాగే దంతాలు లేని పులి, సింహం లాంటివి మాంసం తినడం పాపం కాదు.** అది భగవంతుడు వాటికి నిర్దేశించిన సహజమైన ఆహారం. అలా శాకాహారులు శాకాహారం తీసుకోవడం, మాంసాహారులు మాంసాహారం తీసుకోవడం సృష్టిలోని సహజ లక్షణం. దానికి విరుద్ధంగా ప్రవర్తించడం సృష్టి విరుద్ధం. సృష్టికి విరుద్ధంగా ప్రవర్తించడమే పాపం.



సృష్టిలోని అన్నిటిలో జీవం వుంది. అంటే ప్రాణం వుంది. జీవం లేకపోతే సృష్టిలో ఏదీ వుండదు. జీవం లేనిది కొంతకాలానికి సృష్టిలో అదృశ్యమైపోతుంది. అందుచేత మొక్కలలో **జీవం వుందా? లేదా? అన్నది ముఖ్యం కాదు. సృష్టికి, సృష్టి నియమాలకు అనుగుణంగా ప్రవర్తించామా? లేదా? అన్నదే ముఖ్యం.** అలా సృష్టికి, సృష్టి ధర్మానికి, అంటే ప్రకృతికి, అంటే భగవంతునికి అనుగుణంగా ప్రవర్తించిన వారికి, జీవించిన వారికి ఎప్పటికి కష్టాలు రావు. దానికి విరుద్ధంగా ప్రవర్తిస్తేనే కష్టాలు. అందుచేత ఆలోచించే శక్తి వున్న మానవులు ఈ విషయాన్ని బాగా ఆలోచించాలి. అర్ధం చేసుకోవాలి. శాకాహారం తీసుకుంటూ ఆనందంగా జీవించాలి.

అంతేకాదు జీవితమన్నది **"తినడం కోసం మాత్రమే కాదు. జీవిస్తున్నాము కాబట్టి, జీవించాలి కాబట్టి తినాలి".** అందుకే అంటారు. **"తినడం కోసం బ్రతకడం కాదు, బ్రతకడానికి తినాలి"** అలా బ్రతకడానికి మానవులకు శాకాహారం చాలు. అలా శాకాహారం తీసుకుంటూ అసలు జీవితం ఎందుకు? జీవిత లక్ష్యం ఎమిటి? అన్నది తెలుసుకోవాలి, దాన్ని సాధించాలి. అలా సాధించిన వాడే సరైన మానవుడు, అదే సరైన జీవితం. మానవ జీవిత లక్ష్యం ఏమిటో భగవద్గీతలో స్పష్టంగా భోధించబడింది. దానిని అధ్యయనం చేసి శ్రీ కృష్ణ భగవానుడు భోధించిన మార్గంలో పయనించండి.

అదే పత్రీజీ భోధిస్తున్నారు. **"మానవుడు తినవలసింది శాకాహారం, చేయవలసింది ధ్యానం"** ఇదే ఆనందమయ జీవనమార్గం.





# 'భగవద్గీత' అర్థం కావాలంటే!

భగవానుడు బోధించిన దానినే "భగవద్గీత" అంటాం. సాక్షాత్తూ భగవానుడు బోధించాడు కాబట్టి "భగవద్గీత" చాలా గొప్ప గ్రంథమయ్యింది. అందరికీ ఆచరణ యోగ్యమయ్యింది. ఒక రకంగా చెప్పుకోవాలంటే భగవద్గీతలో లేనిదంటూ లేదు. బోధించనిది అంటూ లేదు. చూడగలిగితే సమస్తమూ అందులోనే వుంది.

అందుకే యుగయుగాల నుంచి అందరికీ ప్రామాణిక గ్రంథమయ్యింది. అంతేకాదు **ఇంకా ఎన్ని యుగాలు మారినా, ఎన్ని గ్రంథాలు వచ్చి, కాలగర్భంలో కలసిపోయినా 'భగవద్గీత' మాత్రం అందరికీ ప్రామాణికంగా, ఆచరణ యోగ్యంగా వుంటుంది.** కారణం 'భగవానుడు' బోధించాడు కాబట్టి, వేదవ్యాసులంతటి వారు వ్రాశారు కాబట్టి. అందుచేత ప్రతీ ఒక్కరూ **'భగవద్గీత'ను పారాయణం చెయ్యడం కాదు, గీతార్థం తెలుసుకుని పాటించాలి.** పాటించిన వారికే ఫలితం కాని, పారాయణ చేసిన వారికి ఏ ప్రయోజనం చేకూరదు.

చిన్న ఉదాహరణ చూద్దాం. "పాలుత్రాగితే బలం... పాలు త్రాగితే బలం... అని లక్షసార్లు అంటే బలం వస్తుందా? రాదు కదా? త్రాగితేనే వస్తుంది". అలాగే 'భగవద్గీత' పారాయణ చేస్తే ఫలితం రాదు. ఆచరిస్తేనే వస్తుంది. అందుకే **లక్షసార్లు భగవద్గీతను పారాయణ చేసే కంటే అందులోని ఒక్క శ్లోకాన్ని అర్థం చేసుకుని ఆచరిస్తే ఎంతో ఫలితం వస్తుందంటారు.**

మరి 'భగవద్గీత'ను ఆచరించాలంటే ముందు అర్థం చేసుకోవాలి. కారణం అర్థం కాని వారు ఆచరించలేరు. అందుచేత 'గీత'ను అధ్యయనం చేసే వారు, చదివే వారు ముందు భగవానుడు చెప్పింది అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. ఇది ముఖ్యం. మరి 'గీత' అర్థం కావాలంటే ఏం

చెయ్యాలి?

ఎందుచేతనంటే గీతను బోధించింది సామాన్యుడు కాదు, పండితుడు కాదు. అసామాన్యమైన, ఆత్మస్థితిలో వున్న ఒక గొప్ప 'యోగీశ్వరుడు'. అటువంటి 'యోగీశ్వరుడు' బోధించింది అర్థం చేసుకోవాలంటే మనం కూడా యోగ స్థితి సంపాదించాలి. యోగాన్ని అభ్యసించాలి. అంటే 'ధ్యాన యోగి'గా మారాలి. అంటే ధ్యానాన్ని చెయ్యాలి. దానితో పాటు 'సాత్వికమైన శాకాహారం' తీసుకోవాలి. అప్పుడే భగవద్గీత బాగా అర్థమవుతుంది. అందుకే 'ధ్యానం' చేసే వారికే 'భగవద్గీత' బాగా అర్థమవుతుంది. 'ధ్యానం' చెయ్యని వారికి 'భగవద్గీత' ఎప్పటికీ అర్థం కాదు అని అంటారు.

**'భగవద్గీత' అర్థం కావాలంటే మరొక విషయం తెలుసుకోవాలి!**

భగవద్గీత అర్థం కావాలంటే అసలు భగవానుడెవరో తెలుసుకోవాలి. కారణం లోకంలో భగవానుడంటే విగ్రహము, ఫోటో అన్న భావంలోనే వున్నారు. అందుకే భగవద్గీతలో భగవానుడు ఎక్కడ నేను అని చెప్పినా ప్రతీ ఒక్కరికీ ఆయన ఫోటో కానీ, బొమ్మ కానీ గుర్తుకు వస్తుంది తప్ప, ఇంక ఏమీ గుర్తుకు రావటం లేదు. శ్రీ కృష్ణుడు అనగానే రూపంగా భావిస్తూ గీతను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే గీత అర్థం కాకపోవడానికి మరొక కారణం. కానీ భగవానుడు అర్జునునకు తాను ఆత్మను అని స్పష్టంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ అహమాత్మా గుడాకేశా సర్వభూతాశయ స్థితః (భ.గీ.10-20)**

తా॥ ఓ అర్జునా! సర్వ ప్రాణులలో స్థితమై వున్న ఆత్మను నేనే అయి వున్నాను అని చెప్పారు. అంటే ఆయన తాను కనిపించని, నశింపులేని, సర్వత్రా వ్యాపించి వున్న శక్తివంతమైన 'ఆత్మ'ను అని చెప్పుకున్నారు. కానీ విగ్రహాన్ని, బొమ్మను, ఫోటోను అని చెప్పుకోలేదు. కానీ అంతా భగవానుని రూపంగా భావిస్తూ అలాగే గీతను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక చిన్ని ఉదాహరణ చూద్దాం.

**శ్లో॥ వీతరాగ భయక్రోధా మన్మయా మాముపాశ్రితా:**
**బహవో జ్ఞానతపసాపూతామద్భావమాగతాః (భ.గీ.4-10)**

తా:- అనురాగము, భయము, క్రోధము విడిచినవారు, నాయందే లగ్నమైన చిత్తము గలవారు, నన్నే ఆశ్రయించిన వారునగు అనేకులు ఇట్టి జ్ఞాన తపస్సుచే

పవిత్రులై నా స్వరూపమును పొందియున్నారు.

ఇక్కడ నాయందే లగ్నమైన చిత్తము కలవారు, నన్నే ఆశ్రయించిన వారు అన్న మాటను చాలా మంది, విగ్రహము, ఫోటోగా భావించి, వాటిపై మనస్సు వుంచి వాటినే చూస్తూ వాటిని పూజ, భజనల ద్వారా ఆశ్రయిస్తున్నారు. కానీ 'భగవానుని' 'ఆత్మ'గా అర్థం చేసుకున్నవారు 'ధ్యానం' ద్వారా భగవానుని అంటే ఆత్మను ఆశ్రయిస్తున్నారు. గమనిస్తే రెండు సందర్భాలలో కూడా భగవానునే ఆశ్రయిస్తున్నారు.

కానీ అర్థం కాని వారు భగవానుని 'అసత్యరూపాన్ని' ఆశ్రయిస్తున్నారు. అర్థం చేసుకున్నవారు భగవానుని 'సత్య రూపాన్ని' ఆశ్రయిస్తున్నారు. కానీ భగవానుడు అసత్యం కాదు కదా? ఆయన సత్యరూపుడు. అందుచేత అలా ఎవరైతే ఆయన సత్యరూపాన్ని 'ధ్యానం' ద్వారా ఆశ్రయిస్తారో వారు మాత్రమే భగవానుని పొందగలరు.

అలా గీతలో 'భగవానుడు' అనగానే 'ఆత్మ' అని అర్థం చేసుకుని ఆ భావంతో అధ్యయనం చేస్తే భగవద్గీత మనకు చక్కగా అర్థమవుతుంది. అప్పుడు బాగా ఆచరించగలుగుతాం. జీవితంలో ఎన్నో లాభాలు పొందుతాం. అందుచేత గీతలో భగవానుడు నేను, నన్ను అని అన్నప్పుడల్లా "ఆత్మ" అని తెలుసుకోవాలి, గుర్తుంచుకోవాలి. ఆ రకంగానే గీతను అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. భగవానుడు అనగానే రూపాన్ని గుర్తు చేసుకోకూడదు. **నిరాకార, నిర్గుణ, 'ఆత్మే' భగవంతుడు అన్నది పదే పదే గుర్తుంచుకోవాలి. ఆయన ఆత్మతత్వాన్ని అర్థం చేసుకోవాలి. భగవానుని 'తత్వ' దృష్టితోనే చూడాలి. అంతే కానీ 'రూప' దృష్టితో చూడకూడదు.**

అలా 'తత్వ' దృష్టితో చూసిన వారికి భగవద్గీత చక్కగా అర్థమవుతుంది. బాగా ఆచరిస్తారు. మంచి ఫలితాలు పొందుతారు. ఈ 'తత్వ దృష్టి' కూడా ఆ భగవంతుని అంటే 'ఆత్మను' ఆశ్రయించిన వారికే అంటే 'ధ్యానం' చేసిన వారికే అర్థం అవుతుంది. అందుచేత ధ్యానం చెయ్యండి. ఎవరైతే ఎంత ఎక్కువ ధ్యానం చేస్తారో వారికి 'గీత' అంత బాగా అర్థమవుతుంది. అర్థమయ్యే కొద్దీ బాగా ఆచరించగలుగుతారు. మంచి ఫలితాలు సాధిస్తారు. కారణం 'ధ్యానం' చేసే వారు దేహ, మనో, బుద్ధి స్థితులు దాటి 'ఆత్మ' స్థితికి చేరుకుంటారు. ఆ స్థితిలో వున్నప్పుడే 'భగవద్గీత' బాగా అర్థమవుతుంది.



# "భగవద్గీతను బట్టి జ్ఞానులు! అజ్ఞానులు!"

లోకంలో వున్నవారంతా మానవులే. చూడటానికి అంతా మానవులలాగే వుంటారు. కానీ వారి ప్రవర్తనలోనే చాలా తేడా వుంటుంది. ఆలోచనా విధానంలో తేడా వుంటుంది. మాట్లాడే విధానంలో తేడా వుంటుంది. చేసే కర్మలు, కోరే కోరికల్లో చాలా తేడా వుంటుంది. అంతే కాదు చాలా మంది దుఃఖంలో వుంటారు. కొంతమందే ఆనందంగా జీవిస్తూ వుంటారు. కొంతమంది లోకానికి ఇతరులకు సేవలు చేస్తూ వుంటారు. చాలామంది లోకానికి, ఇతరులకు కీడు చేస్తారు, నష్టాన్ని, కష్టాల్ని కలిగిస్తారు. కొంతమంది పాపాలు చేస్తుంటే, కొంతమంది మంచి కార్యాలు చేస్తున్నారు. చాలామంది భగవంతుడెవరో తెలుసుకోకుండా ఆరాధనలు చేస్తుంటే! కొద్దిమంది మాత్రమే భగవంతుని "ఆత్మ తత్వాన్ని" తెలుసుకుని దానికి తగ్గ ధ్యాన సాధనలు చేస్తున్నారు.

మరి మానవుల ప్రవర్తన ఇలా వుండటానికి కారణం? మానవులకు భగవంతుని యొక్క, సృష్టి యొక్క "జ్ఞానం" లేకపోవడమే. అటువంటి జ్ఞానం లేని వారిని 'అజ్ఞానులు' అంటారు. వున్నవారిని 'జ్ఞానులు' అంటారు. భగవంతునికి సంబంధించిన, భగవంతుని సృష్టికి సంబంధించిన 'జ్ఞానం' వున్న వారి ప్రవర్తన ఒక రకంగా వుంటుంది. అది లేని వారు, అంటే 'అజ్ఞానుల' ప్రవర్తన మరొక విధంగా వుంటుంది. 'జ్ఞానమున్న' వారు భగవంతునికి, సృష్టికి, సృష్టి ధర్మాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. ఆ జ్ఞానం లేని 'అజ్ఞానులు' భగవంతునికి, సృష్టి ధర్మాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తారు.

భగవంతునికి, సృష్టి ధర్మాలకు అనుగుణంగా ప్రవర్తించేవారు ఎప్పుడూ ఆనందంగా జీవిస్తారు. విరుద్ధంగా ప్రవర్తించేవారు కష్టాలకు

లోనవుతారు, దుఃఖంలో వుంటారు. రక్షింమని ప్రార్థనలు, ఆరాధనలు చేస్తూ వుంటారు. ఒక విధంగా చెప్పాలంటే **"ఎవరికైనా కష్టాలు వున్నాయి అంటే! వారు సృష్టి ధర్మాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారనే లెక్క"** అలా ప్రవర్తించడానికి కారణం వారి యొక్క 'అజ్ఞానం'.

అందుచేత ఎవరైనా కష్టాల నుంచి, సమస్యల నుంచి, దుఃఖం నుంచి బయటపడాలంటే ముందు 'అజ్ఞానం' నుంచి బయటపడాలి. 'జ్ఞానం' సంపాదించుకోవాలి. 'జ్ఞానవంతులు' కావాలి. అపుడే జీవితం ఆనందమయమవుతుంది. మరి మనమిపుడు 'అజ్ఞానం'లో వున్నామా? 'జ్ఞానం'లో వున్నామా? అన్నది తెలియాలంటే ఎలా? ఈ విషయం భగవద్గీతలోనే శ్రీ కృష్ణ భగవానుడు తెలియ చేయడం జరిగింది. మరి భగవానుని ప్రకారం ఎవరు 'జ్ఞానులో'? ఎవరు 'అజ్ఞానులో'? చూద్దాం. ముందుగా 'జ్ఞానులు' ఎవరో చూద్దాం. వారు ఎలా వుంటారో భగవానుని సందేశం ప్రకారం వారి ప్రవర్తన ఎలా వుండాలో చూద్దాం.

**శ్లో॥ అమానిత్వమదమ్భిత్వమహింసా క్షాన్తిరార్జవమ్**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః (భ.గీ.13-8)**

**శ్లో॥ ఇన్ద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ**
**జన్మ మృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ (భ.గీ.13-9)**

**శ్లో॥ ఆసక్తి రనభిష్వఙ్గః పుత్రదారగృహాదిషు**
**నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు (భ.గీ.13-10)**

**శ్లో॥ మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ**
**వివిక్త దేశ సేవిత్వమరతిర్జనసంసది. (భ.గీ.13-11)**

**శ్లో॥ అధ్యాత్మ జ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్**
**ఏతజ్జ్ఞానమితి ప్రోక్తమజ్ఞానం యదతోన్యథా (భ.గీ.13-12)**

తా:- తన్ను తాను పొగడుకొనకుండుట (మనసులో కాని, మాటలతో కాని) డంబము లేకుండుట. పరప్రాణులను బాధింపకుండుట (జీవహింస, మాంస భక్షణ చేయకుండుట) ఓర్పు కలిగి వుండుట, ఋజుత్వము కలిగి వుండుట అంటే కుటిల స్వభావము లేకుండుట, బాహ్య, అంతర శుద్ధి (మంచి

గుణాలు) కలిగి వుండుట, మనస్సును బాగుగా నిగ్రహించుట (ధ్యానం ద్వారా).

ఇంద్రియ విషయము అంటే శబ్దము (చెవులు), స్పర్శ (చర్మము), రూపము (కళ్ళు), రసము (నాలుక), గంధము (ముక్కు)లందు (ఇంద్రియ సుఖములందు విరక్తి కలిగి వుండుట, అహంకారం లేకుండుట, పుట్టుక, చావు, ముసలితనము, రోగము అను వాటి వలన కలుగు దుఃఖమును దోషమును మాటి మాటికీ తలచుకొనుట.

పుత్రులు (సంతానము) భార్య, ఇల్లు, మున్నగు వాని యందు ఆసక్తి లేకుండుట, మరియు వారికి కలుగు సుఖదుఃఖములు తనకే కలిగినట్లు భావింపకుండుట. ఇష్టమైనవి, అయిష్టమైనవి సంప్రాప్తించినపుడు సమ బుద్ధి కలిగి వుండుట.

నా యందు (ఆత్మ యందు) అనన్యమైన భక్తి కలిగియుండుట. ఏకాంత వాసమును ఆశ్రయించుట. జన సమూహము నందు ప్రీతి లేకుండుట.

ఆధ్యాత్మిక జ్ఞానము (ఆత్మకు సంబంధించిన జ్ఞానము) నిరంతరము కలిగి వుండుట. తత్వ జ్ఞానము (ఆత్మ తత్వం అంటే భగవంతుని తత్వం) యొక్క గొప్ప ప్రయోజనమును తెలిసికొనుట. అనునవన్నియు జ్ఞానమని చెప్పబడును.

పై శ్లోకాల ద్వారా భగవానుడు జ్ఞానం గురించి తెలియ చేయడం జరిగింది. అలా ఎవరైతే ప్రవర్తిస్తారో వారే 'జ్ఞానులు'. వారికే 'జ్ఞానమున్నట్టు'. అలాంటి వారు ఎప్పుడూ ఆనందంలో వుంటారు. వారు చివరకు ముక్తిని కూడా పొందుతారు. ఆలోచించుకోండి మీ ప్రవర్తన అలా వుందా? లేదా? అలా వుంటే మీరు 'జ్ఞానులు'. లేకపోతే మీరు ఎన్ని అనుకున్నా మీరు 'అజ్ఞానులే'. మీరు ఖచ్చితంగా దుఃఖంలోనే వుంటారు. మీకు ఎన్ని సిరి, సంపదలు వున్నా, భోగభోగ్యాలు వున్నా, పేరు ప్రఖ్యాతులు వున్నా, పదవులు వున్నా మీకు శాంతి వుండదు. 'దుఃఖమే' వుంటుంది.

అలాగే భగవానుడు 'అజ్ఞానమంటే' ఏమిటి? ఎలాంటి ప్రవర్తన గలవారు అజ్ఞానులో కూడా తెలియ చేయడం జరిగింది. అలాగే 'జ్ఞానులను' దైవసంబంధమైన గుణములు కలవారినిగా, అలాగే 'అజ్ఞానులను' అసుర

సంబంధమైన గుణములు కల వారినిగా భగవంతుడు తెలియచేయడం జరిగింది. అలాంటి గుణములు కలిగిన 'అజ్ఞానులు' ఎవరో ఈ క్రింది శ్లోకాలలో చూద్దాం.

**శ్లో॥ ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః**
**న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే (భ.గీ.16-7)**

తా:- అసుర స్వభావము గల జనులు ధర్మ ప్రవృత్తిని గాని, అధర్మ నివృత్తిని గాని ఎరుగరు. వారి యందు శుచిత్వము గాని, ఆచారము (సత్కర్మానుష్ఠానము) గాని, సత్యము గాని వుండదు.

**శ్లో॥ కామమాశ్రిత్య దుష్పూరం దమ్భమానమదాన్వితాః**
**మోహాద్గృహీత్వాసద్గ్రాహాన్ ప్రవర్తన్తేశుచివ్రతాః (భ.గీ.16-10)**

తా:- వారు తనివి తీరని కామము (కోరికలు) నాశ్రయించి దంబము అభిమానము, మదము (గర్వము) కలవారై అవివేకము వలన చెడు పట్టుదలలనాశ్రయించి, నీచ వృత్తులు గల వారై ప్రవర్తిస్తారు

**శ్లో॥ ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః**
**ఈహన్తే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్ (భ.గీ.16-12)**

తా:- వారు పెక్కు ఆశాపాశములచే (ఆశలు, బంధములు) బంధింపబడిన వారై, కామ, క్రోధములనే ముఖ్యముగా ఆశ్రయించిన వారై కోరికలు అనుభవించుట కొరకు అన్యాయ మార్గముల ద్వారా ధనాన్ని కోరుతూ వుంటారు.

**శ్లో॥ ఇదమద్య మయా లబ్ధమిమం ప్రాప్స్యే మనోరథమ్**
**ఇదమస్తీ దమసి మే భవిష్యతి పునర్ధనమ్ (భ.గీ.16-13)**

**శ్లో॥ అసౌ మయా హతశ్శత్రుర్హనిష్యే చాపరానపి**
**ఈశ్వరోహమహం భోగీ సిద్ధోహం బలవాన్ సుఖీ (భ.గీ.16-14)**

**శ్లో॥ ఆఢ్యోభిజనవానస్మి కోన్యోస్తి సదృశో మయా**
**యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః (భ.గీ.16-15)**

**శ్లో॥ అనేకచిత్తవిభ్రాన్తా మోహజాలసమావృతాః**
**ప్రసక్తాః కామభోగేషు సతన్తి నరకేశుచౌ (భ.గీ.16-16)**

తా:- వారు ఇంకా "నేను కోరుకున్నది పొందాను. ఈ కోరికను ఇక మీదట పొందగలను; ఈ ధనము ఇపుడు నాకు ఉంది, ఇంకా ఎంతో ధనము నేను సంపాదించగలను.

ఈ శత్రువును నేనిపుడు చంపితిని. తక్కిన శత్రువులను కూడా చంపగలను; నేను ప్రభువును అంటే గొప్పవాడను. సమస్త భోగములను అనుభవించుచున్నాను. తలచిన కార్యము నెరవేర్చుకోగల శక్తికలవాడను, బలవంతుడను, సుఖవంతుడను, ధనవంతుడను.

గొప్ప వంశమున జన్మించిన వాడను. నాతో సమానమైన వాడు మరియొకడు ఎవడు కలడు? నేను యజ్ఞాలు చేస్తాను, దానములనిస్తాను, ఆనందాన్ని అనుభవిస్తాను.

అని యీ ప్రకారంగా అజ్ఞానముచే మోహమును పొందినవారు అనేక విధములైన చిత్తచాంచల్యములతో వున్నవారు. మోహము (భార్య, పుత్ర, పౌత్రాదులందు అభిమానము)చే కప్పబడిన వారు. కామము (కోరికలు) అనుభవించుట యందు మిగుల ఆసక్తి గల వారు. వీరంతా అసుర ప్రవృత్తి కలవారు అంటే 'అజ్ఞానము'లో వున్నవారు. వీరంతా నరకములో పడతారు.

**శ్లో॥ ఆత్మసమ్భావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః**
**యజన్తే నామయజ్ఞై స్తే దమ్భనావిధిపూర్వకమ్ (భ.గీ.16-17)**

తా:- వీరు తమను తాము గొప్పగా తలుస్తారు. మర్యాద వుండదు. ధనం వుందని, అభిమానంతో (గొప్పతనంతో) మదంతో ఉంటారు. అహంకారము, బలము, గర్వము, కామము, క్రోధము బాగా ఉంటుంది. తమ శరీరములో, ఇతరుల శరీరములలో ఉన్న నన్ను (ఆత్మను) తెలియక అందరినీ ద్వేషిస్తారు, అసూయాపరులై ఉంటారు. గొప్పకోసం శాస్త్ర విరుద్ధంగా నామమాత్రపు యజ్ఞయాగాలు చేస్తుంటారు.

అలా భగవానుడు అజ్ఞానంలో వుండేవారి ప్రవర్తన గురించి చెప్పడం జరిగింది. అలా ప్రవర్తించే వారికి ఆయన ఎలాంటి పరిస్థితి కలగ చేస్తానన్నాడో! ఈ క్రింది శ్లోకంలో చెప్పడం జరిగింది.

శ్లో॥ తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్
క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు (భ.గీ.16-19)

తా:- అలా సమస్త ప్రాణులలో ఆత్మ రూపుడినై వున్న నన్ను ద్వేషించు, క్రూరులైన మనుజాధములను నేను జనన, మరణములతో ఉండు దుఃఖకరమైన ఘోర సంసారమందు మాటిమాటికీ పడవేసి వారిని బహు దుఃఖకరమైన అసుర యోనులందు పుట్టించెదను.

అలా అజ్ఞానులకు ఎలాంటి గతి పడుతుందో భగవానుడు తెలియచేయడం జరిగింది. మరి మనం మన ప్రవర్తనను బట్టి అజ్ఞానంలో వున్నామా? జ్ఞానం పొందామా? అన్నది కూడా తెలుసుకోవచ్చు. మన జీవితం, మన భవిష్యత్ ఎలా వుండబోతుందో వూహించుకోవచ్చు. ఒకవేళ మన ప్రవర్తన అజ్ఞానకరంగా వుంటే తప్పనిసరిగా మన ప్రవర్తన మార్చుకోవాలి. జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. లేకపోతే నష్టపోయేది మనమే. కష్టాల పాలయ్యేది మనమే.

**మన జీవితం మనం చేసే కర్మలను బట్టి మాత్రమే వుంటుంది. కానీ మనం చేసే ఆరాధనలు బట్టి వుండదు.** కర్మలు మన యొక్క "జ్ఞానాన్ని, అజ్ఞానాన్ని" బట్టి వుంటాయి. అందుచేత ప్రతీ ఒక్కరూ అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. ప్రవర్తన మార్చుకోవాలి. భగవంతుడు బోధించిన దానికి అనుగుణంగా మారాలి. ప్రవర్తించాలి. జీవించాలి. ఇది చాలా ముఖ్యం.

మరి అజ్ఞానం తొలగించుకుని జ్ఞానం పొందాలంటే మార్గమేది? దానికి రెండే రెండు మార్గాలు. (1) సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి. (2) శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చెయ్యాలి. ఇవి తప్ప వేరే మార్గం లేదు. ఇవి రెండూ ఆచరించిన వారే జ్ఞానం సంపాదించుకోగలరు. జ్ఞానులులా ప్రవర్తించగలరు. సమస్యల నుండి, దుఃఖం నుండి ముక్తిని పొందగలరు.

అందుకే పత్రీజీ అంటారు.

**"ధ్యానం వల్లనే జ్ఞానం - జ్ఞానం వల్లనే ముక్తి"**

అందుచేత **"ధ్యానం చెయ్యండి - ముక్తిని పొందండి".**

# బ్రహ్మర్షి పత్రీజీ సత్యవాక్కులు - I



1) "విత్తనంలో చెట్టు వుంది - ధ్యానంలో సర్వమూ ఉంది!"
2) "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి!"
3) "జీవుడే దేవుడు - దేహమే దేవాలయం!"
4) "సదా వర్తమానంలో జీవించు!"
5) "త్యాగం వల్లనే అమృతత్వం సిద్ధిస్తుంది!"
6) "మన వాస్తవాలకు మనమే కారకులం!"
7) "నో కంప్లైంట్స్! నో జడ్జిమెంట్స్!"
8) "గతం విగతమైతే - వర్తమానం అవగతమవుతుంది!"
9) "ధ్యానం ద్వారానే సంకల్ప శక్తి!"
10) "దానమే ధర్మం - ధర్మమే పుణ్యం!"
11) "ఈ జన్మనే ఆఖరి జన్మగా చేసుకో!"
12) "మన జన్మలను మనమే ఎన్నుకుని వచ్చాం!"
13) "అన్ని రకాల జ్ఞానాలకు మూలం 'ధ్యానం'!"
14) "ధ్యానం ద్వారానే దివ్యజ్ఞాన ప్రకాశం!"
15) "ఆత్మజ్ఞానం చేతనే ఊర్ధ్వలోక ప్రాప్తి!"
16) "నోటిలోని మాటే నుదుటి మీద రాత!"
17) "హింసను వీడితే మానవుడు - హంసను పడితే దేవుడు!"
18) "హింసో పరమో అధర్మః!"
19) "సకల ప్రాణికోటితో మిత్రత్వమే బుద్ధత్వం!"
20) "ధ్యానం వల్లనే జ్ఞానం - జ్ఞానం వల్లనే ముక్తి!"
21) "దేనిపట్ల శ్రద్ధ వుంటే అలాంటి జ్ఞానం వస్తుంది!"
22) "నరుడు నారాయణుడు కావడమే ప్రతి ఒక్కరి జీవితలక్ష్యం!"
23) "గ్రంథాలు చదివితే పండితులు, ధ్యానం చేస్తే ఋషులు అవుతారు!"
24) "పరులకు అపకారం చేస్తే పాపం! - పరులకు ఉపకారం చేస్తే పుణ్యం!
తనకు ఉపకారం చేసుకుంటే మోక్షం!"
25) "అపజయం కూడా విజయంలో ఒక మెట్టే!"

లోకంలో అంతా భగవానుని ఆరాధించడానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు కానీ, భగవానుడు చెప్పింది ఆచరించడానికి ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. భగవానుడు గొప్పవాడే. మామూలు గొప్పవాడు కాదు. వర్ణించలేనంత గొప్పవాడు.

గొప్పవాడు అంటూ ఆరాధించడం కాదు. అంతటి గొప్ప వాడు చెప్పింది ఆచరించాలి! ఇది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి.

ఆరాధనతోనే అన్ని కష్టాలు తీరిపోతే భగవానుడు భూమి మీదకు రావలసిన అవసరం లేదు. అన్ని శ్లోకాల ద్వారా, అంతబోధ చేయనవసరం లేదు. అందుచేత అన్నిటి కంటే భగవానుడు చెప్పింది ఆచరించడం ముఖ్యం. భగవద్గీతలో భగవానుడు బోధించిందంతా దుఃఖ నివారణా మార్గం. మోక్ష మార్గం. అదే అందరికీ ఆచరణీయం.

బ్రహ్మర్షి పత్రీజీ మార్గదర్శకత్వంలో, శ్రీ కృష్ణ భగవానుడు బోధించిన సాధనా మార్గంలో పయనించి, భగవానుడు బోధించిన అపారమైన జ్ఞానసాగరంలో నేను తెలుసుకున్న కొన్ని సత్యాలను మీకందించాలనే ఉద్దేశ్యంతో చేసిన చిన్న ప్రయత్నమే ఈ పుస్తకం. పాఠకులు అధ్యయనం చేసి, అర్థం చేసుకుని, ఆచరించి, తరిస్తారని ఆశిస్తూ....

మీ

**తటవర్తి వీరరాఘవరావు**



రూ.130/-